www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



గురువారం | 14-11-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 209 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి ఉ. 9.44 తదుపరి చతుర్దశి తె. 6.19; నక్షత్రం: అశ్విని రా. 12.33 తదుపరి భరణి; వర్జ్యం: రా.8.59-10.24; దుర్ముహూర్తం: ఉ.10.07-10.52, మ.2.36-3.21; అమృతఘడియలు: రా.6.08-7.33; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.23; సూర్యాస్తమయం: 5.35 | హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

స్విగ్గీ లాభాల డెలివరీ

లిస్టింగ్ రోజున 17 శాతం పెరిగిన కంపెనీ షేరు

రూ.లక్ష కోట్లు దాటిన సంస్థ మార్కెట్ క్యాప్

న్యూఢిల్లీ: ఫుడ్ డెలివరీతోపాటు క్విక్ కామర్స్ సేవలందిస్తున్న స్విగ్గీ లిస్టింగ్‌కు ప్రతికూల మార్కెట్ పరిస్థితుల్లోనూ మంచి స్పందన లభించింది. ఐపీఓ ధర రూ.390తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 5.64 శాతం లాభంతో రూ.412 వద్ద ట్రేడింగ్‌ను ఆరంభించింది. ఆ తర్వాత మరింత పుంజుకొని ఒక దశలో 19.30 శాతం వృద్ధితో రూ.465.30 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. తొలిరోజు ట్రేడింగ్ ముగిసేసరికి స్విగ్గీ షేరు 16.91 శాతం లాభంతో రూ.455.95 వద్ద స్థిరపడింది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1.02 లక్షల కోట్లుగా నమోదైంది. గత వారంలో ముగిసిన రూ.11,327 కోట్ల స్విగ్గీ ఐపీఓకు సైతం ఇష్యూ సైజుతో పోలిస్తే 3.59 రెట్ల స్పందన లభించింది. స్టాక్ మార్కెట్ లిస్టింగ్ సందర్భంగా స్విగ్గీకి తన ప్రత్యర్థి సంస్థ జొమాటో సీఈఓ దీపీందర్ గోయల్ శుభాభినందనలు తెలియజేశారు.



వచ్చే 3-5 ఏళ్లు బలమైన వృద్ధి: సీఈఓ శ్రీహర్ష

వచ్చే 3-5 ఏళ్లపాటు సంస్థ వ్యాపారం బలమైన వృద్ధిని నమోదు చేసుకోనుందని స్విగ్గీ సీఈఓ శ్రీహర్ష మాజేటి ధీమా వ్యక్తం చేశారు. అలాగే, తన క్విక్ కామర్స్ విభాగమైన ఇన్‌స్టామార్ట్ నెట్‌వర్క్, సేవల పరిధి, గిడ్డంగులను మరింత విస్తరిస్తామని మార్కెట్ లిస్టింగ్ అనంతరం శ్రీహర్ష వెల్లడించారు. గడిచిన ఏడాది కాలంలో ఇన్‌స్టామార్ట్ ద్వారా ఆఫర్ చేస్తున్న ఉత్పత్తుల విభాగాలను రెట్టింపు చేసినట్లు ఆయన చెప్పారు.

మిలియనీర్లుగా 70 మంది ఉద్యోగులు

స్విగ్గీ స్టాక్ మార్కెట్ లిస్టింగ్‌తో కంపెనీకి చెందిన 500 మంది ఉద్యోగులు కోటీశ్వరులుగా అవతరించగా.. అందులో 70 మంది మిలియనీర్లుగా (10 లక్షల డాలర్లు= రూ.8.4 కోట్లు) మారారు. సంస్థకు చెందిన 5,000 మంది ఉద్యోగులకు మొత్తం రూ.9,000 కోట్ల సంపద సమకూరింది. గతంలో స్విగ్గీ వీరికి ఎంప్లాయిస్ స్టాక్ ఆప్షన్స్ (ఈసాప్స్) కింద షేర్లను కేటాయించింది. ఈసాప్స్ షేర్ల తాజా విలువ కంపెనీ సిబ్బందిని కోటీశ్వరులు, లక్షాధికారులను చేసింది.

ఈనెల 19 నుంచి ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ ఐపీఓ

ఇష్యూ ధరల శ్రేణి రూ.102-108

ఎన్‌టీపీసీకి చెందిన పునరుత్పాదక ఇంధన విభాగం ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ఈ నెల 19న ప్రారంభమై 22న ముగియనుంది. ఐపీఓ షేర్ల విక్రయ ధర శ్రేణిని కంపెనీ రూ.102-108గా నిర్ణయించింది. ఇష్యూలో భాగంగా కంపెనీ తాజా ఈక్విటీల జారీ ద్వారా రూ.10,000 కోట్లు సమీకరించనుంది. ఆసక్తి గల వారు కనీసం 138 షేర్ల బిడ్ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత బిడ్ సైజును 138 షేర్ల చొప్పున పెంచుకోవచ్చు. ఇష్యూ సైజులో 75 శాతం షేర్లు సంస్థాగత ఇన్వెస్టర్లకు, 15 శాతం సంస్థాగతేతర ఇన్వెస్టర్లకు, 10 శాతం రిటైల్ మదుపరుల కోసం కేటాయించింది. అర్హులైన ఉద్యోగుల కోసం సంస్థ రూ.200 కోట్ల షేర్లను కేటాయించింది. వీరికి ఒక్కో షేరుకు రూ.5 డిస్కౌంట్ కల్పించింది. ఎన్‌టీపీసీ ప్రస్తుత షేర్ హోల్డర్లకు సైతం రూ.1,000 కోట్ల షేర్లను కేటాయించింది. ఈ ఏడాదిలో హ్యుండయ్ ఇండియా (రూ.27,870 కోట్లు), స్విగ్గీ (రూ.11,327 కోట్లు) తర్వాత మూడో అతిపెద్ద ఐపీఓ ఇదే.

2026-27 నాటికి రూ.లక్ష కోట్ల పెట్టుబడులు

సోలార్, పవన విద్యుత్ ప్రాజెక్టుల్లో 2026-27 ఆర్థిక సంవత్సరం నాటికి రూ.లక్ష కోట్ల పెట్టుబడి లక్ష్యంగా పెట్టుకున్నట్లు కంపెనీ ఛైర్మన్, ఎండీ గురుదీప్ సింగ్ తెలిపారు. ప్రస్తుతం 3,220 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉన్న సంస్థ.. 2025 మార్చి నాటికి ఈ సామర్థ్యాన్ని 6,000 మెగావాట్లు, 2026 మార్చి నాటికి 11,000 మెగావాట్లు, 2027 మార్చికల్లా 19,000 మెగావాట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	76,850 ▼	70,450 ▼	1,01,000 ▲
ముంబై	75,260 ▲	68,940 ▲	89,750 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

14వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	535
వరంగల్	527	గోదావరి	540
చిత్తూరు	593	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	90	విజయవాడ	109
వరంగల్	90	గుంటూరు	105
కరీంనగర్	90	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	104
కర్నూలు	90	నెల్లూరు	104
విశాఖపట్నం	103	అనంతపురం	104
గోదావరి	109		

4 నెలల కనిష్ఠానికి మార్కెట్

సెన్సెక్స్ 984 పాయింట్లు డౌన్.. 23,500 స్థాయికి జారిన నిఫ్టీ.. 2రోజుల్లో 13 లక్షల కోట్ల నష్టం



ముంబై: స్టాక్ మార్కెట్ సూచీలు మళ్లీ కుప్పకూలాయి. బుధవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 78,000 స్థాయిని కోల్పోగా.. నిఫ్టీ 23,500 స్థాయికి జారుకుంది. ధరల సూచీ 14 నెలల గరిష్ఠానికి ఎగబాకడంతోపాటు విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు పెద్ద మొత్తంలో తరలిపోతున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు బ్యాంకింగ్, ఆటో, యంత్రపరికరాల రంగాల షేర్లలో అమ్మకాలను పోటెత్తించారు. దాంతో సెన్సెక్స్ ఒకదశలో 1,141.88 పాయింట్లు పతనమై 77,533.30 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 984.23 పాయింట్ల నష్టంతో 77,690.95 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ నష్టపోవడం వరుసగా ఇది రెండో రోజు. కాగా, నిఫ్టీ 324.40 పాయింట్లు క్షీణించి 23,559.05 వద్దకు జారుకుంది. సూచీ నష్టపోవడం వరుసగా ఐదో రోజు. జూన్ 24 తర్వాత రెండు సూచీలు ఇంత కనిష్ఠ స్థాయిల్లో ముగియడం ఇదే ప్రథమం. గత రెండు రోజుల్లో బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.13 లక్షల కోట్లకు పైగా పతనమై రూ.429.46 లక్షల కోట్లకు (5.09 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

రూ.50 లక్షల కోట్లు పాయే..
గరిష్ఠాల నుంచి 10 శాతం దిగువకు

సెన్సెక్స్, నిఫ్టీ కరెక్షన్ జోన్‌లోకి ప్రవేశించాయి. ఈ రెండు సూచీలు సెప్టెంబరులో నమోదు చేసిన సరికొత్త ఏడాది (52 వారాల) గరిష్ఠ స్థాయిల నుంచి దాదాపు 10 శాతం క్షీణించాయి. ఏదైనా కంపెనీ షేరు లేదా సూచీ ఏడాది గరిష్ఠం నుంచి పది శాతం పతనమైన పక్షంలో ఆ స్టాక్ లేదా ఇండెక్స్ కరెక్షన్ దశలోకి ప్రవేశించినట్లు భావిస్తారు. 20 శాతం క్షీణిస్తే బేర్ పూర్తిగా పట్టు బిగించినట్టే. ఈ సెప్టెంబరు 27న నమోదు చేసిన సరికొత్త 52 వారాల గరిష్ఠ స్థాయి 85,978.25 పాయింట్లతో పోలిస్తే, సెన్సెక్స్ ఇప్పటివరకు 8,287.3 పాయింట్లు క్షీణించింది. నిఫ్టీ సైతం 26,277 వద్ద నమోదు చేసిన సరికొత్త ఏడాది గరిష్ఠం నుంచి ఇప్పటివరకు 2,718 పాయింట్లు పతనమైంది.

బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ కూడా సెప్టెంబరు 27న నమోదైన ఆల్‌టైం గరిష్ఠ స్థాయి రూ.479.10 లక్షల కోట్ల నుంచి బుధవారం నాటికి రూ.429.46 లక్షల కోట్లకు పడిపోయింది. అంటే, మార్కెట్ సంపద రూ.50 లక్షల కోట్ల మేర హరించుకుపోయింది. ప్రామాణిక సూచీలు మున్ముందు మరింత దిద్దుబాటుకు లోనుకావచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. సూచీలు పది శాతం తగ్గినప్పటికీ, రూ.1,000 కోట్లకు పైగా మార్కెట్ విలువ కలిగిన 900కు పైగా కంపెనీల షేర్లు ఇప్పటికే 20 శాతానికి పైగా క్షీణించడంతో మార్కెట్ బేర్ పట్టులోకి జారుకుందన్న సంకేతాలొస్తున్నాయి. నిఫ్టీ ప్రస్తుత 23,500 స్థాయిని కూడా కోల్పోతే.. మున్ముందు 23,000 వద్దకు జారుకోవచ్చునంటున్నారు.

ఫార్చ్యూన్ 100 శక్తివంతుల్లో నంబర్ 3 సత్య నాదెళ్ల

ముకేశ్ అంబానీ, పిచాయ్‌కూ చోటు
టాప్‌లో ఎలాన్ మస్క్



న్యూయార్క్: ప్రపంచ కుబేరుల్లోనే కాదు, అత్యంత శక్తివంతులైన 100 మంది వ్యాపారవేత్తల జాబితాలోనూ టెస్లా అధినేత ఎలాన్ మస్క్ అగ్రస్థానం సంపాదించారు. 'అత్యంత శక్తివంతులైన 100 మంది వ్యాపారవేత్తలు' పేరుతో ఫార్చ్యూన్ పత్రిక ఒక జాబితా విడుదల చేసింది. ఈ జాబితాలో ఎలాన్ మస్క్ అగ్రస్థానంలో ఉంటే, ఎన్‌విడియా సీఈఓ జెన్‌సెన్ హువాంగ్ రెండో స్థానంలో, మైక్రోసాఫ్ట్ సీఈఓతో సత్య నాదెళ్ల మూడో స్థానంలో నిలిచారు. సత్య నాదెళ్ల, జెన్‌సెన్ హువాంగ్ టెక్నాలజీ, కృత్రిమ మేధతో వ్యాపారాల స్వరూప స్వభావాలనే మార్చివేస్తున్నారని ఫార్చ్యూన్ పత్రిక కితాబిచ్చింది. ఫైనాన్స్, కన్స్యూమర్ టెక్నాలజీలను కొత్త పుంతలు తొక్కిస్తున్న వారెన్ బఫెట్, జెమీ డైమన్, యాపిల్ కంపెనీ సీఈఓ టిమ్ కుక్, మెటా అధినేత మార్క్ జుకర్‌బర్గ్‌కీ ఈ జాబితాలో స్థానం దొరికింది.

అంబానీకి 12వ స్థానం : రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ ఈ జాబితాలో 12వ స్థానంలో నిలిచారు. గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ 10వ స్థానం, అమెజాన్ అధినేత జెఫ్ బెజోస్ 11వ స్థానం సంపాదించారు.

ఆ మూడు బ్యాంకులే కీలకం

ఆర్‌బీఐ జాబితాలో ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంకు

ముంబై: బ్యాంకింగ్ రంగంలో ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకు అత్యంత కీలకమని ఆర్‌బీఐ తెలిపింది. ఆర్‌బీఐ ఈ బ్యాంకులను దేశంలో వ్యవస్థీకృతంగా అత్యంత కీలక బ్యాంకులుగా (డీ-ఎస్ఐబీ) వర్గీకరించింది. దీనికి సంబంధించి బుధవారం ఒక జాబితా విడుదల చేసింది. కొన్ని నిర్దిష్ట ప్రమాణాలకు లోబడి ఈ బ్యాంకులు కామన్ ఈక్విటీ టైర్ 1 (సీఈటీ1) కంటే అధిక మూలధన నిల్వలు కలిగి ఉండాలి. తాజా వర్గీకరణ ప్రకారం ఎస్‌బీఐని బకెట్ 4లో, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకును బకెట్ 2లో, ఐసీఐసీఐ బ్యాంకును బకెట్ 1లో ఆర్‌బీఐ చేర్చింది. దీని ప్రకారం వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఎస్‌బీఐ తన సీఈటీ 1 కంటే 0.80 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు 0.40 శాతం, ఐసీఐసీఐ బ్యాంకు 0.20 శాతం అధిక మూలధన నిల్వలు కలిగి ఉండాలి. ఈ ఏడాది మార్చి నెలాఖరు వరకు ఈ బ్యాంకుల ఆర్థిక స్థితిగతులను పరిశీలించాక ఈ వర్గీకరణ చేసినట్టు ఆర్‌బీఐ తెలిపింది.

జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు మూడు అవార్డులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు మూడు ప్రతిష్ఠాత్మక అవార్డులు లభించాయి. సౌదీ అరేబియాలో జరుగుతున్న సౌదీ ఎయిర్‌పోర్టు ఎగ్జిబిషన్ 2024లో ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ, ఫెసిలిటీ మేనేజ్‌మెంట్, ఎయిర్‌పోర్టు రెవెన్యూ మేనేజ్‌మెంట్ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు డిజిటల్ ట్విన్, ది స్మార్ట్ ట్రాలీ పేరుతో ఈ అవార్డులు లభించాయి. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్‌పోర్టు చూపిస్తున్న ప్రతిభకు ఈ అవార్డులు ఒక గుర్తింపని చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ ఎస్‌జీకే కిషోర్ తెలిపారు.

కల్పతరుకు రూ.2273 కోట్ల ఆర్డర్లు

హైదరాబాద్: ఈపీసీ రంగంలోని కల్పతరు ప్రాజెక్ట్ ఇంటర్నేషనల్‌కు రూ.2273 కోట్ల విలువ గల ఆర్డర్లు దక్కాయి. దేశంలోను, విదేశాల్లోనూ ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ వ్యాపారాలు; దేశంలో నివాస భవన ప్రాజెక్టుల నుంచి ఈ ఆర్డర్లు సమకూరినట్టు కంపెనీ ప్రకటించింది.

హైటెక్ సిటీలో మరో స్టార్ హోటల్

హైదరాబాద్: హైదరాబాద్ హైటెక్ సిటీ ప్రాంతంలో మరో స్టార్ హోటల్ ఏర్పాటు కానుంది. మారియట్ ఇంటర్నేషనల్‌తో కలిసి దేశీయ హోటల్స్ దిగ్గజం సంఫి హోటల్స్ ఈ స్టార్ హోటల్‌ను ఏర్పాటు చేయనుంది. హైదరాబాద్‌తో పాటు బెంగళూరులోని వైట్‌ఫీల్డ్ ప్రాంతంలోనూ రెండు స్టార్ హోటళ్లు ఏర్పాటు చేస్తారు. దీనికి సంబంధించి రెండు సంస్థల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. ఈ మూడు స్టార్ హోటళ్లు 2026-28లో ప్రారంభమవుతాయి. ఈ మూడు హోటళ్ల ఏర్పాటుతో ఈ రెండు నగరాల్లో 568 గదులు అందుబాటులోకి వస్తాయి. మారియట్ ఇంటర్నేషనల్ ఇప్పటికే మన దేశంలో 153 హోటళ్లను నిర్వహిస్తోంది.

స్పోర్ట్స్

2 టీ20ల్లో సెంచరీ చేసిన రెండో పిన్నవయసు భారత బ్యాటర్‌గా తిలక్ వర్మ (22 ఏళ్ల 5 రోజులు). యశస్వీ జైస్వాల్ (21 ఏళ్ల 279 రోజులు) టాప్‌లో ఉన్నాడు.

తిలక్ తుఫాన్



తిలక్ వర్మ (56 బంతుల్లో 107 నాటౌట్)

శతక్కొట్టిన తెలుగు కుర్రాడు

మూడో టీ20లో భారత్ గెలుపు ▸ భయపెట్టిన జెన్సన్

సెంచూరియన్: తిలక్ వర్మ (56 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్స్‌లతో 107 నాటౌట్) సుడిగాలి శతకంతో.. టీమిండియా మళ్లీ గెలుపు బాటపట్టింది. బుధవారం జరిగిన మూడో టీ20లో భారత్ 11 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై గెలిచింది. 4 మ్యాచ్‌ల సిరీస్‌లో 2-1తో పైచేయి సాధించింది. తొలుత భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 219/6 స్కోరు చేసింది. అభిషేక్ శర్మ (25 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లతో 50) హాఫ్ సెంచరీతో అలరించాడు. కేశవ్ మహరాజ్, సిమెలానె చెరో 2 వికెట్లు తీశారు. ఛేదనలో దక్షిణాఫ్రికా ఓవర్లన్నీ ఆడి 208/7 స్కోరు మాత్రమే చేసింది. జెన్సన్ (17 బంతుల్లో 54), క్లాసెన్ (41), మార్‌క్రమ్ (29) టాప్ స్కోరర్లు. అర్ష్‌దీప్ 3, వరుణ్ చక్రవర్తి 2 వికెట్లు పడగొట్టారు. టీమిండియా తరఫున రమణ్‌దీప్ సింగ్ అరంగేట్రం చేశాడు. కీటకాల కారణంగా సౌతాఫ్రికా బ్యాటింగ్ సమయంలో సుమారు 20 నిమిషాలు ఆటకు అంతరాయం కలిగింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా తిలక్ వర్మ నిలిచాడు.

భయపెట్టిన జెన్సన్: భారత స్పిన్నర్ల మాయాజాలంతో.. భారీ ఛేదనలో దక్షిణాఫ్రికా తడబడింది. ఓపెనర్లు రికెల్టన్ (20), హెండ్రిక్స్ (21) ధాటిగా ఆరంభించినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు. రికెల్టన్‌ను అర్ష్‌దీప్ బౌల్డ్ చేయగా.. హెండ్రిక్స్‌ను వరుణ్ బోల్తా కొట్టించాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన స్టబ్స్ (12) రెండు ఫోర్లతో జోరు చూపడంతో.. పవర్‌ప్లే ముగిసేసరికి దక్షిణాఫ్రికా 55/2తో నిలిచింది. మధ్య ఓవర్లలో వరుణ్, అక్షర్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేస్తూ ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచారు. ఈ క్రమంలో ఫామ్‌లో ఉన్న స్టబ్స్‌ను అక్షర్ ఎల్బీగా వెనక్కిపంపాడు. రెండు సిక్స్‌లతో దూకుడుగా ఆడే ప్రయత్నం చేసిన మార్‌క్రమ్‌ను వరుణ్ క్యాచవుట్ చేయడంతో.. 10 ఓవర్లకు సౌతాఫ్రికా 84/4తో ఇబ్బందుల్లో పడింది. అయితే, క్లాసెన్, మిల్లర్ (18) ఐదో వికెట్‌కు 58 పరుగులతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. చివరి 30 బంతుల్లో 86 పరుగులు కావల్సి ఉండగా.. మిల్లర్‌ను పాండ్యా అవుట్ చేశాడు. ధాటిగా ఆడుతున్న క్లాసెన్‌ను అర్ష్‌దీప్ పెవిలియన్ చేర్చడంతో టీమిండియా సులువుగా నెగ్గుతుందనిపించింది. కానీ, జెన్సన్ ఎడాపెడా షాట్లతో భారత శిబిరంలో గుబులు రేపాడు. 19వ ఓవర్‌లో పాండ్యా బౌలింగ్‌లో జాన్సన్ 2 సిక్స్‌లు, మూడు ఫోర్లతో 26 పరుగులు రాబట్టడంతో..



జెన్సన్ (17 బంతుల్లో 54)

ఆఖరి ఓవర్‌లో లక్ష్యం 25 పరుగులకు దిగొచ్చింది. అయితే, జెన్సన్‌ను అవుట్ చేసి అర్ష్‌దీప్ జట్టుకు ఉత్కంఠ విజయాన్ని అందించాడు.

అటు వర్మ.. ఇటు శర్మ: డాషింగ్ బ్యాటర్ తిలక్ కెరీర్‌లో తొలి శతకంతో దుమ్మురేపగా.. గత రెండు మ్యాచ్‌ల్లో విఫలమైన ఓపెనర్ అభిషేక్ హాఫ్ సెంచరీతో అదరగొట్టాడు. సఫారీ బౌలర్లపై విరుచుకుపడ్డ వీరిద్దరూ రెండో వికెట్‌కు 52 బంతుల్లో 107 పరుగులు జోడించడంతో.. భారత్ సవాల్ విసరగలిగే స్కోరు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ సంజూ శాంసన్ (0)ను జెన్సన్ వరుసగా రెండోసారి డకౌట్ చేశాడు. కానీ, వన్‌డౌన్‌లో వచ్చిన తిలక్, అభిషేక్ పోటాపోటీగా షాట్లు ఆడుతూ పవర్‌ప్లేలో స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. వర్మ 4,6 బాదగా.. రెండో ఓవర్‌లో అభిషేక్ 4,6,4తో 15 పరుగులు రాబట్టాడు. ఇక, ఐదో ఓవర్‌లో సిమెలానె బౌలింగ్‌లో అభిషేక్ రెండు భారీ సిక్స్‌లతో మొత్తం 18 రన్స్ సాధించాడు. దీంతో ఆరు ఓవర్లు ముగిసే సరికి భారత్ 70/1తో భారీ స్కోరుకు బాటలువేసింది. అయితే, మధ్య ఓవర్లలో సఫారీ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేయడంతో టీమిండియా పరుగుల వేగం మందగించింది. 9వ ఓవర్‌లో కేశవ్ బౌలింగ్‌లో సిక్స్‌తో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొన్న అభిషేక్.. ఆ వెంటనే స్టంపౌటయ్యాడు. కెప్టెన్ సూర్యకుమార్ (1)ను సిమెలానె స్వల్ప స్కోరుకే పెవిలియన్ చేర్చడంతో భారత్ 110/3తో నిలిచింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన హార్దిక్ పాండ్యా (18) వరుస బౌండ్రీలతో స్కోరు బోర్డులో ఊపు తెచ్చే ప్రయత్నం చేశాడు. 13వ ఓవర్‌లో సింగిల్‌తో తిలక్ ఫిఫ్టీ పూర్తి చేసుకొన్నా.. పాండ్యాను కేశవ్ వికెట్ల ముందు దొరకబుచ్చుకొన్నాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన రింకూ సింగ్ (8) తన సహజ శైలిలో షాట్లు ఆడలేక పోయాడు. కానీ, అప్పటి వరకు ఒకింత నెమ్మదిగా ఆడుతున్న తిలక్.. 15వ ఓవర్‌లో కేశవ్ బౌలింగ్‌లో 4,6,4తో ఒక్కసారిగా గేర్ మార్చడంతో టీమ్ స్కోరు దూసుకెళ్లింది. ఆ తర్వాతి ఓవర్‌లో కొట్జీ బౌలింగ్‌లో రెండు సిక్స్‌లతో చెలరేగిన తిలక్ ఏకంగా 21 పరుగులు రాబట్టాడు. రింకూను సిమెలానె బౌల్డ్ చేయడంతో ఐదో వికెట్‌కు 58 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. సిక్స్‌తో రమణ్‌దీప్ (15) ఖాతా తెరవగా.. బౌండ్రీతో తిలక్ సెంచరీ పూర్తి చేసుకొన్నాడు. రమణ్‌దీప్ రనౌట్ అయ్యాడు. వర్మ దెబ్బకు చివరి 5 ఓవర్లలో సఫారీలు 65 పరుగులు సమర్పించుకోవడంతో.. భారత్ స్కోరు 200 మార్క్ దాటింది.

స్కోరుబోర్డు

భారత్: శాంసన్ (బి) జెన్సన్ 0, అభిషేక్ (స్టంప్డ్) క్లాసెన్ (బి) కేశవ్ 50, తిలక్ (నాటౌట్) 107, సూర్యకుమార్ (సి) జెన్సన్ (బి) సిమెలానె 1, హార్దిక్ (ఎల్బీ) కేశవ్ 18, రింకూ (బి) సిమెలానె 8, రమణ్‌దీప్ (రనౌట్) 15, అక్షర్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 19; మొత్తం: 20 ఓవర్లలో 219/6; వికెట్ల పతనం:** 1-0, 2-107, 3-110, 4-132, 5-190, 6-218; **బౌలింగ్:** జెన్సన్ 4-0-28-1, కొట్జీ 3-0-51-0, సిపామ్లా 4-0-45-0, సిమెలానె 3-0-34-2, మార్‌క్రమ్ 2-0-19-0, కేశవ్ 4-0-36-2.

దక్షిణాఫ్రికా: రికెల్టన్ (బి) అర్ష్‌దీప్ 20, హెండ్రిక్స్ (స్టంప్డ్) శాంసన్ (బి) వరుణ్ 21, మార్‌క్రమ్ (సి) రమణ్‌దీప్ (బి) వరుణ్ 29, స్టబ్స్ (ఎల్బీ) అక్షర్ 12, క్లాసెన్ (సి) తిలక్ (బి) అర్ష్‌దీప్ 41, మిల్లర్ (సి) అక్షర్ (బి) హార్దిక్ 18, జెన్సన్ (ఎల్బీ) అర్ష్‌దీప్ 54, కొట్జీ (నాటౌట్) 2, సిమెలానె (నాటౌట్) 5; **ఎక్స్‌ట్రాలు:** 6; **మొత్తం: 20 ఓవర్లలో 208/7; వికెట్ల పతనం:** 1-27, 2-47, 3-68, 4-84, 5-142, 6-167, 7-202; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-37-3, హార్దిక్ 4-0-50-1, అక్షర్ 4-0-29-1, వరుణ్ 4-0-54-2, రవి బిష్ణోయ్ 4-0-33-0.

అంతా ఆ నలుగురి వల్లే!

- నా కుమారుడి కెరీర్‌కు చేటు
- ధోనీ, కోహ్లీ, రోహిత్, ద్రవిడ్‌పై శాంసన్ తండ్రి ఆరోపణ



న్యూఢిల్లీ: ధోనీ, కోహ్లీ, రోహిత్, ద్రవిడ్ తన కొడుకు ఎదుగుదలను అడ్డుకొన్నారని సంజూ శాంసన్ తండ్రి శాంసన్ విశ్వనాథ్ సంచలన ఆరోపణలు చేశాడు. వీరివల్లే శాంసన్ కెరీర్‌లో అమూల్యమైన పదేళ్లను కోల్పోయాడని అసహనం, ఆవేదన వ్యక్తం చేశాడు. 2015లో సంజూ అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. అయితే, కీపర్‌గా ధోనీ జట్టులో ఉండడంతో అతడిని పక్కనబెట్టేశారు. తర్వాత పగ్గాలు చేపట్టిన కోహ్లీ కూడా శాంసన్‌ను పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో తన కుమారుడికి తగిన అవకాశాలిస్తున్న కోచ్ గంభీర్, సూర్యకు విశ్వనాథ్ కృతజ్ఞతలు తెలిపాడు.

తన్మయ్ శతకం

- హైదరాబాద్ 244/5
- ఆంధ్రతో రంజీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తన్మయ్ అగర్వాల్ (240 బంతుల్లో 124 బ్యాటింగ్) శతకంతో ఆదుకోవడంతో ఆంధ్రతో బుధవారం మొదలైన రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్ గౌరవప్రదమైన స్కోరు దిశగా సాగుతోంది. ఉప్పల్ స్టేడియంలో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ తొలిరోజు చివరికి 5 వికెట్లకు 244 పరుగులు చేసింది. అయితే ఆంధ్ర జట్టు పేలవ ఫీల్డింగ్ హైదరాబాద్ పాలిట వరమైంది. ఈ మ్యాచ్‌లో ఆంధ్ర 4 క్యాచ్‌లు జారవిడవగా అందులో రెండు తన్మయ్ అగర్వాల్‌వి కావడం విశేషం. ఆంధ్ర బౌలర్లలో స్పిన్నర్ విజయ్ 3 వికెట్లు తీయగా, లలిత్, సందీప్‌కు చెరో వికెట్ లభించింది.

కెప్టెన్‌గా హనుమ విహారి

ఈ సీజన్‌లో ఆడిన 4 మ్యాచ్‌ల్లో మూడింట్లో ఓడి, ఒక్క మ్యాచ్‌ని డ్రా చేసుకొని ఒకే ఒక్క పాయింట్‌తో గ్రూపులో అట్టడుగున ఉన్న ఆంధ్ర జట్టు మరోసారి కెప్టెన్‌ను మార్చింది. 4 మ్యాచ్‌లకు ముగ్గురు కెప్టెన్లను ఏసీఏ మార్చడం చర్చనీయాంశమైంది. టీమిండియాకు ఆడిన విహారి, భరత్ అందుబాటులో ఉన్నా తొలుత రికీ భుయ్‌కు, తర్వాత షేక్ రషీద్‌కు సారథ్య బాధ్యతలివ్వగా, హైదరాబాద్‌తో రంజీకి తిరిగి విహారికి పగ్గాలు ఇచ్చారు.

అర్జున్, హంపి, హారిక గేమ్‌లు డ్రా

టాటా స్టీల్ చెస్

కోల్‌కతా: తెలుగు ఆటగాడు అర్జున్ ఇరిగేసి టాటా స్టీల్ చెస్ ఇండియా టోర్నమెంట్‌లో తొలిరోజు జరిగిన ర్యాపిడ్ విభాగం మూడు రౌండ్లను డ్రాగా ముగించాడు. బుధవారం ఇక్కడ మొదలైన ఓపెన్ కేటగిరిలో నిహాల్ సరీన్‌తో ఆరంభ రౌండ్‌ను, ఆ తర్వాత విదిత్, నారాయణన్‌లతో గేమ్‌లను అర్జున్ డ్రా చేసుకున్నాడు. 3 రౌండ్ల అనంతరం అర్జున్ 1.5 పాయింట్లతో ఏడోస్థానంలో ఉన్నాడు. ఇక.. మహిళల విభాగంలో హంపి, హారిక తమ గేమ్‌లను డ్రా చేసుకున్నారు. మూడు రౌండ్లలోనూ తమ ప్రత్యర్థులతో పాయింట్ పంచుకున్నారు. తద్వారా మొదటి రోజు పోటీల తర్వాత హంపి, హారిక చెరో 1.5 పాయింట్లతో వరుసగా 4, 5 స్థానాల్లో కొనసాగుతున్నారు.

బీసీసీఐ చాలెంజర్స్ ట్రోఫీకి ఏడుగురు తెలుగమ్మాయిలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): బీసీసీఐ సీనియర్ మహిళల చాలెంజర్స్ టీ20 ట్రోఫీకి ఏడుగురు తెలుగు క్రికెటర్లు ఎంపికయ్యారు. ఈనెల 17 నుంచి రాంచీలో జరిగే ఈ టోర్నీలో 6 జట్లు పాల్గొంటున్నాయి. ఈ టోర్నీలో తెలంగాణ నుంచి మమత మడివాలా టీమ్-'డి'కి ప్రాతినిధ్యం వహిస్తుండగా టీమ్-'ఎ' తరఫున త్రిషా పూజిత, యశశ్రీ, అరుంధతి రెడ్డి ఆడనున్నారు. ఆంధ్ర నుంచి వాసవి అఖిల, హెన్రీటా పెరీరా టీమ్-'ఈ' నుంచి, శరణ్య టీమ్-'సి' నుంచి బరిలోకి దిగుతున్నారు.

సింధు ముందుకు.. లక్ష్య ఇంటికి

న్యూఢిల్లీ: జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ తొలి రౌండ్‌లో పీవీ సింధు ముందంజవేయగా.. లక్ష్యసేన్ ఓటమిపాలై ఇంటిబాట పట్టాడు. సింధు 21-12, 21-8తో బుసానన్ (థాయ్‌లాండ్)పై గెలిచింది. ఇక, లక్ష్యసేన్ 22-20, 17-21, 16-21తో జున్ హావో (మలేసియా) చేతిలో ఓడాడు.

షూటర్ సందీప్‌కు రజతం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ పారా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ షూటర్ సందీప్ రెడ్డి రజత పతకం కొల్లగొట్టాడు. బుధవారం పుణెలో జరిగిన ఈ పోటీల్లోని 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో సందీప్ ద్వితీయ స్థానం దక్కించుకున్నాడు. రాజస్థాన్ షూటర్లు రుద్రాంశ్‌కు స్వర్ణం, నిహాల్ సింగ్‌కు కాంస్యం గెలుచుకున్నారు.

మళ్లీ ఓడిన బోపన్న జోడీ

ట్యూరిన్ (ఇటలీ): ఏటీపీ ఫైనల్స్‌లో భారత టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్నకు మరోసారి నిరాశే ఎదురైంది. బోపన్న/మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ తమ గ్రూప్‌లో రెండో మ్యాచ్‌లోనూ ఓటమిపాలై సెమీఫైనల్స్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. బుధవారం జరిగిన పోరులో ఆరో సీడ్ బోపన్న ద్వయం 5-7, 3-6తో టాప్ సీడ్ అరెవాలో/పావిక్ జంట చేతిలో పరాజయం పాలైంది.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 14-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 209

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

హైదరాబాద్ సిటీ *

కోచింగ్ సెంటర్ల మోసాలకు చెక్

తప్పుడు యాడ్స్ ఇస్తే తప్పదు జరిమానా

విద్యార్థుల అనుమతి లేకుండా వారి ఫొటోలు, వివరాలు ప్రచురించకూడదు

కొత్త మార్గదర్శకాలు విడుదల చేసిన కేంద్రం



న్యూఢిల్లీ, నవంబరు 13: కోచింగ్ సెంటర్ల మోసపూరిత ప్రకటనలకు చెక్ పెట్టేలా కేంద్రం కొత్త మార్గదర్శకాలు రూపొందించింది. వంద శాతం సెలెక్షన్ అని, కచ్చితంగా జాబ్ వస్తుందని తమ ఫలితాలను ఎక్కువ చేసి చూపిస్తూ కోచింగ్ సెంటర్లు తప్పుదోవ పట్టించేలా ఇచ్చే మోసపూరిత యాడ్స్ నుంచి విద్యార్థులకు

మిగతా 2వ పేజీలో...

కలెక్టర్‌పై దాడి బీఆర్ఎస్ కుట్రే

13 ఇందులో ఎంత పెద్ద వారున్నా.. ఉపేక్షించం

తెలంగాణ ఉద్యమంలో యువత ప్రాణాలు తీశారు

ఇప్పుడూ అదే తీరులో రైతులను రెచ్చగొడుతున్నారు

'ఫార్ములా-ఈ' కేసు నుంచి తప్పించుకోవడానికి

బీజేపీతో కేటీఆర్ ఒప్పందం: డిప్యూటీ సీఎం భట్టి

పట్నం నరేందర్‌రెడ్డిని వాహనంలో తరలిస్తున్న పోలీసులు



లగచర్ల దాడిలో..

కేటీఆర్ ప్రమేయం!

రిమాండ్ రిపోర్ట్‌లో స్పష్టం చేసిన పోలీసులు

ఫోన్ ఆడియో రికార్డుల్లో ఎంత ఖర్చయినా ముందుకెళ్లాలని కేటీఆర్ ఆదేశాలు?

ఆ ఆదేశాలతోనే రంగంలోకి పట్నం నరేందర్‌రెడ్డి

వ్యూహాన్ని అమలు చేసిన సురేశ్‌రాజ్

ఏ-1గా పట్నం.. ప్రధాన కుట్రదారు ఆయనే: ఐజీ

నిందితుడు సురేశ్‌రాజ్‌ ఉసిగొల్పినట్టు వెల్లడి

కేబీఆర్ పార్క్‌లో వాహ్యాళిలో ఉండగా పట్నం అరెస్టు

వికారాబాద్‌లో విచారణ.. తర్వాత కొడంగల్ కోర్టుకు

14 రోజుల రిమాండ్.. చర్లపల్లి జైలుకు తరలింపు

ఏ-2గా సురేశ్‌రాజ్.. నరేందర్‌రెడ్డి కాల్ డేటాపై ఆరా

కేటీఆర్‌ని నిందితుల జాబితాలో చేర్చే అవకాశాలు!!

హైదరాబాద్, వికారాబాద్, కొడంగల్, బొంరాస్‌పేట్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): లగచర్ల ఫార్మా విలేజ్ దాడి కేసు కీలక మలుపు తిరిగింది. ఈ దాడితో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ప్రమేయముందని పోలీసులు తేల్చారు. అంతేకాదు.. ఘటనకు ముందు.. ఆ తర్వాత కేటీఆర్‌తో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడిన ఆడియో రికార్డును, ఇతర సాంకేతిక ఆధారాలను పోలీసులు సేకరించారు. న్యాయనిపుణుల సలహాతో.. ఈ కేసులో కేటీఆర్‌ను కూడా నిందితుడిగా చేర్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. నరేందర్‌రెడ్డి ఐఫోన్-14ప్రోను సీజ్ చేశామని చెబుతున్న పోలీసులు.. ఫోరెన్సిక్ విశ్లేషణ తర్వాత లగచర్ల కేసులో ఇంకా ఎవరెవరున్నారనేది తేలుతుందంటున్నారు. తొలుత ఈ దాడి వెనక ప్రధాన సూత్రధారి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేశ్‌రాజ్ అని పేర్కొన్న పోలీసులు.. అనూహ్యంగా కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని ఏ-1గా చూపించారు. సురేశ్ వెనక ఉంటూ.. కేటీఆర్ ఆదేశాలతో దాడికి కుట్ర చేసింది, కథ నడిపించింది నరేందర్‌రెడ్డి అని స్పష్టం చేశారు. పట్నం నరేందర్‌రెడ్డిపై భారత శిక్షా స్మృతి(బీఎన్ఎస్),

మిగతా 13వ పేజీలో...

కొడంగల్ నుంచే రేవంత్ భరతం

2

సీఎం అల్లుడి కోసమే ఫార్మా విలేజ్

రైతుల భూములను లాక్కునే ప్రయత్నం

నరేందర్‌రెడ్డిది అరెస్టు కాదు.. కిడ్నాప్

సురేశ్ బరాబర్ బీఆర్ఎస్ నాయకుడే

తన ఏడెకరాల భూమి పోతోందని

కలెక్టర్‌ను పద్ధతిగా ప్రశ్నించారు

నేను ఢిల్లీకి వెళ్లడం తప్పయితే.. సీఎం

గవర్నర్‌ను కలవడమూ తప్పే: కేటీఆర్

నేడు రాష్ట్రవ్యాప్త నిరసనలు

అధికారులపై దాడులను ఖండిస్తూ

ఉద్యోగుల జేఏసీ పిలుపు 13

బుల్డోజర్ న్యాయానికి

సుప్రీం బ్రేక్!

అధికారులేమీ జడ్జిలు కాదు.. ఇంటిని కూల్చే అధికారం లేదు



దోషి అయినా.. కూల్చడానికి వీల్లేదు

కూల్చివేతల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే

అధికారుల జీతాల నుంచి పరిహారం

రాష్ట్రాలు, అధికారులు హద్దు మీరొద్దు

ఒక వ్యక్తి నిందితుడైతే.. కూల్చివేతలతో

ఫ్యామిలీ మొత్తాన్ని శిక్షించడం సరికాదు

నిర్మాణాల కూల్చివేతలపై సుప్రీం తీర్పు

ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మించే

కట్టడాలకు తీర్పు వర్తించదని స్పష్టీకరణ

నోటీసిచ్చి.. 15 రోజుల గడువు ఇవ్వాలి

దేశమంతా వర్తించేలా మార్గదర్శకాలు

> అధికారులేమీ జడ్జిలు కాదు. ఒక వ్యక్తిని దోషిగా నిర్ధారించి, ఇళ్లను కూల్చివేసే అధికారం లేదు. సొంత ఇల్లు అన్నది సామాన్యుల కల. దాన్ని నెరవేర్చుకోవడంలో ఎన్నో ఏళ్ల శ్రమ ఉంటుంది. నిందితులకు కూడా రాజ్యాంగం కల్పించిన హక్కులు ఉంటాయి. ఒక వ్యక్తి దోషి అయితే, మిగిలిన కుటుంబ సభ్యులందరినీ రోడ్డున పడేయడం సరికాదు. నిబంధనలకు విరుద్ధంగా ఒక్క నిర్మాణాన్ని కూల్చినా రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడినట్లే
>
> - సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): "అధికారి న్యాయమూర్తిలా వ్యవహరించి, ఒక వ్యక్తిని దోషిగా నిర్ధారించలేరు. అలా నిర్ధారించి అతని నివాస/వాణిజ్య భవనాలను కూల్చివేసి, శిక్షించాలని నిర్ణయించడానికి వీల్లేదు. అలాంటి అధికారం కార్యనిర్వాహక అధికారికి లేదు" అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఏదైనా కేసులో నిందితుడు లేదా దోషిగా నిర్ధారించారన్న కారణంతో నిబంధనలను అనుసరించకుండా ఓ వ్యక్తి ఇంటిని కూల్చడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. వివిధ కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల ఆస్తుల్ని బుల్డోజర్లతో కూల్చివేయడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం బుధవారం ఈ మేరకు తీర్పు

మిగతా 2వ పేజీలో...

కస్టమ్ మిల్లింగ్..

పొరుగు మిల్లర్లకూ

ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక మిల్లర్లకు బంపర్ ఆఫర్!

సీఎంఆర్ కోసం ధాన్యం ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖత

100 శాతం బ్యాంకు గ్యారెంటీ ఇవ్వటానికి ఏపీ మిల్లర్లు సిద్ధం

స్థానిక రైస్‌మిల్లర్లు ధాన్యం దించుకోని చోట ఇతరులకు చాన్స్



హైదరాబాద్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మర ఆడించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని వినియోగించుకునే ప్రయత్నంలో ఉంది. సన్నధాన్యాన్ని మరాడిస్తే 67 శాతం బియ్యం రావని, బ్యాంకు గ్యారెంటీ నిబంధన పెట్టకుండా ధాన్యం ఇవ్వాలని, మిల్లింగ్ చార్జీలు కూడా ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తక్కువ ఉన్నాయని కొందరు రైస్‌మిల్లర్లు ప్రభుత్వానికి సహాయ నిరాకరణ చేస్తున్నారు. ధాన్యం దించుకోవటానికి ససేమిరా అంటున్నారు. అయితే ధాన్యం సేకరణ పాలసీని ఇటీవల ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం రికవరీ శాతం, బ్యాంకు గ్యారెంటీల విషయంలో వెనక్కి తగ్గేదిలేదని, మిల్లింగ్ చార్జీలు కూడా గతానికంటే 4 రెట్లు పెంచామని స్పష్టం చేసింది. ధాన్యం సేకరణకు సహకరించకపోతే ప్రత్యామ్నాయం చూసుకుంటామని తెగేసి చెప్పింది. ఈక్రమంలో ఇతర రాష్ట్రాల్లో ఉన్న రైస్‌మిల్లర్లకు కూడా కస్టమ్ మిల్లింగ్ కోసం ధాన్యం ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చింది. డిప్యూటీ సీఎం భట్టి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫార్సు మేరకు రాష్ట్ర మంత్రివర్గం కూడా ఈమేరకు ఆమోదం తెలిపింది. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి రైస్‌మిల్లర్లు ముందుకొస్తే ధాన్యం

మిగతా 12వ పేజీలో...



సాగు భూముల్లో సౌర విద్యుత్తు!

12 రాష్ట్రంలో 4వేల మెగావాట్ల సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు నిర్ణయం

ఒక్కొక్కటి 0.5 - 2 మెగావాట్ల సామర్థ్యంతో ప్లాంట్ ఏర్పాటుకు చాన్స్

సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు ప్రాధాన్యం.. యూనిట్‌కు రూ.3.13 చొప్పున ధర

6 ఎకరాలుంటే ఏటా రూ.25 లక్షల ఆదాయం

రుణం.. కొంత బాండ్లతో!

ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం నిర్మాణానికి కొత్తగా 'ఇన్‌విట్' విధానం

భారం పడకుండా నిధుల సేకరణకు యోచన

టోల్, ఇతరత్రా రాబడి నుంచి చెల్లించే అవకాశం

ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ఈ పద్ధతిలో నిర్మాణం

డీపీఆర్ కన్సల్టెంట్ భర్తీకి త్వరలో టెండర్లు

ప్రాజెక్టు అమలుకు ఓ విభాగం.. పీడీగా ఐఏఎస్

హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రీజనల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణభాగం నిర్మాణం విషయంలో ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది. ఈ రహదారి నిర్మాణానికి ఇప్పటిదాకా పబ్లిక్-ప్రైవేట్-పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ), హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హెచ్ఏఎం), బిల్డ్-ఆపరేట్-టోల్ (బీవోటీ) పద్ధతులను పరిశీలించిన సర్కారు.. తాజాగా 'ఇన్‌విట్' విధానంపై దృష్టి సారించింది. ఆ పద్ధతిలో నిర్మాణం చేపడితే తీసుకోవాల్సిన చర్యలు, అందుకు ప్రభుత్వం అనుసరించాల్సిన విధానాలపై చర్చిస్తున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. 'ఇన్‌విట్' అంటే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్. అంటే.. మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులను బాండ్ల రూపంలో సేకరించే విధానం. ఏ ప్రాజెక్టు కోసం ఈ నిధులను సేకరిస్తున్నారో.. అదే ప్రాజెక్టుకు నిధులను ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇలా చేస్తే ఎఫ్ఆర్‌బీఎం చట్టం కూడా వర్తించదు. అయితే ప్రభుత్వం చేపట్టే ప్రాజెక్టు నుంచి వచ్చే ఆదాయంతోనే

మిగతా 12వ పేజీలో...

స్పోర్ట్స్ కోటాలోనూ బోగస్‌లు

టీచర్ పోస్టుల భర్తీలో లొసుగుల పరంపర

దిద్దుబాటుకు విద్యాశాఖ చర్యలు.. 20 నుంచి ధ్రువపత్రాల పునఃపరిశీలన

అనర్హులని తేలితే ఉద్యోగాల తొలగింపు.. తెలంగాణ విద్యా శాఖ కీలక నిర్ణయం

హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): టీచర్ పోస్టుల భర్తీలో పొరపాట్లు జరిగినట్లు గుర్తించిన తెలంగాణ విద్యా శాఖ డీఎస్సీ స్పోర్ట్స్ కోటా కింద ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాలను పునఃపరిశీలించాలని నిర్ణయించింది. ఈ నెల 20 నుంచి ఈ ప్రక్రియను నిర్వహించాలంటూ తాజాగా సర్క్యులర్‌ను జారీ చేసింది. ఈ మేరకు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో పాటు, ఇదే కోటాలో ఉద్యోగాలకు ఎంపికవని అభ్యర్థులకు కూడా ధ్రువపత్రాల పునఃపరిశీలన చేయనున్నారు. ఫోన్ల ద్వారా అభ్యర్థులకు సమాచారాన్ని అందించారు. రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా 10,006 పోస్టులను భర్తీ చేశారు. గత నెల 9న ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ నియామక పత్రాలను అందజేశారు. డీఎస్సీ పరీక్ష నిర్వహించి, ఈ ఎంపిక ప్రక్రియను పూర్తి చేశారు. అయితే, ఈ ఎంపికలో కొన్ని పొరపాట్లు దొర్లినట్లు గుర్తించారు. ముఖ్యంగా

మిగతా 14వ పేజీలో...



స్థానిక భాషల్లో వైద్య విద్య

వచ్చే ఐదేళ్లలో కొత్తగా 75వేల మెడికల్ సీట్లు.. ప్రధాని నరేంద్ర మోదీ 2



రాష్ట్రాల్లో అణు విద్యుత్తు ప్లాంట్లు

బొగ్గు కొరత ఉన్న చోట ఏర్పాటుకు కేంద్రం పిలుపు

న్యూఢిల్లీ, నవంబరు 13: థర్మల్ విద్యుత్కేంద్రాల జీవితకాలం ముగిసిన రాష్ట్రాలతో పాటు బొగ్గు లభ్యత తక్కువగా ఉన్న రాష్ట్రాలు అణు ఆధారిత విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటును పరిశీలించాలని కేంద్ర విద్యుత్తు శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ కోరారు. మంగళవారం విద్యుత్తు మంత్రుల సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రమాదాలు, లీకేజీలు జరిగినప్పుడు నష్టపరిహారంపై రూపొందించిన కఠినమైన చట్టాలు, నిబంధనల కారణంగా చాలామంది విదేశీ పవర్ ప్లాంట్ బిల్డర్లు భారత్‌లో అణు కర్మాగారాల నిర్మాణానికి దూరంగా ఉంటున్నారు. ప్రస్తుతం దేశంలో 24 అణు విద్యుత్తు ప్లాంట్లు పనిచేస్తుండగా వీటినుంచి 8 గిగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నారు. 2032 నాటికి దీన్ని 20 గిగావాట్లకు పెంచాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్లాంట్లను అణుశక్తి విభాగం పరిధిలోని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ నిర్వహిస్తోంది.

ఆరోగ్య ఉన్నతాధికారికి మెమో

గత సర్కారు హయాంలోనే ఆయనపై తీవ్ర ఆరోపణలు 14

ఈ ఏడాది ఉద్యోగుల సాధారణ బదిలీల్లోనూ అవకతవకలు

ప్రభుత్వ అనుమతి లేకుండా డిప్యుటేషన్లు, సరెండర్ పోస్టింగ్‌లు

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తీవ్ర ఆగ్రహం

ఇందిరమ్మ ఇల్లు

400 చదరపు అడుగుల్లో..

స్నానాల గది, వంట గది తప్పనిసరి.. తొలి విడతలో స్థలం ఉన్నవారికి మంజూరు

నాలుగు విడతల్లో రూ.5 లక్షలు.. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి



హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మొదటి విడతలో స్థలం ఉన్నవారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. లబ్ధిదారుడు 400 చదరపు అడుగుల్లో ఇల్లు నిర్మించుకోవాలన్నారు. అందులో స్నానాల గది, వంట గది తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ఈ మేరకు

మిగతా 12వ పేజీలో...

కోచింగ్ సెంటర్ల మోసాలకు చెక్

(మొదటి పేజీ తరువాయి)

రక్షణ కల్పించే ఉద్దేశంతో సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సీసీపీఏ) బుధవారం ఈ మార్గదర్శకాలు విడుదల చేసింది. జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్‌కు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఈ చర్యలు తీసుకుంది. వినియోగదారుల చట్టం ప్రకారం తీసుకొచ్చిన ఈ కొత్త మార్గదర్శకాలు అతిక్రమించిన కోచింగ్ సెంటర్లకు జరిమానా విధిస్తారు. ఇప్పటికే 54 నోటీసుల ద్వారా కోచింగ్ సెంటర్లకు రూ. 54.6 లక్షల జరిమానా విధించామని వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి నిధి ఖారే పేర్కొన్నారు. తమ లక్ష్యం కోచింగ్ సెంటర్లను తక్కువ చేసి చూపడం కాదని, కానీ వినియోగదారులకు సరైన సమాచారం అందించేలా చూడటం అని ఆమె తెలిపారు. కొత్త నిబంధనల ప్రకారం.. ఆఫర్ చేసే కోర్సులు, కాలపరిమితి, ఫ్యాకల్టీల విద్యార్హత, ఫీజు వసూళ్లు, రిఫండ్ పాలసీలు, సెలెక్షన్ శాతం, ర్యాంకింగ్స్, జాబ్ గ్యారెంటీ అలాగే సెక్యూరిటీ తదితర వివరాలు తప్పుగా ప్రచురించడాన్ని నిషేధించారు. కోచింగ్ సెంటర్లు ఇచ్చే డిజిటల్, ప్రింట్, ఔట్‌డోర్ తదితర యాడ్స్‌లో తామందించే కోర్సులు, ఫ్యాకల్టీ అర్హతలు, మౌలిక సదుపాయాల వివరాలు స్పష్టంగా, కచ్చితమైన సమాచారంతో ప్రచురించాలి. విజేతలైన విద్యార్థుల నుంచి అనుమతి పత్రం లేకుండా వారి ఫొటోలు, పేర్లు, ఇతర వివరాలు కోచింగ్ సెంటర్లు వినియోగించడానికి వీల్లేదు. ఏఐసీటీఈ, యూజీసీ తదితర సంస్థల నుంచి అనుమతి ఉన్న కోర్సుల వివరాలు కోచింగ్ సెంటర్లు తమ యాడ్స్‌లో స్పష్టంగా పేర్కొనాలి. అయితే ఈ నిబంధనల నుంచి కౌన్సెలింగ్, స్పోర్ట్స్, సృజనాత్మక సంబంధిత కోచింగ్ సెంటర్లకు మినహాయింపు ఇచ్చారు.

వయనాడ్‌లో తగ్గిన పోలింగ్.. 65% నమోదు

న్యూఢిల్లీ, నవంబరు13: కేరళలోని వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికలో 65% పోలింగ్ నమోదైంది. ఇక్కడ నుంచి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఏప్రిల్‌లో పోటీ చేసినప్పటితో పోలిస్తే 9% పోలింగ్ తక్కువగా నమోదైంది. వయనాడ్, రాయ్‌బరేలీ నుంచి పోటీ చేసి నెగ్గిన రాహుల్ వయనాడ్‌కు రాజీనామా చేయడంతో ఇదే నియోజకవర్గం నుంచి ప్రియాంక గాంధీ తొలిసారిగా రాజకీయాల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. పోలింగ్ శాతం తగ్గడంతో ఫలితంపై అన్ని పార్టీల అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. మరోవైపు మేఘాలయలోని గస్‌బెగ్రే అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికలో 90.84% పోలింగ్ నమోదైంది. మరోవైపు, రాజస్థాన్‌లో 7, పశ్చిమబెంగాల్‌లో 6, అస్సాంలో 5, బీహార్‌లో 4, కర్ణాటకలో 3, మధ్యప్రదేశ్‌లో 2, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, కేరళ, మేఘాలయలో ఒక్కో నియోజకవర్గానికి ఉప ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. అయితే పశ్చిమబెంగాల్‌లోని ఉత్తర 24 పరగణాల జిల్లా భట్‌పారాలో జరిగిన హింసలో టీఎంసీ కార్యకర్త హత్యకు గురయ్యాడు.

ప్రభుత్వాస్పత్రిలో వైద్యుడిపై కత్తితో దాడి

» ఏడు పోట్లు పొడిచిన క్యాన్సర్ రోగి కుమారుడు

చెన్నై, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టపగలు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుడిపై కత్తితో దాడికి పాల్పడ్డాడో యువకుడు. వెంట తెచ్చుకున్న కత్తితో ఏడు పోట్లు పొడిచాడు. రక్తపు మడుగులో పడి ఉన్న వైద్యుడిని సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. నిందితుడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. చెన్నైలోని గిండీ ప్రాంతంలో ఉన్న కలైంజర్ సెంటినరీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి క్యాన్సర్ విభాగంలో బుధవారం ఉదయం జరిగిందీ దారుణం. తన తల్లి కాంచనకు ఆస్పత్రి వైద్యులు సరైన వైద్యం చేయలేదని కుమారుడు విఘ్నేశ్ వైద్యుడు బాలాజీపై ఈ దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం సృష్టించింది. ఈ ఘటనకు నిరసనగా గురువారం నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు తమిళనాడు ప్రభుత్వ వైద్యుల సంఘాలు ప్రకటించాయి. కోల్‌కతా ఆస్పత్రిలో వైద్యురాలిపై హత్యాచార ఘటన అనంతరం ఆందోళనలు తీవ్రరూపం దాల్చినట్టే ఇక్కడా ఆందోళనలు తీవ్రరూపం దాల్చుతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

సొంత కాళ్లపై నిలబడటం నేర్చుకోండి

పవార్ ఫొటోలు వాడకండి.. అజిత్‌వర్గానికి సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ, నవంబరు 13: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శరద్ పవార్ ఫొటోలు, వీడియోలు వాడొద్దని అజిత్ పవార్ వర్గం ఎన్సీపీ(నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ)ని సుప్రీంకోర్టు బుధవారం ఆదేశించింది. సొంత కాళ్లపై నిలబడటం నేర్చుకోవాలని ఎన్సీపీకి సూచించింది. గతంలో ఉమ్మడి ఎన్సీపీ గుర్తు అయిన గడియారం గుర్తును అజిత్ వర్గం ఎన్సీపీ ఎన్నికల ప్రచారంలో వినియోగించకుండా నిరోధించాలంటూ ఎన్సీపీ(శరద్ వర్గం) వేసిన పిటిషన్‌పై ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇరు వర్గాల వాదనలు విన్న కోర్టు.. శరద్ పవార్‌తో విడిపోయిన మీరు ఆయన పేరు, ఫొటోలు, వీడియోలను వినియోగించవద్దని ఎన్సీపీని ఆదేశించింది. కాగా, గతేడాది అజిత్ ఎన్సీపీ నుంచి విడిపోయిన సంగతి తెలిసిందే. మెజారిటీ ఎమ్మెల్యేలు అజిత్‌తోనే ఉండడంతో ఆయన వర్గమే అసలైన ఎన్సీపీగా ఈసీ గుర్తించింది.

మణిపూర్‌కు అదనపు బలగాలు

న్యూఢిల్లీ, నవంబరు 13: మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తతలు చెలరేగిన నేపథ్యంలో కేంద్రప్రభుత్వం అక్కడకు అదనపు బలగాలను తరలించింది. కేంద్ర సాయుధ పోలీసు బలగాలకు చెందిన 2000 మంది సైనికులను ఆ రాష్ట్రానికి పంపిస్తూ కేంద్ర హోంవ్యవహారాల మంత్రిత్వశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. మణిపూర్‌లోని జిరిబామ్ జిల్లాలో సోమవారం భద్రతాదళాలు, కుకీ మిలిటెంట్ల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 11 మంది కుకీ మిలిటెంట్లు హతమైన సంగతి తెలిసిందే. మరోవైపు ఆదివారం జిరిబామ్ జిల్లాలోని మైతేయి గ్రామాలపై కుకీ ఆందోళనకారులు విరుచుకుపడ్డారు. థమ్నాపోక్పి, సబున్‌కోక్, ననసాబి గ్రామాలకు సమీపంలోని కొండలపై నుంచి తుపాకుల కాల్పులు, బాంబులతో దాడులకు పాల్పడ్డారు.

ఐఎస్ఎస్‌లో క్షేమంగానే ఉన్నా: సునీత విలియమ్స్

న్యూయార్క్, నవంబరు 13: "అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో చిక్కిపోయిన సునీతా విలియమ్స్" ..అంటూ ప్రపంచవ్యాప్తంగా వైరల్ అవుతున్న వార్తలపై అక్కడి నుంచి సునీత స్పందించారు. తాను క్షేమంగానే ఉన్నానని, ఐఎస్ఎస్‌కు వచ్చేటప్పుడు ఎంత బరువున్నానో ఇప్పుడూ అంతే బరువు ఉన్నానని.. తన ఆరోగ్యంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె స్పష్టం చేశారు. ఐఎస్ఎస్‌లో ఉండే మైక్రోగ్రావిటీ వల్ల కండరాలు, ఎముకలు దెబ్బతినకుండా ఉండేందుకు వ్యాయామాలు తీవ్రంగా కసరత్తులు చేయాల్సి ఉంటుందని.. అలా సైక్లింగ్, ట్రెడ్‌మిల్‌పై రన్నింగ్, బరువులు ఎత్తడం (వెయిట్ లిఫ్టింగ్) వంటివి చేయడం వల్లే తాను చిక్కిపోయినట్టు కనిపిస్తున్నానని, బరువేమీ తగ్గలేదని వివరించారు. ఈ ఏడాది మే నెలలో రోదసిలోని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లి.. వ్యోమనౌక పాడవడంతో ఆమె అక్కడే చిక్కుకు పోయిన సంగతి తెలిసిందే.

బుల్డోజర్ న్యాయానికి సుప్రీం బ్రేక్!



(మొదటి పేజీ తరువాయి)

వెలువరించింది. 'బుల్డోజర్ న్యాయాని'కి బ్రేకులు వేసింది. ఆస్తుల కూల్చివేతకు సంబంధించి దేశవ్యాప్తంగా అమలయ్యేలా మార్గదర్శకాలు కూడా జారీ చేసింది. అధికారులు ఒక వ్యక్తిని దోషిగా తేల్చలేరని, న్యాయమూర్తిలా వ్యవహరించి నిందితుల స్థిరాస్తులను కూల్చివేయడం తగదని స్పష్టం చేసింది. రాష్ట్రాలు, ప్రభుత్వ అధికారులు హద్దుమీరి చర్యలు తీసుకోరాదని ఆదేశించింది. తమ ఆదేశాలను ఉల్లంఘిస్తే కోర్టు ధిక్కార చర్యలు తీసుకుంటామని ధర్మాసనం హెచ్చరించింది. కూల్చివేత ప్రక్రియలో నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలితే, ఆ ఆస్తి పునరుద్ధరణకు సంబంధించిన పరిహారాన్ని అధికారుల వేతనాల నుంచి వసూలు చేయాలని ధర్మాసనం తన 95 పేజీల తీర్పులో స్పష్టం చేసింది. తీర్పు రాసే ముందు జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రజల సొంత ఇంటి కలపై ప్రముఖ హిందీ కవి ప్రదీప్ రాసిన కవితను ఉటంకించారు. "సొంత ఇల్లు ఉండాలనేది ప్రతి ఒక్కరి కల. ఇది ప్రతి ఒక్కరి హృదయంలోనూ ఉంటుంది. ఏ ఒక్కరూ తమ కల (సొంత ఇల్లు)ను కోల్పోవాలని ఎప్పుడూ కోరుకోరు" అని పేర్కొంటూ తీర్పును ప్రారంభించారు. సొంత ఇల్లు అనేది ఓ వ్యక్తి లేదా కుటుంబం ఆశ, కల అని.. అది వారి స్థిరత్వం, భద్రతకు సంబంధించిన అంశం కూడా అని ధర్మాసనం పేర్కొంది. కుటుంబం లేదా కుటుంబాల ఆవాసాన్ని కూల్చేసే అధికారం ఓ అధికారికి ఉంటుందా? అన్నది ప్రశ్న అని.. అలాగే ఓ వ్యక్తి దోషి అయినంత మాత్రాన కుటుంబం మొత్తాన్ని శిక్షించడం సరికాదని స్పష్టం చేసింది. ఇల్లు అనేది పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కు అని తెలిపింది. స్థానిక మునిసిపల్ చట్టాలను ఉల్లంఘించిన వారి ఆస్తులనే కూల్చివేసినట్లు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలపగా.. చట్టాలను ఉల్లంఘించిన వారందరి ఇళ్లనూ కూల్చలేదని, కొందరివి మాత్రమే కూల్చారని ధర్మాసనం పేర్కొంది. తమ తీర్పు అన్ని రాష్ట్రాలకు వర్తిస్తుందని తెలిపింది. ఈ తీర్పు ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వాలు సర్క్యులర్లు జారీ చేయాలని ఆదేశించింది.

మార్గదర్శకాలు ఇవే..

- షోకాజ్ నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు చేపట్టరాదు. ఒకవేళ కూల్చివేతకు ఆదేశాలు జారీ చేస్తే.. వాటిపై అప్పీలుకు వెళ్లేందుకు యజమానులకు సమయం ఇవ్వాలి.
- ఎలాంటి గడువూ ఇవ్వకుండా రాత్రికిరాత్రే ఇళ్లు కూల్చివేయడం సరికాదు. మహిళలు, చిన్నారులు రోడ్లపైకి రావడం మంచిది కాదు.
- ప్రభుత్వ ఆస్తుల్లో నిర్మించిన అక్రమ కట్టడాలు లేదా కూల్చివేయాలంటూ కోర్టు ఆదేశాలు ఇచ్చిన నిర్మాణాలకు ఈ ఆదేశాలు వర్తించవు.
- షోకాజ్ నోటీసులు ఇళ్లు/భవనాల వెలుపల అతికించాలి. కూల్చివేతకు 15 రోజులు ముందుగానే నోటీసు ఇవ్వాలి. నోటీసు ఇచ్చిన తర్వాత, దాని గురించి జిల్లా కలెక్టర్‌కు తెలియజేయాలి.
- మునిసిపల్ భవనాల కూల్చివేతలకు గాను కలెక్టర్లు నోడల్ అధికారులను నియమించాలి.
- నిర్మాణాల్లో ఎలాంటి ఉల్లంఘనకు పాల్పడ్డారు? వ్యక్తిగత విచారణకు నిర్ణయించిన తేదీ? దాన్ని ఎవరు నిర్ధారించారు? వంటి వివరాలన్నీ నోటీసులో ఉండాలి. మునిసిపల్ అధికారులు మూడు నెలల్లో డిజిటల్ పోర్టల్‌ను ఏర్పాటు చేయాలి. జారీ చేసిన ఆదేశాలు, నోటీసుల వివరాలను డిజిటల్ పోర్టల్‌లో పెట్టాలి.
- అధికారులు బాధితుల వాదనలను వినాలి. సంబంధిత మినిట్స్‌ను రికార్డు చేయాలి. ఆ తర్వాతే తుది ఆదేశాలు జారీ చేయాలి. అక్రమ కట్టడం పూర్తిగా కూల్చేస్తారా? పాక్షికంగా కూల్చుతారా? అసలు కూల్చివేయాలన్న తీవ్రమైన నిర్ణయం ఎందుకు తీసుకున్నారన్న వివరాలను తెలియజేయాలి. పూర్తి వివరాలతో కూడిన తుది ఆదేశాలను డిజిటల్ పోర్టల్‌లో పెట్టాలి.
- అక్రమ కట్టడాలని తేలితే వాటిని 15 రోజుల్లోగా కూల్చివేయడం లేదా తొలగించడానికి సంబంధిత యజమానికి అవకాశం ఇవ్వాలి. ఆలోపు అప్పీలేట్ సంస్థ స్టే ఇవ్వకపోతే కూల్చివేతలు చేపట్టాలి. కూల్చివేత ప్రక్రియను వీడియో తీయడంతో పాటు దాన్ని భద్రపరచాలి.
- కోర్టు ఆదేశాలను పాటించని అధికారులపై ధిక్కరణ చర్యలు ఉంటాయి. కూల్చిన ఆస్తుల పునరుద్ధరణ, బాధితులకు పరిహారాన్ని సంబంధిత అధికారులే చెల్లించాల్సి ఉంటుంది.
- అన్ని రాష్ట్రాల సీఎస్‌లకు ఈ ఆదేశాలివ్వాలి.

ఎన్నో ఏళ్ల కల..

"ఒక సామాన్య పౌరుడి ఇంటి నిర్మాణంలో ఎన్నో ఏళ్ల శ్రమ, కలలు ఉంటాయి. అందులో వారి భవిష్యత్తు, భద్రత ఇమిడి ఉంటుంది. ఆ ఇంట్లో ఒక్కరే నిందితుడు అయితే.. అక్కడ నివసించే విగతా వ్యక్తులకు ఆశ్రయం లేకుండా ఎలా చేస్తారు..?" అని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఇల్లు, భవనాలను కూల్చే అధికారం కార్యనిర్వాహక అధికారులకు లేదని స్పష్టం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా కూల్చివేతలు చేపట్టరాదని ఆదేశించింది. షోకాజ్ నోటీసులు జారీ చేయకుండా కూల్చివేతలు చేపట్టరాదని.. అక్రమ కట్టడాల తొలగింపునకు ఇంటి యజమానికి 15 రోజుల గడువు ఇవ్వాలని పేర్కొంది. అయితే తమ ఆదేశాలు ప్రభుత్వ భూముల్లో నిర్మించిన అక్రమ కట్టడాలకు వర్తించవని స్పష్టం చేసింది. ఏదైనా కేసులో నిందితుడు లేదా దోషిగా తేలినప్పటికీ.. వారికి కూడా రాజ్యాంగం కల్పించిన హక్కులు వర్తిస్తాయని ధర్మాసనం పేర్కొంది. న్యాయసూత్రాల ప్రకారం ఒక వ్యక్తి దోషిగా తేలే వరకు అతను అమాయకుడేనని.. ఆలోపే నిర్మాణాలను కూల్చివేయడమంటే మొత్తం కుటుంబ సభ్యులను శిక్షించినట్లేనని, రాజ్యాంగం ప్రకారం దానికి అనుమతి లేదని తెలిపింది. కూల్చివేతల నిర్ణయాలు తీసుకునే, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే అధికారులు జవాబుదారీగా ఉండాలని ధర్మాసనం స్పష్టం చేసింది. తమ ఆదేశాలను ఉల్లంఘిస్తే కోర్టు ధిక్కరణగా పరిగణించాల్సి ఉంటుందని హెచ్చరించింది. వ్యక్తుల స్వేచ్ఛను కాపాడడం కూడా ప్రధానమని గుర్తుచేసింది. నిబంధనలకు విరుద్ధంగా ఒక్క నిర్మాణాన్ని కూల్చేసినా రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడినట్లేనని హెచ్చరించింది. అయితే, రోడ్లు, ఫుట్‌పాత్‌లు, రైలు మార్గాలు, జలాశయాలు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మించిన కట్టడాలకు తమ ఆదేశాలు వర్తించవని స్పష్టం చేసింది.

లోకం తీరు



భారత్‌కు 'శ్వేత హంసలు'

టీయూ-160ఎం యుద్ధ విమానాల సరఫరాకు రష్యా సంసిద్ధత

న్యూఢిల్లీ, నవంబరు 13: సరిహద్దుల్లో పాకిస్థాన్, చైనాతో ఇబ్బందులు ఎదురవుతున్న వేళ.. భారత్ తన రక్షణ సామర్థ్యాన్ని పెంచుకునే అద్భుత అవకాశం తలుపుతట్టింది. పొడవైన రెక్కలతో.. భారీ బాంబర్లతో శత్రువులపై విరుచుకుపడే బాంబర్ యుద్ధవిమానాలు టీయూ-160ఎం 'వైట్ స్వాన్'లను భారత్‌కు ఇచ్చేందుకు రష్యా సంసిద్ధత వ్యక్తం చేసింది. దీన్ని తీసుకోవాలా వద్దా అనే అంశాన్ని భారత్ పరిశీలిస్తోంది. పొడవైన రెక్కలు కలిగిన ఈ భారీ యుద్ధవిమానాలను తీసుకుంటే రన్‌వేలను పునరుద్ధరించాల్సి ఉంటుంది. అలాగే పైలట్లు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇప్పించాల్సి ఉంటుంది. ఇవి గనుక అందుబాటులోకి వస్తే ఇండో-పసిఫిక్ ప్రాంతంలో బలమైన రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నట్లు అవుతుంది.

- రష్యా వద్ద ఇప్పటికే ఉన్న టీయూ-160 యుద్ధ విమానానికి ఇది అడ్వాన్స్‌డ్ వెర్షన్.
- ప్రపంచంలోనే వేగంగా ఎగిరే సూపర్ సోనిక్ యుద్ధ విమానం, బరువైన పేలోడ్లను మోసుకెళ్లే బాంబర్ ఇదేనని రష్యా చెబుతోంది.
- దీనిలో నలుగురు సిబ్బంది కూర్చోవచ్చు. 12 దీర్ఘశ్రేణి క్షిపణులు లేదా 12 స్వల్పశ్రేణి అణు క్షిపణులను ఇది మోసుకెళ్లగలదు.
- దీనిలో నాలుగు ఇంజన్లు ఉంటాయి. ఒక్కసారి ఇంధనం నింపితే ఏకబిగిన 12 వేల కిలోమీటర్లు ప్రయాణించగలదు.
- ఇది 16వేల మీటర్ల ఎత్తులో గంటకు 2,220 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో ప్రయాణించగలదు.

శబరిమలలో చాట్‌బాట్

యాత్రికుల కోసం 'స్వామి' పేరుతో ఏర్పాటు.. మూడు చోట్ల వాతావరణ కేంద్రాలు

» దర్శనం వేళలు 18 గంటలకు పెంపు

(సెంట్రల్ డెస్క్)

శబరిమల యాత్రికులకు సేవల కోసం కేరళ ప్రభుత్వం 'స్వామి' పేరుతో చాట్‌బాట్ అందుబాటులోకి వచ్చింది. కేరళ సీఎం పినరయి విజయన్ బుధవారం 'స్వామి' చాట్‌బాట్ లోగోను ప్రారంభించారు. స్మార్ట్‌ఫోన్ ఇంటర్‌ఫేస్ ద్వారా భక్తులకు ఆరు భాషల్లో-- ఆంగ్లం, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీలో అయ్యప్ప స్వామి స్వయంగా వివరాలు అందించినట్లుగా సమగ్ర వివరాలు లభ్యమయ్యేలా ఈ చాట్‌బాట్‌ను రూపొందించారు. శబరిమలలో పూజాసమయాలు, ఇతర విశేషాలే కాకుండా.. భక్తులు విమానాలు, రైళ్లు, స్థానిక పోలీసుల వివరాలు, అటవీశాఖ సేవలను 'స్వామి' ద్వారా పొందవచ్చు. శబరిమల నడక మార్గాల్లో భక్తులకు వాతావరణ హెచ్చరికలను జారీ చేసేందుకు భారత వాతావరణ కేంద్రం(ఐఎండీ) శబరిమల చరిత్రలోనే తొలిసారి మూడు వాతావరణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. తిరువనంతపురం ఐఎండీ డైరెక్టర్ నీతా.కె.గోపాల్ బుధవారం తొలి బులెటిన్‌ను విడుదల చేశారు. గురు, శుక్రవారాల్లో శబరిమలలో భారీ వర్షాలు కురుస్తాయని ఆమె పేర్కొన్నారు. మరోవైపు, ఇటీవల నెలవారీ పూజలకు కూడా భక్తులు శబరిమలకు పోటెత్తడంతో.. మండల, మకరవిళక్కు నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు(టీడీబీ) అధ్యక్షుడు పీఎస్ ప్రశాంత్ వెల్లడించారు. గురువారం నుంచి మండల పూజల సీజన్ ప్రారంభమవుతుందని, భక్తుల సౌకర్యార్థం స్వామివారి దర్శన సమయాన్ని 18 గంటలకు పొడిగిస్తున్నామన్నారు. "తెల్లవారుజామున 3 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు.. తిరిగి మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 11 గంటల వరకు దర్శనానికి అనుమతిస్తాం. రోజుకు 80 వేల మంది భక్తులకు దర్శనం టికెట్లను విడుదల చేస్తాం. వీటిల్లో 70 వేలు ఆన్‌లైన్ బుకింగ్ కాగా.. మరో 10వేలు స్పాట్‌బుకింగ్. ఎరుమేలి, వండిపెరియార్, పంపా వద్ద స్పాట్ బుకింగ్ కౌంటర్లుంటాయి" అని ఆయన వివరించారు. పదునెట్టాంబడి వద్ద సెల్‌ఫోన్లను నిషేధిస్తున్నట్లు తెలిపారు.

స్థానిక భాషల్లో వైద్య విద్య

ఐదేళ్లల్లో కొత్తగా 75వేల మెడికల్ సీట్లు: మోదీ

దర్భంగా, నవంబరు 13 : డాక్టర్ అవ్వాలంటే ఏ ప్రాంతం వారైనా, ఏ కాలేజీలోనైనా సరే మన దేశంలో ఆంగ్ల మాధ్యమంలో వైద్య విద్య పాఠాలు చదువుకోవాల్సిందే. త్వరలో ఈ విధానంలో మార్పు రాబోతుంది. వైద్య విద్యను హిందీ సహా ఇతర భారతీయ భాషల్లో అందుబాటులోకి తీసుకువస్తామని ప్రధాని మోదీ కీలక ప్రకటన చేశారు. దర్భంగాలో ఎయిమ్స్ ఆస్పత్రి శంకుస్థాపన సహా రూ.12,100 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులను మోదీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రధాని మాట్లాడుతూ.. స్థానిక భాషల్లో వైద్య విద్యపై ప్రకటన చేశారు. అలాగే, దేశవ్యాప్తంగా వచ్చే ఐదేళ్లల్లో మరో 75 వేల మెడికల్ సీట్లు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. కాగా, స్థానిక భాషలో వైద్య విద్య బోధన జరగాలని తమిళనాడు సహా పలు రాష్ట్రాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. మధ్యప్రదేశ్ ఇప్పటికే వైద్య విద్య హిందీ మీడియం పుస్తకాలను విడుదల చేసింది. బిహార్‌లో వైద్య విద్యను హిందీలో అందిస్తామని ఆ రాష్ట్ర మంత్రి కూడా ప్రకటించారు.



మోదీకి నితీశ్ పాదాభివందనం !

దర్భంగాలో జరిగిన సభలో బిహార్ సీఎం నితీశ్ ప్రధాని మోదీకి పాదాభివందనం చేసేందుకు ప్రయత్నించారు. అయితే, ఆ ప్రయత్నాన్ని అడ్డుకున్న మోదీ.. నీతీశ్‌తో కరచాలనం చేశారు. అంతేకాక, పార్టీ కార్యకర్తలు మోదీని గజమాలతో సత్కరిస్తుండగా ఆయన నితీశ్‌ను కూడా తన పక్కకు లాగి గౌరవం ఇచ్చారు. మోదీకి నితీశ్ పాదాభివందనం చేయడం ఈ ఏడాదిలో ఇది మూడో సారి.



ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్‌తో ట్రంప్ బుధవారం వైట్‌హౌస్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వెల్‌కమ్ బ్యాక్ ట్రంప్ అని బైడెన్ శుభాకాంక్షలు తెలిపారు. జనవరి 20న జరిగే అధికార మార్పిడి ప్రక్రియ శాంతియుతంగా పూర్తవ్వడంపై ఇరువురు చర్చించారు.

మస్క్, వివేక్‌కు కీలక బాధ్యతలు

ట్రంప్ కొత్తగా ఏర్పాటు చేసిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీకి నేతృత్వం



వాషింగ్టన్, నవంబరు13: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్ తన కేబినెట్ కూర్పుపై దృష్టి సారించారు. అలాగే కీలక విభాగాలకు సమర్థులను ఎంపిక చేసేందుకు గట్టిగా కసరత్తు చేస్తున్నారు. వాస్తవానికి 2025 జనవరి 20న అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాల్సి ఉన్నా ఈలోగానే ట్రంప్ తన కార్యవర్గాన్ని ప్రకటిస్తున్నారు. తన 2.0 పాలన చరిత్రలో నిలిచిపోవాలని భావిస్తున్న అందుకు తగ్గట్లే దూకుడుగా అడుగులు వేస్తున్నారు. అమెరికా చరిత్రలోనే తొలిసారిగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ(డీఓజీఈ) ఏర్పాటు చేసిన ట్రంప్ దీని నేతృత్వ బాధ్యతలు మస్క్, వివేక్ రామస్వామికి అప్పగించారు. డీఓజీఈ ఏర్పాటుకు సెనేట్ ఆమోదం అవసరం లేకపోవడంతో మస్క్ తన వ్యాపారాలను కొనసాగించుకునేలా ట్రంప్ వెసులుబాటు కల్పించారు. ఈ విభాగం ద్వారా ప్రభుత్వ అధికార యంత్రాంగం ప్రక్షాళన, అనవసరపు ఖర్చుల తగ్గింపుతో పాటు ఫెడరల్ ఏజెన్సీల పునర్నిర్మాణం బాధ్యతలు చూస్తారు.

మూడోసారి ముచ్చట కోసం

ట్రంప్ మూడోసారి కూడా అమెరికా అధ్యక్ష బరిలో నిలవాలనుకుంటున్నారు. ఇందు కోసం ఆయన రాజ్యాంగంలోని 22వ సవరణను పక్కనపెట్టేయాలని యోచిస్తున్నారు. 1951లో 22వ సవరణ తీసుకువచ్చారు. దాని ప్రకారం ఒక వ్యక్తి రెండు సార్లకు మించి అమెరికా అధ్యక్షుడవడానికి లేదు. అయితే 22వ సవరణను పక్కనపెట్టి మూడోసారి గద్దెనెక్కాలనేది ట్రంప్ తాజా యోచన.

కొడంగల్ నుంచే రేవంత్ భరతం పడతాం

సీఎం అల్లుడి కోసమే ఫార్మా విలేజ్.. రైతుల భూములను లాక్కునే ప్రయత్నం.. నరేందర్‌రెడ్డిది అరెస్టు కాదు.. కిడ్నాప్

» పోలీసులు గూండాల్లా వచ్చి ఎత్తుకెళ్లారు

» కాంగ్రెస్ కుట్రలకు పోలీసులు బలికావద్దు

» మీడియా సమావేశంలో కేటీఆర్



హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ పరిధిలోని రైతుల భూములను లాక్కునే ప్రయత్నంలో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి అక్కడి ప్రజల్లో అశాంతి రగిలిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి తీసుకున్న తుగ్లక్ విధానాల వల్లనే లగచర్ల ఘటన జరిగిందని, కొడంగల్ నుంచే రేవంత్ రెడ్డి భరతం పడతామని హెచ్చరించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రజాకవి కాళోజీ వర్ధంతి కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే ఫార్మాసిటీని రద్దు చేస్తామంటూ పీసీసీ అధ్యక్షుడిగా గతంలో ప్రకటించిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు యూటర్న్ ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించారు. ఫార్మా విలేజ్‌ల వల్ల వచ్చే లాభమేంటో ముఖ్యమంత్రి చెప్పాలన్నారు. సీఎం తన సొంత అల్లుడు సత్యనారాయణరెడ్డికి చెందిన ఫార్మా కంపెనీ కోసమే ఫార్మావిలేజ్ అంటున్నారని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి అల్లుడు సత్యనారాయణరెడ్డి, అన్న శరత్‌ల ఫార్మా కంపెనీలను విస్తరించడం కోసమే ప్రభుత్వం సహకరిస్తోందని ఆరోపించారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యుల కంపెనీల బాగోతాన్ని సీరియల్ మాదిరిగా తాము బయటపెడుతూనే ఉంటామన్నారు. భూసేకరణ పేరుతో ఎస్సీ, ఎస్టీ, పేద బీసీల భూములను ముఖ్యమంత్రి తన అనుచరులకు, కుటుంబ సభ్యులకు ఇచ్చి రియల్ ఎస్టేట్ దందా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఫార్మా సిటీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం హైకోర్టును కూడా మోసం చేస్తోందన్నారు. బయట ఫార్మాసిటీ రద్దు అంటూనే.. కోర్టులో మాత్రం ఫార్మాసిటీ ఉందని చెబుతోందన్నారు.

మహారాష్ట్రకు మూటలు మోస్తున్నారు..

సీఎం రేవంత్ పిచ్చి నిర్ణయాలతో కొడంగల్ రగులుతుంటే.. ఆయన మాత్రం మహారాష్ట్రకు మూటలు మోస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణలో కొనసాగుతున్నది ఇందిరమ్మ రాజ్యం కాదని, ఇందిర ఎమర్జెన్సీ పాలన అని విమర్శించారు. ఎనుముల కుటుంబం కుంభకోణాలను బయటపెట్టేందుకే తాను ఢిల్లీకి వెళ్లానని స్పష్టం చేశారు. తాను కేంద్ర పెద్దలను కలవడం తప్పయితే.. రేవంత్‌రెడ్డి గవర్నర్‌ను కలవడం కూడా తప్పేనని అన్నారు. "ఢిల్లీకి వెళ్లినంత మాత్రాన బీజేపీతో కాళ్ల బేరానికి వెళ్లినట్లా? బీజేపీకే చెందిన గవర్నర్‌ను రేవంత్‌రెడ్డి కలిస్తే అది కాళ్ల బేరానికి వెళ్లినట్లు కాదా? మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అదానీ కాళ్లు పట్టుకొని తనపై ఈడీ కేసు కాకుండా చూసుకున్నారా? లేదా? చెప్పాలి" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఇక మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని పోలీసులు గూండాల్లా వచ్చి ఎత్తుకెళ్లారని మండిపడ్డారు. ఆయనది అరెస్టు కాదని, కిడ్నాప్ అని అన్నారు. నోటీసులివ్వకుండా, కుటుంబానికి సమాచారం ఇవ్వకుండా తీసుకెళ్లడం తగదన్నారు.

కలెక్టర్‌ను పద్ధతిగా అడిగారు..

ప్రభుత్వ వ్యవస్థపై తమకు నమ్మకం లేదని కేటీఆర్ అన్నారు. అరెస్టు చేసిన మాజీ ఎమ్మెల్యే సహా రైతులను కూడా చిత్రహింసలు పెట్టినట్లు సమాచారం ఉందని, వారికి ప్రైవేటు సిబ్బందితో వైద్య పరీక్షలు చేయించాలని కోరారు. సురేశ్ అనే వ్యక్తి తన ఏడెకరాల భూమిని కోల్పోతున్నందునే కలెక్టర్‌ను పద్ధతిగా అడిగారని తెలిపారు. సురేశ్ బరాబర్ బీఆర్ఎస్ నాయకుడేనని స్పష్టం చేశారు. తనపై దాడి జరగలేదని స్వయంగా కలెక్టర్ చెబుతుంటే.. ఐజీ మాత్రం దాడి జరిగిందంటున్నారని తప్పుబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రకు పోలీసు ఉన్నతాధికారులు బలికావద్దని సూచించారు. కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు సురేశ్ పద్ధతిగా, మర్యాదగా చెబితే కూడా తప్పేనా? సొంత పార్టీ కార్యకర్తలతో మా నేతలు మాట్లాడితే తప్పా? సురేశ్ మమ్మల్ని కలవడం తప్పయితే.. రాహుల్‌గాంధీ రోజూ తిట్టే అదానీని రేవంత్‌రెడ్డి కలవడం కూడా తప్పేకదా?" అని కేటీఆర్ అన్నారు.

నరేందర్‌రెడ్డి కుటుంబానికి పరామర్శ

హైదరాబాద్ సిటీ: లగచర్ల కేసులో అరెస్టయిన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కుటుంబసభ్యులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. బుధవారం ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి తదితరులతో కలిసి జూబ్లీహిల్స్‌లోని నరేందర్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. నరేందర్‌రెడ్డి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పోలీసులు రేవంత్‌రెడ్డికి ప్రైవేట్ సైన్యంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. ప్రజల సొమ్ముతో జీతం తీసుకుంటున్నామన్న విషయాన్ని డీజీపీతో సహా పోలీసులు గుర్తించాలన్నారు. 144 సెక్షన్ ఉన్నా సరే 300 మందితో తిరుపతిరెడ్డిని లగచర్ల గ్రామంలోకి వెళ్లేందుకు ఎందుకు అనుమతించారని ప్రశ్నించారు.



ఆదిత్య ఠాక్రేకు మద్దతుగా ముంబై కాంగ్రెస్ అధ్యక్షురాలు వర్ష గైక్వాడ్‌తో కలిసి వర్లీలో సీఎం రేవంత్ రోడ్‌షో

ముంబైలో రేవంత్ రోడ్‌షో

» ఆదిత్య ఠాక్రేకు మద్దతుగా ప్రచారం

» ఘనస్వాగతం పలికిన మహారాష్ట్ర ప్రజలు

హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): శివసేన (యూబీటీ) అభ్యర్థి ఆదిత్య ఠాక్రేకు మద్దతుగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం ముంబైలోని వర్లీలో రోడ్‌షో నిర్వహించారు. మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్‌గా పాల్గొంటున్న రేవంత్‌కు దారి పొడవునా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అక్కడి ప్రజలు ఘన స్వాగతం పలికారు. రోడ్ షోకు ముందు రేవంత్ ముంబైలోని తిరుపతి బాలాజీ ఆలయంలో పూజలు చేశారు. రోడ్ షోలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు శివసేన (యూబీటీ) అభ్యర్థి ఆదిత్య ఠాక్రే, ముంబై నగర కాంగ్రెస్ అధ్యక్షురాలు వర్ష గైక్వాడ్ పాల్గొన్నారు.

డిసెంబరు ఆఖరునాటికి నివేదిక ఇవ్వండి

» కాళేశ్వరం కమిషన్ గడువును
2 నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై విచారణ నివేదికను ఈ ఏడాది డిసెంబరు నెలాఖరుకల్లా ఇవ్వాలని జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్‌ను ప్రభుత్వం కోరింది. ఈ మేరకు కమిషన్ విచారణ చేసి నివేదికను సమర్పించే గడువును డిసెంబరు నెలాఖరుదాకా పొడిగిస్తూ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా బుధవారం జీవో జారీ చేశారు. వాస్తవానికి ఈ నెల 12 నుంచి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ మూడో విడత క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను ప్రారంభించాల్సి ఉంది. అయితే గడువు పొడిగింపు జీవో వెలువడనందున జస్టిస్ పీసీ ఘోష్ క్రాస్ ఎగ్జామినేషన్ షెడ్యూల్‌ను ప్రకటించలేదు. తాజాగా గడువు పొడిగింపు జీవో జారీ కావడంతో తదుపరి విచారణ షెడ్యూల్‌ను జస్టిస్ పీసీ ఘోష్ విడుదల చేసే అవకాశం ఉంది. కమిషన్ ఇప్పటికే నీటిపారుదల శాఖ ఈఎన్‌సీలు, మాజీ ఈఎన్‌సీలు, చీఫ్ ఇంజనీర్లు, ఎస్ఈలను క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. తదుపరిగా నీటిపారుదల శాఖ కార్యదర్శులుగా, ఇతర హోదాల్లో పనిచేసిన ప్రస్తుత, మాజీ ఐఏఎస్ అధికారులను ఇదే నెలలో విచారించి బ్యారేజీల నిర్మాణంలో కీలక నిర్ణయాలను ఎవరు తీసుకున్నారన్న అంశంపై సాక్ష్యాలను సేకరించేందుకు కమిషన్ సిద్ధమైంది.

సన్నాలకు రూ.500 బోనస్ ఏదీ?

సకాలంలో ధాన్యం డబ్బులు
చెల్లించలేని దుస్థితిలో సర్కారు: హరీశ్‌రావు



మర్రిగూడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద కొన్న ధాన్యానికి సకాలంలో డబ్బులు చెల్లించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. సర్కారు సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం, గన్నీ బస్తాలు ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. తర్వాత స్థానిక నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ వడ్లకు మద్దతు ధర చెల్లించడంలేదని మిర్యాలగూడలో రైతులు రాస్తారోకో చేస్తుంటే... ధాన్యానికి మద్దతు ధరతోపాటు సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తున్నామని మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో సీఎం తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. కొన్న వడ్లకు కూడా విపరీతంగా తరుగు పెట్టి రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర ఇబ్బందిపెడుతోందన్నారు. ఇటీవల జగిత్యాల జిల్లా పర్యటనలో రైతులను అడిగితే కిలో సన్న వడ్లు కూడా కొనడంలేదని చెప్పారన్నారు. సన్న వడ్లను కొనే వ్యవస్థ ఏర్పాటులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ముఖ్యమంత్రికి మద్యం విక్రయంపై ప్రేమ ఎక్కువైందన్న ఆయన.. మద్యం విక్రయాలకు టార్గెట్ పెట్టి ఆదాయం పెంచాలని అధికారులపై ఒత్తిడి చేస్తున్నారని, మెమోలిస్తూ బదిలీ చేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని తాగుబోతుల తెలంగాణ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి చూస్తున్నారని ఆరోపించారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి మీద ఒట్టు పెట్టి రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తానని మోసం చేశాడన్నారు. రూ.15వేల రైతు బంధును రైతులకు ఇవ్వాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. హరీశ్ వెంట మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య తదితరులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

తాలిబాన్‌తో స్నేహం

భారతదేశంలో అఫ్ఘానిస్థాన్ రాయబారిగా ఇక్రముద్దీన్ కమిల్‌ను తాలిబాన్ ప్రకటించింది. ముంబైలోని అఫ్ఘానిస్థాన్ దౌత్యకార్యాలయంనుంచి ఈ యువవిద్యార్థి తన కార్యకలాపాలు నిర్వహిస్తాడని తాలిబాన్ మంత్రి ప్రకటించారు. అఫ్ఘానిస్థాన్‌లో తాలిబాన్ అధికారంలోకి వచ్చిన మూడేళ్ళ తరువాత, ఆ ప్రభుత్వాన్ని ఇంకా భారత్ అధికారికంగా గుర్తించాల్సి ఉండగా జరిగిన తొలి నియామకం ఇది. భారత ప్రభుత్వం ఇంకా ఆమోదించవలసి ఉన్నప్పటికీ, కమిల్ పేరును రెండుదేశాలు ఇప్పటికే ఏకమాటగా అనుకున్నాయని వార్త. కమిల్ భారత్‌లో ఏడేళ్ళపాటు చదువుకున్నాడు. మనదేశం ఇచ్చిన స్కాలర్‌షిప్‌తో న్యాయశాస్త్రంలో డాక్టరేట్ చేశాడు. ముంబైలోనే ఉంటూ ఇప్పటికే అనధికారికంగా తన విధులు నిర్వహిస్తున్నాడని, భారతదేశంలో అఫ్ఘాన్ల శ్రేయస్సుకోసం పనిచేస్తున్న అఫ్ఘాన్ జాతీయుడన్న గుర్తింపుతో మన ప్రభుత్వ వ్యవస్థ అతడికి సహకరిస్తున్నదని వార్తలు వెలువడ్డాయి. తాలిబాన్ పాలనను గుర్తించనప్పటికీ, రెండుదేశాల మధ్యా సంబంధాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. తమదేశంలో దౌత్యవేత్తలను నియమించి, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేసి, గతంలో మాదిరిగా భారత్ సన్నిహితంగా ఉండవచ్చునని తాలిబాన్ ఎప్పటినుంచో అంటోంది. ఇప్పుడు కమిల్ నియామకాన్ని ఆమోదించిన పక్షంలో దౌత్యసంబంధాన్ని భారత్ పునరుద్ధరించినట్టు లెక్క. కొత్తగా ఏ గుర్తింపూ ఇవ్వకుండానే అతడితో మనదేశం వ్యవహరించవచ్చునన్న విశ్లేషణలు కూడా వెలువడుతున్నాయి.

భారత విదేశీవ్యవహారాలశాఖలో, పాకిస్థాన్–అఫ్ఘానిస్థాన్–ఇరాన్ వ్యవహారాల విభాగంలో జాయింట్ సెక్రటరీగా ఉన్న జేపీ సింగ్ గతవారం కాబూల్‌లో పర్యటించారు. అఫ్ఘాన్ రక్షణ, విదేశాంగమంత్రులతో చర్చల్లో, అనేక అంశాలతో పాటు, కమిల్ నియామకానికి కూడా అంగీకారం కుదిరిందని అంటారు. ఐక్యరాజ్యసమితిలో స్థానం గురించి తాలిబాన్ తహతహలాడుతున్న తరుణంలో మనం ఇలా సంబంధాలు నెలకొల్పుకోవడానికి ఉత్సాహపడుతున్నామని విశ్లేషకులు అంటున్నారు.

జేపీ సింగ్ పర్యటనలో అఫ్ఘాన్ రక్షణమంత్రి మహ్మద్ ముజాహిద్ భారతదేశంపట్ల పూర్తి సానుకూల దృక్పథాన్ని స్పష్టపరుస్తూ, భారత వ్యతిరేక కార్యకలాపాలకు తమ గడ్డ అడ్డాకాబోదని గట్టిగా హామీ ఇచ్చారట. రెండవ విడత పాలనలో భారతదేశానికి సంబంధించినంతవరకూ గత మూడేళ్ళలో తాలిబాన్ ప్రవర్తన ఇబ్బందికరంగా లేనిమాట నిజం. ప్రధానంగా పాకిస్థాన్ మాటను విశ్వసించి, అఫ్ఘానిస్థాన్‌నుంచి అమెరికా తన సైన్యాన్ని ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. ఆ ప్రక్రియ కొనసాగుతూండగానే తాలిబాన్ సేనలు దేశాన్ని ఆక్రమించాయి. అప్పటి పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ సంతోషంగా అల్లాను తలుచుకున్నారు. పాకిస్థాన్ చెప్పుచేతల్లో తాలిబాన్ ఉంటుందని, నచ్చినట్టుగా వాడుకోవచ్చునని ఆయన నమ్మారు. కానీ, ఇందుకు భిన్నంగా, స్వతంత్రంగా వ్యవహరించడంతో పాటు, లష్కర్, జైష్ వంటి పాక్‌ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలను తాలిబాన్ తన భూభాగంలో ఏమాత్రం అనుమతించలేదు. పాకిస్థాన్ ఇంటర్‌సర్వీసెస్ ఇంటలిజెన్స్ (ఐఎస్ఐ) ఆశీస్సులున్న ఇస్లామిక్ స్టేట్ అనుబంధ గ్రూపులతో పోరాడుతున్నది కూడా. దీనికితోడు, పాకిస్థాన్‌లో విధ్వంసం సృష్టిస్తున్న తెహ్రీక్–ఎ–తాలిబాన్ వంటి సంస్థల కారణంగా ఆ రెండు దేశాల మధ్యా దూరం మరింత పెరిగిపోయింది. పాకిస్థాన్‌లో ఉంటున్న లక్షలాదిమంది అఫ్ఘాన్లను వెళ్ళగొట్టడం వరకూ సంబంధాలు చెడిపోయాయి. అఫ్ఘానిస్థాన్‌లో తన ప్రత్యేక ప్రతినిధి ఆసిఫ్ దురానీని సెప్టెంబరులో పాకిస్థాన్ ఉపసంహరించుకోవడం దిగజారుతున్న సంబంధాలకు నిదర్శనం.

ఈ నేపథ్యంలో, భారత్–అఫ్ఘాన్ దగ్గరకావడంలో ఆశ్చర్యమేమీ లేదు. గతంలో పార్లమెంట్ భవనం నిర్మాణం సహా చాలా ప్రాజెక్టులు చేపట్టిన భారతదేశంనుంచి మరింత సాయాన్ని, మరిన్ని మౌలిక సదుపాయాల నిర్మాణాన్ని తాలిబాన్ కోరుతోంది. భారతదేశంలో అఫ్ఘాన్ జనాభా ఎక్కువగా ఉండటంతో పాటు, చదువుకోసం వైద్యంకోసం అక్కడనుంచి అధికులు వస్తున్న నేపథ్యంలో, వారికి విస్తృతమైన సేవలు అందించేందుకు కార్యాలయాలు తెరవాలని, నియామకాలు జరుపుకోవాలని కూడా ఆశిస్తోంది. గతంలో పోల్చితే అమానుషత్వం తగ్గినప్పటికీ, మహిళలు, విద్య, బహిరంగ శిక్షలు ఇత్యాది విషయాల్లో తాలిబాన్ పెద్దగా మారలేదు. రెండుదేశాలు పరస్పర ప్రయోజనాలకోసం కృషిచేయడమే కాక, భారత్‌తో సన్నిహిత సంబంధాలకు వీలుగా తాలిబాన్ మరికొంత మార్పు చెందవలసి ఉంది.

బాలల సినిమా పండుగ మళ్లీ ఎప్పుడు?

చాచా నెహ్రూ పుట్టిన రోజు అంటే పిల్లలకు పండుగే... తెలుగు రాష్ట్రాలకు సంబంధించినంతవరకు మొన్న మొన్నటివరకూ బాలల దినోత్సవం అంటే బాలల చలన చిత్రోత్సవం అనే కదా. నవంబర్ నెల అనగానే అందరికీ గుర్తొచ్చేది రెండేళ్లకోసారి విచ్చేసి సందడి సందడి చేసే అంతర్జాతీయ బాలల చలనచిత్రోత్సవమే. ఊహలకే రెక్కలు తొడిగినట్టు, ఆకసం నుంచి తారలు జారిపడినట్టు, చందమామే పిల్లలకు మంచి కథలు చెప్పడానికి దివి నుంచి దిగివచ్చినట్టు... ఉండేది ఆ చిత్రోత్సవం. అదో అనిర్వచనీయమైన అనుభవం. ఎన్నెన్ని అద్భుతమైన చిత్రాలు... ఎన్నెన్ని కళాఖండాలు... వాటిని తనివితీరా చూసి, మనసారా ఆస్వాదించి మనవాళ్లు ఎంతగా తాదాత్మ్యం చెందారు! ఎన్నెన్ని ఉత్తేజపూరితమైన చిత్రాలు చూసి పిల్లలు ఎంతగా ఆశ్చర్యచకితులయ్యారు! దేశ దేశాల జానపద సాహిత్యం నుంచి, ఇతిహాసాల నుంచి, వర్తమాన వైచిత్రిక స్థితిగతుల నుంచి, దైనిక దుర్భర జీవన యవనిక నుంచీ వచ్చిన మరచిపోలేని వినూత్నమైన కథలు తిన్నగా మన మధ్య నిల్చుని మనతో సంభాషించేవి. ఎక్కడెక్కడో ప్రాణం పోసుకుని పరుగులు తీసుకుంటూ పరోపకారి పాపన్న వంటి పాత్రలు మన కోసమే అరుదెంచినట్టు ఉండేది. సున్నితమైన అంశాలతో పిల్లలని, పెద్దలనీ సమానంగా అలరించే ఇరాన్ సినిమాలు అంటే అందరికీ ప్రత్యేకమైన అభిమానం. ఎన్నెన్ని తియ్యని అనుభవాలు... పిల్లలతో పాటు కవులు, కళాకారులు, చిత్రకారులు, పాత్రికేయులు, సినిమా విమర్శకులు, దర్శక నిర్మాతలు, నటీనటులు... ఎందరో ఔత్సాహిక కళాకారులు ఈ హైదరాబాద్ చలన చిత్రోత్సవంలో చురుకుగా పాల్గొనేవారు. దేశ వ్యాప్తంగా వందల సంఖ్యలో పిల్లలు బిరబిరా గలగలా ఉత్సాహం ఉరకలెత్తగా వచ్చి ఈ చిత్రోత్సవంలో పాల్గొనేవాళ్లు. ప్రపంచ వ్యాప్తంగా సృజనాత్మకతకు ప్రతీకలుగా వచ్చిన ఆ చిత్రాలతో ఆ మధ్య వరకు మిలమిలా మెరిసిపోయిన హైదరాబాద్ వెండితెరలు కొన్నేళ్లుగా వెలవెలబోతున్నాయి. అంతమందిని ఘుమఘుమరిపించిన ఆ చిత్రోత్సవాలు ఇప్పుడు ఏమైపోయాయి? హైదరాబాద్ చిత్రోత్సవం అంటేనే అదో భావోద్వేగం... ఆ పరిస్థితి ఇప్పుడు లేదు. అంతటా నిస్తేజం. బంగారు, వెండి ఏనుగులతో ఉత్తమ చిత్రాలను గుర్తించి, గౌరవించిన మన చలన చిత్రోత్సవం ఇప్పుడు ఏకంగా చిరునామా లేకుండాపోయింది! ఎందుకీ దైన్య స్థితి?

సినిమా అంటే కేవలం కదలాడే బొమ్మలు కాదని విశ్వసించిన మన తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ ఉత్తమ చిత్రాలను తీసుకువచ్చి ప్రదర్శిస్తే అవి మన యువతీ యువకులపై నిర్మాణాత్మక ప్రభావం చూపిస్తాయని, తద్వారా దేశ సంస్కార వికాసానికి, కళా ప్రాభవానికీ కొత్త దారులు ఏర్పడతాయని భావించారు. అందుకే అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల నిర్వహణకు 1952లో అంకురార్పణ చేశారు. ప్రధాన స్రవంతి సినిమా ఒకవైపు ప్రేక్షకులను విపరీతంగా ఆకర్షిస్తున్నా, జీవితంలో ఏదో ఒక విలువ కోసమో, కనీ కనిపించని ఒక జీవిత పార్శ్వాన్ని తడిమి, మనసును ఆర్ద్రం చేసి చూపించడానికో సృజనాత్మక దర్శకులు చేసే ప్రయత్నాలను కూడా నెహ్రూ గమనించారు.



హైదరాబాద్ బాలల చలన చిత్రోత్సవాలకు గ్రహణం ఎందుకు పట్టింది, బాధ్యత ఎవరిదన్న రంధ్రాన్వేషణ ప్రస్తుతం అప్రస్తుతం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం మూలపడిన పాత ఫైళ్ల దుమ్ము దులిపించి, మళ్లీ బాలల చిత్రోత్సవాన్ని హైదరాబాద్‌కు రప్పించేందుకు ఈరోజే తొలి అడుగు వేస్తే, హైదరాబాద్ కళామతల్లికి పూర్వ వైభవం ఖాయం.

అటువంటి చలన చిత్రాల దర్శక నిర్మాతలను ప్రోత్సహించడానికి జాతీయ స్థాయిలో సినిమా పురస్కారాలను కూడా ఏర్పాటు చేశారు. ఉత్తమ చలన చిత్రాల నిర్మాణం కోసం ముందుకు వచ్చే దర్శకులకు సాయంగా ఉంటుందని నెహ్రూ నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కి కూడా నెహ్రూ శ్రీకారం చుట్టారు. సినిమా అంటే మన సామాజిక, సాంస్కృతిక, రాజకీయ పరిణామాలకు ప్రతీక అని నమ్మి అలనాటి చిత్రాల తరగని గనిగా పూణేలో నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్స్‌ను ఏర్పాటు చేశారు. అలాగే నటీనటులు, దర్శకులు, సినిమా రచయితలు, ఛాయాచిత్ర దర్శకులు కాదలచిన ఔత్సాహికులకు మంచి శిక్షణ ఇవ్వడం కోసం ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఎక్కడెక్కడో నిర్మించిన చిత్రాలను వడపోసి మన ప్రేక్షకులకు అందించే దిశగా అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలకు బీజం వేశారు. అందుకు ఏకంగా ఒక డైరెక్టరేట్‌నే ఏర్పాటు చేశారు. ఆ పరంపరలోనే పిల్లల కోసం అంటూ ముంబై కేంద్రంగా ఒక ఫిల్మ్ సొసైటీ ఏర్పాటు అయ్యింది. ఈ సొసైటీ నిర్వహణలో పిల్లల కోసం ఉత్తమ చిత్రాల ప్రదర్శన కూడా మొదలైంది. కొన్ని నిర్వహణ లోపాలు ఎదురుకావడంతో వాటికి పరిష్కారంగా 2005లో నాటి కేంద్ర సమాచార శాఖ మంత్రి జైపాల్ రెడ్డి హైదరాబాద్ నగరాన్ని బాలల చలన చిత్రోత్సవాలకు శాశ్వత వేదికగా ప్రకటించారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయిస్తే చిత్రోత్సవాల సమయంలో సినిమా ప్రదర్శనలకు వీలుగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శాశ్వత థియేటర్లు నిర్మిస్తామన్నారు. చిత్రోత్సవాలు లేని సమయంలో అక్కడే అలనాటి ఆణిముత్యాలు అనదగిన తెలుగు, హిందీ పాత చిత్రాల ప్రదర్శనకు ఈ థియేటర్లను వినియోగించుకోవచ్చు. భారతీయ చిత్రాలపైనా, తెలుగు సినిమా చరిత్రపైనా అమెరికాలో లాగా మంచి ఆడియో విజువల్ ప్రదర్శనలు, అలాగే సినిమాలపై ఒక గ్రంథాలయం, సినిమా పరిశోధనలకు దేశదేశాల నుంచి వచ్చే అతిథులకోసం విడిది సౌకర్యాలు కల్పించాలన్నది ఆనాటి ప్రకటన సారాంశం. వాటితో పాటు అసలు చిల్డ్రన్స్ ఫిల్మ్ సొసైటీనే హైదరాబాద్‌కు తరలించాలనే ఆకాంక్షను ఆ రోజున జైపాల్ రెడ్డి వ్యక్తం చేశారు. అందుకు వెంటనే సానుకూలంగా స్పందించిన నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి హైదరాబాద్ ఫిల్మ్ నగర్‌లో 15 ఎకరాల స్థలాన్ని మంజూరు చేశారు. శాశ్వత భవనాలు సిద్ధమయ్యేలోపు హైదరాబాద్ నడిబొడ్డున గల ఐమాక్స్ తదితర ముఖ్యమైన థియేటర్లలో చిత్రోత్సవాల సమయంలో మిగిలిన చిత్రాల ప్రదర్శనలు ఆపి చిత్రోత్సవాల సినిమాల ప్రదర్శనలకు కేటాయించాలని కూడా నిర్ణయించారు.

ఆ దిశగా కొన్ని మంచి అడుగులు పడ్డాయి. సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ హోదాలో డాక్టర్ కెవి రమణ హైదరాబాద్ లోని ముఖ్యమైన థియేటర్ల యాజమాన్యాన్ని ఒప్పించి బాలల చిత్రోత్సవాలను అద్వితీయంగా నిర్వహించారు. సినిమాలు చూడడానికి ఎక్కడెక్కడినుంచో వచ్చే బాల ప్రతినిధులకు విడిది సౌకర్యాలతో పాటు ఐమాక్స్‌కి విచ్చేసే వారందరికీ భోజన సదుపాయాలు కూడా ఏర్పాటు చేసేవారు. అంతకు ముందు ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అద్భుతంగా నిర్వహించిన అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలే ఈ బాలల చిత్రోత్సవ నిర్వహణకు స్ఫూర్తి. (ఇప్పటికీ అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలలో ఆతిథ్యం అంటే హైదరాబాద్‌దే అగ్రతాంబూలం అని ఎంతో అభిమానంతో గుర్తు చేసుకుంటారు.)

ఒక చిత్రోత్సవంలో ఇరాన్ చిత్రం— ది కార్ట్, మరో చిత్రోత్సవంలో రష్యన్ చిత్రం— ది సెలెస్టియల్ క్యామెల్, మరో చిత్రోత్సవంలో చైనా చిత్రం— ది ఇన్విజిబుల్ వింగ్స్ (తెలుగులో 'నింగి...నేల... నాదే') బంగారు ఏనుగులను గెల్చుకున్నాయి. ఈ చిత్రాలను చూసినవారు ఇప్పటికీ వాటిని మరిచిపోలేరు. తెలంగాణ సంస్కృతిని విదేశీ ప్రతినిధులకు పరిచయం చేయడానికి 2017లో జరిగిన 20వ బాలల చలన చిత్రోత్సవంలో మన పిల్లలు ఐమాక్స్‌లో ప్రత్యేకంగా బతుకమ్మ ఆడారు. విదేశీ ప్రతినిధులు కూడా ఆ ఆట పాటల్లో పిల్లలతో కలిసిపోయారు. అదో పెద్ద సంబురం. అప్పటివరకూ అంతా బాగానే ఉంది. 2019లో 21వ బాలల చలన చిత్రోత్సవం జరగవలసి ఉంది. కాని జరగలేదు. 2020లో ఆ చిత్రోత్సవం జరుగుతుందని అన్నారు. జరగలేదు. 2021లో కోవిడ్ విలయంతో దేశం మొత్తం ఒక నిశ్చల చిత్రంగా మారిపోయింది... ఇక చిత్రోత్సవం ఎక్కడా! ఆ తర్వాత అయినా చిత్రోత్సవాలు జరుగుతాయని అందరూ ఆశగా ఎదురుచూశారు. ఇంతలో చిత్రోత్సవాలను నిర్వహించే చిల్డ్రన్స్ ఫిల్మ్ సొసైటీని కేంద్రం 2022లో జాతీయ చలనచిత్ర అభివృద్ధి సంస్థలో విలీనం చేసేసింది. ఇప్పుడు దాని ఆలనా పాలనా చూసేవారెవ్వరో ఎవరికీ తెలియదు. హైదరాబాద్‌లో బాలల చిత్రోత్సవాలు నిర్వహించే రోజులలో ముంబై నుంచి వచ్చే సొసైటీ ప్రతినిధులు ఇక్కడివారిపై ఆధిపత్యం చెలాయించేవారు. అది ఇక్కడి నిర్వాహకులకు చాలా బాధ కలిగించిన సందర్భాలు చాలా ఉన్నాయి. అది పక్కన పెడితే చిత్రోత్సవ నిర్వహణకు అయ్యే ఖర్చును భరించడానికి సొసైటీ ఆసక్తి చూపకపోవడంతో ఆ ఖర్చును చాలా వరకూ ఇక్కడి రాష్ట్ర ప్రభుత్వమే భరించేది. ఖర్చు అంతా మాదే అయినప్పుడు సొసైటీని కూడా మాకే అప్పగించేస్తే అంతా మేమే చూసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం చూచాయగా చెప్పిందే గాని దానికోసం గట్టిగా పట్టుపట్టిన దాఖలా లేదు.


ఆబాలగోపాలాన్నీ అలరించిన బాలల చిత్రోత్సవాల పరిస్థితి రాను రాను కర్ణుని మరణంలా ముచ్చటించుకోవలసివస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఎంతో గుర్తింపు, గౌరవం పొందిన మన హైదరాబాద్ బాలల చలన చిత్రోత్సవాలకు గ్రహణం ఎందుకు పట్టింది, బాధ్యత ఎవరిదన్న రంధ్రాన్వేషణ ప్రస్తుతం అప్రస్తుతం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం మూలపడిన పాత ఫైళ్ల దుమ్ము దులిపించి మళ్లీ బాలల చిత్రోత్సవాన్ని హైదరాబాద్‌కు రప్పించేందుకు ఈరోజే తొలి అడుగు వేస్తే, హైదరాబాద్ కళామతల్లికి పూర్వ వైభవం ఖాయం. సినిమా మణిహారమైన హైదరాబాద్‌కు అందరూ మళ్లీ బ్రహ్మరథం పట్టడమూ ఖాయం. ఇది అత్యాశ కాదు కదా!

■ జగన్
సీనియర్ జర్నలిస్టు
(నేడు బాలల దినోత్సవం)

జ్ఞాన భారతానికి ఊపిరి గ్రంథాలయమే!

సమాజంలోని అట్టడుగు స్థాయిలో ఉన్నవారికి కూడా సమాచారాన్ని అందించాలన్నదే పౌర గ్రంథాలయాల ప్రాథమిక సూత్రం. పౌర గ్రంథాలయాలు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయగలవు, సామాజిక సమానత్వాన్ని పెంపొందించగలవు, నాణ్యమైన సమాచారం ద్వారా బాధ్యతాయుతమైన పౌరులను తయారు చేయగలవు. అయితే మన గ్రంథాలయాలు అలాంటి పాత్ర పోషించగలుగుతున్నాయా?

మన దేశంలో ఎన్ని పబ్లిక్ లైబ్రరీలు ఉన్నాయీ అన్న లెక్కే సరిగా లేదు. 1947 నుంచి భారతదేశంలో పబ్లిక్ లైబ్రరీల సంఖ్యపై అధికారిక గణాంకాలు లేవు. గ్రంథాలయాలకు ఒక ప్రత్యేక శాఖ అంటూ కూడా లేకుండా అవి సాంస్కృతిక మంత్రిత్వ శాఖ కింద పని చేస్తున్నాయి. ఆ శాఖ కింద వీటి నిర్వహణను 1972లో స్థాపించబడిన రాజా రామ్మోహన్ రాయ్ లైబ్రరీ ఫౌండేషన్ (RRRLF) చూసుకుంటున్నది. ఈ సంస్థ లెక్క ప్రకారం పౌర గ్రంథాలయాలు 46,746; సాంస్కృతిక మంత్రిత్వ శాఖ 2014లో విడుదల చేసిన నివేదిక ప్రకారం 54,846; 2011 జాతీయ జనాభా లెక్కల తరువాత ఒక జాతీయ సంస్థ చేసిన సర్వేలో 75,000; తరువాత ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ లైబ్రరీ అసోసియేషన్స్ అండ్ ఇన్‌స్టిట్యూషన్స్ లెక్క ప్రకారం 1,46,000... ఇలా వేర్వేరు అంకెలతో మన వద్ద ఉన్న లైబ్రరీల సంఖ్యపై జాతీయ స్థాయిలో డేటా సమగ్రత లేదు. రాష్ట్ర స్థాయిలోని డేటా కూడా చాలా రాష్ట్రాల్లో దొరకడం కష్టం. గత సంవత్సరం ఆగస్టు మాసంలో జాతీయ స్థాయిలో 'గ్రంథాలయాల పండగ' అనే కార్యక్రమం జరిగిన సందర్భంగా— జాతీయ వ్యాప్తంగా ఆదరణ పొందిన గ్రంథాలయాలకు ప్రభుత్వం అండగా ఉండేందుకు అంగీకరించింది. అదేవిధంగా భారతదేశం వ్యాప్తంగా గ్రంథాలయాలకు డైరెక్టరీని తయారు చేయాలన్న ప్రతిపాదన కూడా ఆమోదం పొందింది.



పౌర గ్రంథాలయాలు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో, సామాజిక అసమానతలను తొలగించడంలో, పౌరులకూ ప్రభుత్వానికీ మధ్య సంధానకర్తలుగానూ ముఖ్యమైన పాత్రను పోషిస్తాయి. మన దేశంలో స్వాతంత్ర్యోద్యమంలో తలమానిక పాత్ర పోషించిన పౌర గ్రంథాలయాలు నేడు ఆ స్థాయిలో పనితీరు కనబరచలేకపోతున్నాయి. కారణాలు ఏవైనా వాటిని అధిగమించాలి.

వివిధ రాష్ట్రాలలో గ్రంథాలయాలకు ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖ అంటూ లేకపోవడం బాధాకరం. అవి విద్యా శాఖ లోనూ సాంస్కృతిక శాఖ లోనూ విభాగాలుగా ఉంటున్నాయి. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలలో పబ్లిక్ లైబ్రరీస్ శాఖ, పబ్లిక్ లైబ్రరీస్ డైరెక్టర్ ఉన్నారు. త్రిపుర స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, హర్యానా పబ్లిక్ లైబ్రరీలు ఉన్నత విద్యా శాఖ ద్వారా నిర్వహించబడుతున్నాయి. ఇతర రాష్ట్రాల్లో ఇది సాంస్కృతిక విభాగం కిందకు వస్తుంది.

తెలుగు రాష్ట్రాలలో అయితే దాదాపు మూడు దశాబ్దాలుగా గ్రంథ పాలకుల నియమాకం జరగ లేదు. 2021 ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (PTI) వార్తా కథనం ప్రకారం— భారతదేశం లోని 1.2 మిలియన్ల లైబ్రేరియన్లలో కేవలం 10శాతం మంది మాత్రమే వృత్తిపరంగా అర్హత కలిగి ఉన్నారు. అర్హత కలిగిన గ్రంథ పాలకుల నియామకం దశాబ్దాలుగా నలుగుతున్న సమస్య. గ్రంథ పాలకులను నియమించటమే గాక, వారికి నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సేవలు అందించేందుకు తగిన తర్ఫీదును ఇవ్వాలి. ఇందుకు ఒక మానవ వనరుల విభాగాన్ని జాతీయస్థాయిలో ఏర్పాటు చేయాలి.

దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ పౌర గ్రంథాలయాలు నిధుల కొరతతో ఇబ్బంది పడుతున్నాయి. కొన్ని రాష్ట్ర లైబ్రరీలు స్థిర గ్రాంట్ల ద్వారా, గ్రంథాలయాల సెస్ ద్వారా నిధులు పొందుతున్నాయి. దేశంలో ఆరేడు రాష్ట్రాలు గ్రంథాలయాల నిర్వహణకు లైబ్రరీ సెస్‌ను వసూలు చేస్తున్నాయి. కానీ ఈ పన్ను వసూలు చేసే స్థానిక మున్సిపల్ సంస్థలు సకాలంలో ఈ నిధులను పౌర గ్రంథాలయ శాఖలకు చెల్లింపులు చేయని ఉదంతాలు ఎక్కువ ఉన్నాయి. ఉదాహరణకు, కర్ణాటకలోని బృహత్ బెంగళూరు మహానగర పాలికే (BBMP) పబ్లిక్ లైబ్రరీల శాఖకు 2019 నాటికి రూ.226 కోట్లకు పైగా బకాయిపడింది. గ్రంథాలయాల పన్ను ద్వారా వచ్చిన నిధులను ఇతర శాఖలలో పనుల కోసం కేటాయిస్తున్నారు.

పౌర గ్రంథాలయాలు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో, సామాజిక అసమానతలను తొలగించడంలో, పౌరులకూ ప్రభుత్వానికీ మధ్య సంధానకర్తలుగానూ ముఖ్యమైన పాత్రను పోషిస్తాయి. అత్యధిక సంఖ్యలో పౌర గ్రంథాలయాలు కలిగివున్న కేరళ, అత్యధిక అక్షరాస్యత కలిగిన రాష్ట్రం. రెండవ రాష్ట్రంగా ఢిల్లీ, ఆ తర్వాత కర్ణాటక చక్కటి పాత్రను పోషిస్తున్నాయి. కేరళ రాష్ట్రంలోనే దాదాపు 9000 లైబ్రరీలు ఉన్నాయి. కేరళలో లైబ్రరీలు ట్రస్ట్ లేదా ప్రజల సొసైటీలుగా ఏర్పడి, కేరళ స్టేట్ లైబ్రరీ కౌన్సిల్‌కు అనుబంధంగా ఉంటాయి. అతి తక్కువ పౌర గ్రంథాలయాలు కలిగివున్న రాష్ట్రం ఉత్తరప్రదేశ్. ఈ రాష్ట్ర అక్షరాస్యత కూడా అంతంత మాత్రమే. ప్రతి వీధిలో కనీసం ఒక పబ్లిక్ లైబ్రరీని లక్ష్యంగా పెట్టుకొని దీన్ని దశలవారీగా పూర్తి చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికలు సిద్ధం చేసుకొని ముందుకు నడవాలి.

అమెరికా సంయుక్త రాష్ట్రాలలో, జపాన్, జర్మనీ, కెనడా, సింగపూర్ దేశాలలో ఆయా దేశాల జనాభా ప్రాతిపాదికన పౌర గ్రంథాలయాలను ఏర్పాటు చేసుకున్నారు. వాటితోపాటు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం కలిగిన, తగు అర్హతలు ఉన్న గ్రంథ పాలకుల ద్వారా చదువరులకు సమాచారాన్ని అందిస్తున్నారు. ఆ దేశాల ప్రజలు పౌర గ్రంథాలయాలను 'మావి' అని సొంతం చేసుకుంటున్నారు. అలా చేసుకోవడం వల్ల గ్రంథాలయాల వినియోగంతో పాటు వాటి అభివృద్ధి కూడా సమపాళ్ళలో జరుగుతుంది. ఆదరణకు అనుగుణంగానే నిర్వహణ స్థాయి కూడా ఉంటుంది. మన దేశంలో స్వాతంత్రోద్యమంలో తలమానిక పాత్ర పోషించిన పౌర గ్రంథాలయాలు నేడు ఆ స్థాయిలో పనితీరు కనబరచలేకపోతున్నాయి. కారణాలు ఏవైనా వాటిని అధిగమించాలి. గ్రంథాలయాల పునర్జీవనంతోనే మన దేశం జ్ఞాన భారతంగా వర్ధిల్లుతుంది.

● డా. రవి కుమార్ చేగోని
ప్రధాన కార్యదర్శి, తెలంగాణ గ్రంథాలయ సంఘం
(నేటి నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు)

ఉషోదయాలకు ఊపిరి పోద్దాం!

యుద్ధాకాశపు కన్నీటి మేఘాల
రణధ్వనుల మధ్య లక్షల
బాలల ఆకలికడుపుల గేయాలు
అనునాదం చెందుతున్నాయి

భయపు వరదలో బాల్యపు
పరిమళం బిక్కచిక్కి
తుపాకుల మోతలమధ్య
రాకెట్ల వర్షంలో తడుస్తున్నాయి

బతకడానికి బతిమాలుతూ
చంపడాన్ని తీవ్రంగా నిరసిస్తూ
శాంతికాంతి జ్వాలల వెలుగుకై
పసిపిల్లల దండు ఆర్తనాదాలతో
పలకబలపపు చరితల ఆనందపు
రహదారులను వెతుకుతున్నాయి

ఈ ఆధునికత అలజడులలో
ఒత్తిడి మాయలో బడుల్లో..
పేదరికపు సమరంలో బస్టాండుల్లో..
బాలకార్మికుల అర్ధనగ్న బతుకు చిత్రాలు
నేటి స్వతంత్ర భారతంలో
ఇంకా దర్శనమిస్తూనే వున్నాయి

యుద్ధం లేని బాల్యపు
ఉషోదయాలకు
ఊపిరి పోయాలి.
ఒత్తిడి లేని జీవితచదువులకు
జ్ఞాన ద్వారాలు తెరవాలి.

పసిపిల్లల నిండు పున్నమి
వెన్నెల వెలుగులలో ప్రపంచమంతా
రేపటితరపు కలల రాతలు
అందమైన బాల్యపు జలపాతపు
సవ్వడుల సంగీతాన్ని వినిపించాలి.
కలాల కవనపు గీతాలు
విశ్వశాంతి సౌధాల
నిలయాలై వికసించాలి.

– ఫిజిక్స్ అరుణ్ కుమార్

బిర్సా పోరాట స్ఫూర్తి అమరం!

పట్టుమని ఈ నేల మీద పాతికేళ్లు మాత్రమే జీవించినా ఆదివాసీలకు ఆరాధ్య దైవంగా మారాడు బిర్సా ముండా. జార్ఖండ్‌లోని ఖుంటి జిల్లా ఉలిహత్ గ్రామంలో 1875 నవంబర్ 15న సుగుణ ముండా, కర్మిహాట్ దంపతులకు జన్మించాడు. చయిబాసాలోని మిషనరీ స్కూల్‌లో చదువుకోవటానికి క్రైస్తవం లోకి మారాడు. చదువుకుంటూనే అడవి మీద ఆధారపడే ఆదివాసుల హక్కులకై పోరాడాడు. అప్పట్లో ఆదివాసీ భూములపై బ్రిటిష్ పాలకులు అధిక పన్నులు వసూలు చేసేవారు. చెల్లించని వారి ఆస్తులను లాక్కునేవారు. భూములను తిరిగి ఇచ్చేయాలని ఒక రోజు తెగ పెద్దలతో కలిసి బిర్సా ముండా తెల్లదొరలపై ఒత్తిడి చేశాడు. దాంతో మిషనరీ స్కూల్ ఆయనను బహిష్కరించింది. వారి ఎదుటే నుదుట నామం పెట్టి, జంధ్యం ధరించి, ఇకపై క్రైస్తవం లోకి ఒక్క ఆదివాసీని కూడా మారకుండా చూస్తానని బిర్సా ప్రతినబూనాడు. కుంతి, తామర్, బసియా, రాంచీ ప్రాంతాలను సరిహద్దులుగా చేసుకుని ఆదివాసీ హక్కుల కోసం మిలిటెంట్ ఉద్యమాన్ని నడిపాడు. బిర్సాయిత్ మతాన్ని స్థాపించాడు. ఆదివాసీలు ఆయనను ధర్తీలబా (దేవుడు)గా కొలిచారు. ఆదివాసీ ప్రతిఘటన ప్రమాదాన్ని గుర్తించిన బ్రిటిష్ పాలకులు ఆయనను అరెస్ట్ చేసి 1900 జూన్ 9న విషప్రయోగంతో చంపేశారు. నేడు ఆ పోరాటవీరుడి అమర స్ఫూర్తి దేశమంతటా వ్యాపించింది.

---- ఎన్. సీతారామయ్య
(రేపు బిర్సా ముండా 150వ జయంతి)

ట్రంప్ గెలుపు డెమొక్రాటిక్ పార్టీ పుణ్యమే!

అమెరికా ఎన్నికల ఫలితాలు వెలువడిన తరవాత వెర్మోంట్ రాష్ట్రానికి చెందిన ఇండిపెండెంట్ సెనెటర్ బెర్నీ సాండర్స్ ఒక బహిరంగ లేఖ విడుదల చేశాడు. ఆ లేఖలో మొదటి వాక్యం ఇది— - "శ్రామిక వర్గాన్ని వదిలేసిన డెమొక్రాటిక్ పార్టీని ఇప్పుడు శ్రామిక వర్గం వదిలేయడంలో ఆశ్చర్యమేమీ లేదు". అమెరికా ఎన్నికల ఫలితాలకి ఇంతకంటే క్లుప్తమైన, సంపూర్ణమైన, విశ్లేషణ ఇంకొకటి ఉండదు.

అమెరికాలో గత 50 ఏళ్ళుగా సామాన్య మానవుడి జీవన ప్రమాణాలు పతనం చెందుతూ వస్తున్నాయి. ఆదాయ అసమానత పెరిగిపోతూ వస్తోంది. 1950లలో ఒక ఫ్యాక్టరీ కార్మికుడి జీతంతో ఇద్దరు పిల్లలున్న ఒక కుటుంబం మధ్యతరగతి జీవనం గడపగలిగేది. కానీ క్రమంగా మాన్యుఫాక్చరింగ్ ఉద్యోగాలన్నీ అమెరికా కంటే చవక జీవన ప్రమాణాలున్న దేశాలకి తరలిపోయాయి. దాని వల్ల వచ్చిన లాభాలు మాత్రం కొద్దిమంది ధనవంతుల జేబుల్లోకి జేరిపోయాయి. ఇప్పుడు అర్ధ శాతం మంది అమెరికన్లు ఒక్క నెల జీతం రాకపోయినా రోడ్డున పడే పరిస్థితి వచ్చింది.

2008లో ఒబామా 'మార్పు తెస్తా'ననే వాగ్దానంతో ఎన్నికలలో నిలబడ్డాడు. మార్పు కోసం జనం ఓటు వేశారు. రిపబ్లికన్ పార్టీ బలంగా ఉన్న ఇండియానా, ఉత్తర కరోలినా వంటి రాష్ట్రాలను కూడా ఒబామా గెలుచుకున్నాడు. కానీ గెలిచిన తరవాత ఆ మార్పు వాగ్దానాన్ని వదిలేశాడు. ఆర్థిక అసమానతలకూ, కార్పొరేట్ల ధనదాహానికీ, రాజకీయాల్లో డబ్బు పాత్రకీ వ్యతిరేకంగా, 2011లో దేశవ్యాప్తంగా లక్షలమంది పాల్గొన్న 'ఆక్యుపై వాల్‌స్ట్రీట్' నిరసనలని అతి క్రూరంగా అణచివేశారు. దివాళా తీసిన పెద్ద పెద్ద కార్పొరేషన్లకి బిలియన్ల డాలర్ల ప్రజాధనాన్ని ఇచ్చి ఆదుకుంది డెమొక్రాటిక్ పార్టీ ప్రభుత్వం. ప్రజాధనాన్ని తీసుకున్న కంపెనీలు కోలుకున్న తరవాత షేర్ మార్కెట్లో లాభపడ్డాయే గానీ, సామాన్య జనానికి గానీ, అప్పులు చేసి మరీ పెద్ద పెద్ద కంపెనీలను ఆదుకున్న ప్రభుత్వానికి గానీ ఏమీ మేలు చేకూరలేదు. ఆర్థిక లోటు మాత్రం పెరిగిపోతూ వచ్చింది. వీటన్నిటి వల్లా అప్పటిదాకా దన్నుగా ఉండిన శ్రామిక జనాలు డెమొక్రాటిక్ పార్టీకి క్రమంగా దూరమవుతూ వచ్చారు.

2016 ఎన్నికలలో ఇండిపెండెంట్ సెనెటర్ బెర్నీ సాండర్స్ డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థిత్వానికి బరిలో నిలబడ్డాడు. అమెరికాలో అసలు ఎన్నికలకి ముందు ప్రైమరీ ఎన్నికలని జరుగుతాయి. ఆ ప్రైమరీలలో ప్రతీ పార్టీ, రాబోయే అధ్యక్ష ఎన్నికల్లో నిలబడడానికి, తన అభ్యర్థిని ఎన్నుకుంటుంది. 2016 ప్రైమరీలలో బెర్నీ సాండర్స్ ఆర్థిక అసమానతలనీ, కార్పొరేట్ అవినీతినీ, ఫార్మా, ఇన్సూరెన్సు కంపెనీల లాభాపేక్షనీ వ్యతిరేకిస్తూ, ప్రభుత్వం సామాన్య ప్రజల కోసం పనిచేయాలనే నినాదంతో నిలబడ్డాడు. డెమొక్రాటిక్ పార్టీతో విసిగిపోయి, ఎన్నికలకే దూరమైపోయిన సామాన్య జనం లక్షలాదిగా బెర్నీని సమర్థించారు. ముఖ్యంగా యువత బెర్నీని ఆదరించింది. బెర్నీ ర్యాలీలు జనంతో కిటకిటలాడగా, అదే పార్టీలోని బెర్నీ ప్రత్యర్థి హిల్లరీ ర్యాలీలు వెలవెలబోయాయి. మీడియా బెర్నీని వెలివేసినా, ప్రైమరీలలో కొత్త ఓటర్లు ఓటు వేయడానికి డెమొక్రాటిక్ పార్టీ నాయకత్వం అవాంతరాలు సృష్టించినా, కార్పొరేట్ కంపెనీలు మిలియన్ల డాలర్లు హిల్లరీ ప్రచారానికి గుమ్మరించినా, కేవలం సామాన్య జనం ఇచ్చిన 10–20 డాలర్ల విరాళాలతో ప్రచారం చేసిన బెర్నీ 23 రాష్ట్రాలు గెలుచుకున్నాడు. దేశ వ్యాప్తంగా 43 శాతం ఓట్లు సాధించాడు. కానీ, పార్టీ అభ్యర్థిగా నామినేషన్ గెలుచుకున్న హిల్లరీ, బెర్నీ ద్వారా డెమొక్రాటిక్ పార్టీకి వచ్చిన మద్దతుని తన వేపు తిప్పుకోవడానికి ఎటువంటి ప్రయత్నమూ చేయలేదు. అంతేకాక "గంటకి జీతం కనీసం పదిహేను డాలర్లు ఇవ్వాలి" అనే డిమాండునీ, అందరికీ ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండాలనే డిమాండునీ అవహేళన చేసింది. మొత్తం మీద మళ్ళీ శ్రామిక జనాల్ని నిస్పృహలోకి నెట్టివేసి, ట్రంప్ బూచిని చూపి "నాకు తప్ప ఇంకెవరికి ఓటేస్తారు మీరు" అన్న నిర్లక్ష్యంతో గెలిచిపోతాననుకుంది హిల్లరీ. కానీ శ్రామిక జనాన్ని దూరం చేసుకున్న కారణంగా ట్రంప్ చేతిలో ఓడిపోయింది.

2020లో మళ్ళీ చరిత్ర పునరావృతమైంది. బెర్నీ మళ్ళీ నిలబడ్డాడు. ఈసారి బెర్నీ పేరూ, బెర్నీ శ్రామిక జన పక్షపాతమూ, జనానికి తెలిసి ఉండడం చేత రాష్ట్రం తరవాత రాష్ట్రం బెర్నీ గెలవడం మొదలుపెట్టాడు. దాంతో దడ పట్టుకున్న పార్టీ నాయకత్వం బైడెన్ తప్ప మిగతా అభ్యర్థుల్ని అందరినీ బరిలో నుంచి తొలగించి, ఒబామాకి నల్ల జాతీయులలో ఉన్న పలుకుబడిని ఉపయోగించి నల్ల జాతీయులు ఎక్కువగా ఉన్న దక్షిణ కరోలినా రాష్ట్రం బైడెన్ గెలుచుకొనేలా చేసి, బెర్నీ ఉప్పెనకి అడ్డుకట్ట వేశారు. బైడెన్ నామినేషన్ గెలిచేలా చేశారు. కానీ ఇన్ని నమ్మకద్రోహాల వల్ల శ్రామిక జనాలని శాశ్వతంగా దూరం చేసుకుంది డెమొక్రాటిక్ పార్టీ! కానీ ట్రంప్ దుష్పరిపాలనతో కూడా జనం విసిగిపోయి ఉండడం చేత చావు తప్పి కన్ను లొట్టబోయినట్టు, బొటాబొటీగా కేవలం 10–20 వేల ఓట్ల తేడాలతో 4–5 రాష్ట్రాలు గెలిచి మొత్తానికి అధ్యక్షుడు కావడానికి అవసరమైన ఎలెక్టోరల్ ఓట్లను బైడెన్ సంపాదించుకున్నాడు.

కమల హారిస్ కేవలం ట్రంప్ అవినీతి మీదా ట్రంప్ నేర చరిత్ర మీదా మాత్రమే దృష్టి సారించింది. "ట్రంప్ చెడ్డవాడు కాబట్టి నాకు ఓటు వేయండి" అన్న ఏకైక నినాదంతో గెలవాలని ప్రయత్నించింది. అసలు సామాన్య జనం సమస్యల్లో ఉన్నారనే మాటే ఎత్తకుండా ప్రచారం జరిపింది. "అంతా బాగానే ఉంది, నిరుద్యోగం అదుపులో ఉంది, స్టాక్ మార్కెట్లు పైపైకి వెళుతున్నాయి" –అన్న ధనికవర్గ అవగాహనతో ప్రచారం జరిపింది. ట్రంప్ దీన్ని తనకి అనుకూలంగా మార్చుకోవడంలో సఫలమయ్యాడు.



కానీ శ్రామిక జనాల పరిస్థితి ఏమీ మెరుగుపడలేదు. కోవిడ్ వ్యాధి వ్యాప్తి తగ్గాక ఆర్థిక వ్యవస్థ కొంత కోలుకున్నప్పటికీ, నిరుద్యోగం అదుపులో ఉన్నప్పటికీ, ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగిపోయింది. సామాన్య జనాల జీతాలు అంతగా పెరగక, ఎన్నో ఇక్కట్లు పడవలసి వచ్చింది. 2024లో డెమొక్రాటిక్ పార్టీ, ప్రైమరీని పేరుకి మాత్రమే నిర్వహించింది. ఎటువంటి డిబేట్లూ లేకుండా బైడెన్‌ని అభ్యర్థిగా ఎన్నుకుంది. ప్రైమరీ దశలో డిబేట్లు నిర్వహించి ఉంటే బైడెన్ మానసిక క్షీణత అప్పుడే బయటపడి ఉండేది. కొత్త అభిప్రాయాలతో జనానికి ఒక ఆశ కలిగించే అభ్యర్థి ఎవరైనా గెలిచి ఉండేవారు. ఆఖరికి ట్రంప్‌తో జూలైలో జరిగిన డిబేట్‌లో బైడెన్ మానసిక క్షీణత బయటపడింది. అప్పటికయినా 'ప్రజాస్వామికంగా' ఓపెన్ కన్వెన్షన్ నిర్వహిస్తే జనాన్ని ఉత్తేజపరచగలిగే అభ్యర్థిని ఎన్నుకుని ఉండొచ్చు. దానికి విరుద్ధంగా ప్రజల ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా నాలుగేళ్ల పాటు ఉపాధ్యక్షురాలిగా ఉండి కూడా ఎటువంటి ప్రజాదరణా లేని, తనకంటూ ఒక గుర్తింపునీ తెచ్చుకోలేని కమలా హారిస్‌ని అభ్యర్థిగా నియమించారు. అప్పటికైనా కమల కొత్త వాగ్దానాలతో ముందుకి వచ్చి ఉండవచ్చు. సామాన్య జనం ఎదుర్కొంటున్న సమస్యల్ని ఎలా పరిష్కరించగలనో అన్నది వివరించి ఉండవచ్చు. కమల అవేవీ చేయకుండా కేవలం ట్రంప్ అవినీతి మీదా ట్రంప్ నేర చరిత్ర మీదా మాత్రమే దృష్టి సారించింది. "ట్రంప్ చెడ్డవాడు కాబట్టి నాకు ఓటు వేయండి" అన్న ఏకైక నినాదంతో గెలవాలని ప్రయత్నించింది. అసలు సామాన్య జనం సమస్యల్లో ఉన్నారనే మాటే ఎత్తకుండా ప్రచారం జరిపింది. "అంతా బాగానే ఉంది, నిరుద్యోగం అదుపులో ఉంది, స్టాక్ మార్కెట్లు పైపైకి వెళుతున్నాయి" —అన్న ధనికవర్గ అవగాహనతో ప్రచారం జరిపింది. ఒక ఇంటర్వ్యూలో "బైడెన్ కంటే మీ ప్రభుత్వం ఎలా తేడాగా ఉంటుంది?" అన్న ప్రశ్నకి "ఏమీ తేడాగా ఉండదు" అని సమాధానం ఇచ్చింది.

ట్రంప్ దీన్ని తనకి అనుకూలంగా మార్చుకోవడంలో సఫలమయ్యాడు. ప్రజల కష్టాలన్నిటికీ, ధరలు పెరగడానికీ, జీతాలు పెరగకపోవడానికీ అక్రమ వలసదారులే కారణమనే భ్రమ కలిపించాడు. తనను గెలిపిస్తే 2 కోట్ల అక్రమ వలసదారుల్ని తిరిగి పంపించేస్తాననీ, దాని వల్ల ధరలూ నేరాలూ తగ్గిపోతాయనీ జనాల్ని భ్రమింపజేశాడు. చైనా దిగుమతుల మీద 60శాతం పన్ను విధిస్తాననీ, దాని ద్వారా ఇతర దేశాలకి తరలిపోయిన ఉద్యోగాలు వెనక్కి రప్పిస్తానని వాగ్దానాలు చేశాడు. గత 30 ఏళ్లుగా తమకు వెన్నుపోటు పొడిచిన డెమొక్రాటిక్ పార్టీతో విసిగిపోయిన జనంలో కొంత మంది ట్రంప్ మాయ మాటలకి బుట్టలో పడ్డారు. నిజానికి ట్రంప్ వాగ్దానాలు పొంతన లేనివి. దిగుమతి పన్నులు, ధరల్ని పెంచుతాయి గానీ, తగ్గించవు. అక్రమ వలస దారుల్ని బహిష్కరిస్తే అమెరికాలో వ్యవసాయం కుప్పకూలుతుంది. ధరలు ఇంకా పెరుగుతాయి.

డెమొక్రాటిక్ పార్టీ ఇప్పటికైనా సామాన్య జనానికి సహాయపడే ఎజెండాని చేపట్టకపోతే అమెరికా ఫాసిజం ఊబిలో ఇంకా లోతుగా కూరుకుపోతుంది. భారతదేశంలో గత పదేళ్లలో మత అసహనం ఎలా పెరిగిపోయిందో అలా అమెరికాలో శ్వేత జాత్యాహంకారం ఇంకా పెరిగిపోతుంది. ట్రంప్‌కి ఎలాగూ ప్రజల సమస్యల్ని తీర్చగలిగే ఆసక్తి గానీ, శక్తిగానీ లేవు. తన అసమర్థతని కప్పిపుచ్చుకోడానికి ట్రంప్ తన జిగ్రీ దోస్తు మోదీ ఎలా ద్వేష రాజకీయాల్ని పెంచి పోషించాడో అలాగే ద్వేషాన్ని ఎగదోస్తాడు. ఈ భ్రమల్లోనించీ జనం బయటపడడానికి రెండు మూడు దశాబ్దాలు పట్టవచ్చు.

◆ వి.ఎస్. రవి
(శాండియాగో, కాలిఫోర్నియా)



బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.0 కనిష్ఠం 22.4



సర్వే ఫారంపై సంతకం చేస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఐదు రోజులు.. 4.44 లక్షల కుటుంబాలు

- మెల్లగా సాగుతున్న సమగ్ర సర్వే
- 20వ తేదీ వరకు పూర్తవడం కష్టమే

హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా ఇప్పటివరకు ఎన్యూమరేటర్లు 4,44,275 కుటుంబాల వివరాలు సేకరించారు. ఒక్కో ఎన్యూమరేషన్ బ్లాకుల్లో (ఈబీ) రోజూ ఎనిమిది నుంచి పది ఇళ్ల వివరాలు తీసుకుంటున్నారు. కొన్ని ఈబీల్లో 10 నుంచి 15 కుటుంబాల సమాచారం సేకరిస్తున్న నేపథ్యంలో ఇతర ప్రాంతాల్లోనూ సర్వే ముమ్మరం చేయాలని అధికారులు ఆదేశించారు. సర్వే పూర్తయిన ఫారంలను సూపర్‌వైజర్లు పరిశీలించాలని సూచించారు. 29.58 లక్షల కుటుంబాలకుగాను..

మిగతా 8వ పేజీలో...



సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంత్యుత్సవాల సందర్భంగా తిరుమలగిరి కేంద్రీయ విద్యాలయంలో 'రాష్ట్రీయ ఏక్తా పర్వ్' పేరిట బుధవారం నిర్వహించిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

6



సిక్కుల మతగురువు గురునానక్ జయంతిని పురస్కరించుకొని గౌలిగూడ గురుద్వార నుంచి జాంబాగ్ వరకు భారీ కీర్తన్, శోభాయాత్ర నిర్వహించారు. సిక్కుల కత్తి విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

కొన్ని రైళ్లు రద్దు.. దారి మళ్లింపు

- గూడ్స్ రైలు పట్టాలు తప్పిన నేపథ్యంలో..

హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాఘవాపురం-రామగుండం మార్గంలో గూడ్సురైలు పట్టాలు తప్పిన కారణంగా దక్షిణమధ్య రైల్వే హైదరాబాద్ నుంచి ఢిల్లీ వైపు వెళ్లే పలు రైళ్లను దారిమళ్లించింది. ఆ మార్గంలో నడవాల్సిన కొన్ని రైళ్లను కూడా రద్దు చేసినట్లు సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. దానాపూర్-బెంగళూరు, నిజాముద్దీన్-హైదరాబాద్, దర్భంగా-మైసూరు, యశ్వంత్‌పూర్-ముజఫర్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను విజయవాడ మీదుగా మళ్లించారు. బెంగళూరు-నిజాముద్దీన్, త్రివేంద్రం-నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్‌లను సికింద్రాబాద్, నిజామాబాద్ మీదుగా దారి మళ్లించారు. మరోవైపు పట్నా నుంచి సికింద్రాబాద్ రావాల్సిన ప్రత్యేక రైలుకు నాగ్‌పూర్, సికింద్రాబాద్ స్టాపులను రద్దు చేశారు. గురువారం సికింద్రాబాద్- దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌తోపాటు కాచిగూడ-గుంతకల్, కాచిగూడ- రాయచూరు, గుంతకల్ -బోధన్ ప్రత్యేక రైళ్లు కూడా రద్దయినట్లు అధికారులు పేర్కొన్నారు

నిర్లక్ష్యానికి నిండుప్రాణం బలి

- రోడ్డు దాటుతున్న విద్యార్థినిని ఢీకొట్టిన బైక్
- తీవ్రగాయాలతో యువతి దుర్మరణం

దిల్‌సుఖ్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బైక్ అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ ఓ డిప్లొమా విద్యార్థిని నిండు ప్రాణాన్ని బలిగొంది. అప్పుడే ఇంట్లో బైబై చెప్పి కాలేజీకి వెళ్తున్న కూతురు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిందన్న వార్తను తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. సరూర్ నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూలు జిల్లా బల్మూరు మండలం పోలెపల్లికి చెందిన లోకేశ్ కుటుంబంతో కలిసి బతుకుదెరువు కోసం నగరానికి వలసొచ్చి కర్మన్‌ఘాట్ న్యూమారుతీనగర్‌లో నివాసముంటున్నారు. లోకేష్ మేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయన కుమార్తె త్రిష (20) నాదర్‌గుల్ మాతృశ్రీ ఇంజనీరింగ్ కాలేజీలో డిప్లొమా మూడో సంవత్సరం చదువుతోంది. బుధవారం ఉదయం కాలేజీకని బయల్దేరి మందమల్లమ్మ చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన బైక్ ఆమెను బలంగా ఢీకొట్టడంతో కారుపై పడింది. తీవ్రగాయాలపాలై రక్తస్రావం కావడంతో త్రిష ఘటనా స్థలంలోనే మృతి చెందింది.



త్రిష (ఫైల్)

తల్లిదండ్రులకు కడుపుకోత

ఇంట్లో నుంచి వెళ్లిన అరగంటలోపే కూతురు మృతి చెందిందన్న వార్త తెలిసి తల్లిదండ్రులు షాక్‌కు గురయ్యారు. చదువుల్లో రాణిస్తున్న కూతురు తమను విడిచి పోయిందని, గర్భశోకం మిగిల్చిందంటూ ఘటనా స్థలంలో రోదించడం స్థానికులను కంటతడి పెట్టించింది.

- ప్రధానంగా 10 విషయాల్లోనే నేరగాళ్ల వంచన
- ప్రజల అత్యాశను సొమ్ము చేసుకుంటున్న కేటుగాళ్లు
- మాయమాటలు.. బెదిరింపులతో సొమ్ము స్వాహా
- నిమిషాల్లో బ్యాంకు ఖాతాలను ఊడ్చేస్తున్న చీటర్లు
- వృద్ధులు, అమాయకులు, మహిళలే బాధితులు
- నగరంలో రోజుకు రూ.2 కోట్ల వరకు హాంఫట్

సైబర్ నేరగాళ్లు కేవలం చిన్న చిన్న ట్రిక్స్‌తో ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారు. ప్రధానంగా 10 రకాలుగా మోసం చేస్తూ కోట్లాది రూపాయలను కాజేస్తున్నారు. నేరగాళ్లు మోసం చేస్తున్న తీరు.. వారి వలలో పడకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..



సైబర్ మోసం.. జర పదిలం

హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజల అత్యాశ, అమాయకత్వం, భయం సైబర్ నేరగాళ్లకు కలిసివస్తున్నాయి. రోజుకో కొత్తరకం మోసంతో బోల్తా కొట్టించి లక్షలు, కోట్లాది రూపాయలను స్వాహా చేస్తున్నారు. మాటల్లో పెట్టి బ్యాంకు ఖాతాల్లో ఉన్నదంతా నిమిషాల్లో ఊడ్చేస్తున్నారు. అదంతా మోసమని తెలిశాక, వారు మోసపోయిన తీరు, సైబర్ క్రిమినల్స్ ఉపయోగించిన చిన్నపాటి ట్రిక్స్ తెలిసి.. అయ్యో అని ముక్కున వేలేసుకుంటున్నారు. ప్రస్తుతం టాప్-10లో ఉన్న సైబర్ ట్రెండింగ్ మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్‌క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. అపరిచిత వ్యక్తులకు బ్యాంకు వివరాలు, డెబిట్, క్రెడిట్‌కార్డు నంబర్లు, ఓటీపీలు చెప్పొద్దని సూచిస్తున్నారు. సైబర్ నేరగాళ్లు ఒక్క హైదరాబాద్‌లోనే రోజుకు సుమారు రూ. 2 కోట్లు కొల్లగొడుతున్నట్లు వెల్లడించారు.

మీ కుటుంబసభ్యులను అరెస్టు చేశాం

ఇతర ప్రాంతాల్లో ఉంటున్న కుటుంబసభ్యులను తీవ్రమైన నేరంలో అరెస్టు చేశామని, పై అధికారులతో మాట్లాడుకొని సెటిల్ చేసుకుంటే వదిలేస్తామని కొంతమంది ఆగంతకులు ఫోన్లు చేస్తున్నారు. ఇలా డబ్బులు వసూలు చేస్తున్న కేసులు ఇటీవల అనేకం వెలుగులోకి వస్తున్నాయి.

ఇదీ వాస్తవం

- ఈ విషయంలో అనవసరంగా ఆందోళన చెందొద్దు.
- ఒకసారి క్రాస్ చెక్ చేసుకొని, మనవాళ్లతో మాట్లాడాలి. అలా కాకుండా క్రిమినల్స్ భయపెట్టారనో, ఇబ్బంది పెడుతున్నారనో డబ్బులు పంపించొద్దు.

వర్క్‌ఫ్రమ్ హోమ్

వాట్సా్‌ప్‌లో వీడియోలు చూసి లైక్ చేయడం, హోటళ్లకు మంచి రివ్యూలు రాయడం చేస్తే డబ్బులిస్తామంటూ బురిడీ కొట్టిస్తున్నారు. ఒకటి రెండు వీడియోలకు డబ్బులివ్వడం, ఆ తర్వాత చిన్నచిన్న టాస్క్‌లు ఇచ్చి పూర్తి చేయగానే డబ్బులు ఇవ్వడం చేసి ఆకట్టుకుంటున్నారు.

ఇలా చేయొద్దు

- ఇలాంటి మోసాలపట్ల యువత, మహిళలు అప్రమత్తంగా ఉండాలి.
- వర్క్‌ఫ్రమ్ హోమ్ అనగానే అన్ని లింకులు ఓపెన్ చేసి పూర్తి వివరాలు నమోదు చేయొద్దు.

డిజిటల్ అరెస్టు పేరుతో

మీరు ఆర్థిక మోసాలకు పాల్పడ్డారని, మనీ ల్యాండరింగ్ కేసులో మీ ఖాతా వివరాలు, ఫోన్ నంబర్ ఉన్నట్లు తేలిందని కొంతమంది కేటుగాళ్లు సీబీఐ అధికారుల్లా వీడియో కాల్స్ చేసి బురిడీ కొట్టిస్తున్నారు. వినకపోతే వెంటనే డిజిటల్ అరెస్టు చేస్తున్నామని, ఇంటరాగేషన్ అయిపోయేంత వరకు కదలొద్దని ఆన్‌లైన్‌లోనే విచారించి భయభ్రాంతులకు గురిచేసి ఆ తర్వాత డబ్బులు కాజేస్తున్నారు.

డయల్ 1930

- సీబీఐ అధికారులు ఎప్పుడూ వీడియోకాల్ చేసి బెదిరించరు.
- డిజిటల్ అరెస్టు చేయడం, ఆన్‌లైన్‌లో ఇంటరాగేషన్ వంటివి చేయరని గమనించాలి.
- ఏదైనా అనుమానం వస్తే వెంటనే దగ్గరలోని పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలి. లేదా 1930కు ఫోన్ చేసి క్లారిఫై చేసుకోవాలి.

ఫోన్ బ్లాక్ చేస్తామని..

ట్రాయ్ అధికారులంటూ.. 'మీ ఫోన్ నంబర్‌ను వినియోగించి అనేక చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించారు. మీ ఫోన్ బ్లాక్ చేయమని ఆదేశాలు వచ్చాయి. ఒకసారి మీరు ముంబై సైబర్ క్రైమ్ విభాగం అధికారులతో మాట్లాడండి' అంటూ కాల్‌ను ఆ విభాగానికి బదిలీ చేస్తున్నట్లు నమ్మిస్తారు. అక్కడ మరో వ్యక్తి నిజమైన పోలీసులా మాట్లాడుతూ.. తన మాటలతో భయపెట్టి కేసు నుంచి బయటపడేలా చేస్తామని నమ్మించి డబ్బులు కొల్లగొడుతున్నారు. ఇటీవల ఎక్కువగా వెలుగులోకి వస్తున్న సైబర్ మోసాల్లో ఇదీ ఒకటి.

ఇవి గుర్తుంచుకోండి..

- * నిజానికి ట్రాయ్ అధికారులు ఎప్పుడూ వినియోగదారులకు ఫోన్ చేయరు.
- * ఒకవేళ మీ ఫోన్ బ్లాక్ చేయాలన్నా, ఏదైనా సమస్య ఉన్నా టెలీకం కంపెనీ ప్రతినిధులు నేరుగా సంప్రదిస్తారు.
- * నిజంగానే ఏదైనా సమస్య ఉంటే దగ్గరలోని సంబంధిత కంపెనీ కార్యాలయానికి వెళ్లి పూర్తిగా తెలుసుకోవాలి.
- * అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మి మోసపోవద్దు.

తక్కువ పెట్టుబడికి అధిక లాభాలు

అతితక్కువ పెట్టుబడి పెడితే అనతి కాలంలోనే 30-40 శాతం రిటర్న్స్ ఇస్తామని సోషల్ మీడియాలో కొంతమంది కేటుగాళ్లు ప్రచారం చేసుకుంటారు. అదంతా నిమజమని నమ్మిన వారు కాల్ చేయగానే వారిని ఒక వాట్సాప్ గ్రూపులో చేర్పిస్తున్నారు. ఆ తర్వాత ఎక్కువ మొత్తంలో లాభాలు పొందినట్లు చూపిస్తారు. తొలుత విత్‌డ్రా చేసుకునేందుకు అనుమతించి, ఆ తర్వాత క్లోజ్ చేస్తారు.

అత్యాశ చేటు

- తక్కువ పెట్టుబడులకు అధిక లాభాలు ఎవరూ ఇవ్వరు.
- అత్యాశ చేటు అని గుర్తించాలి. అపరిచిత వ్యక్తులు చెబితే పెట్టుబడి పెట్టొద్దు.
- అత్యాశకు ప్రలోభపెడుతున్నారంటే అది వందశాతం మోసమని గుర్తించాలి.

మరిన్ని మోసాలు 6వ పేజీలో..

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట వంచన 6

నిల్వచేసి.. వడ్డించి..

- హోటళ్లలో నాణ్యత లేని ఆహారం విక్రయం
- తందూరి చికెన్ నుంచి మటన్ ఫ్రై వరకు
- నల్లగా మారిన నూనె వినియోగం
- మేయర్ తనిఖీల్లో బట్టబయలు
- ఎఫ్ఎస్‌వోల పనితీరుపై అసంతృప్తి



హోటళ్లలో తనిఖీ చేస్తున్న మేయర్ విజయలక్ష్మి

హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రిఫ్రిజిరేటర్లలో నిల్వ ఉంచిన తందూరి చికెన్, మటన్ డీప్ ఫ్రై.. రా చికెన్.. నల్లగా మారిన నూనె.. అపరిశుభ్రంగా ఉన్న కిచెన్‌లలో దుర్వాసన.. కుళ్లిన కూరగాయలు.. పురుగులు పడ్డ సూప్ - ఇవీ మాసబ్‌ట్యాంక్‌లోని మొఘల్, డైన్‌హిల్ హోటళ్లలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, అదనపు కమిషనర్(హెల్త్) పంకజ నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో గుర్తించిన విషయాలు. అక్కడి పరిస్థితులను చూసి వారు విస్తుపోయారు. ఇలాంటి పదార్థాలను అందిస్తారా ? ప్రజారోగ్యమంటే లెక్కలేదా ? వండిన ఆహారాన్ని మరుసటి రోజు వేడి చేసి వడ్డించడమా..? ఆహార

మిగతా 6వ పేజీలో...

కుంగిన రోడ్డు

- నిజాంపేట అల్లాపూర్ సొసైటీ వద్ద 3 అడుగుల గుంత

6



కదలరు.. నడవరు

- తగ్గిన శారీరక శ్రమ
- పెరుగుతున్న మధుమేహ వ్యాధిగ్రస్తులు
- నేడు వరల్డ్ డయాబెటిస్ డే

8



ఐఏఎస్‌లు వర్సెస్ ఇంజనీర్లు

- బల్దియాలో ఆధిపత్య పోరు
- ఓ ఎస్ఈకి అదనపు కమిషనర్ షోకాజ్ నోటీస్
- అభ్యంతరం తెలిపిన ఇంజనీరింగ్ అధికారులు



హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీలో ఐఏఎస్‌లు, ఇంజనీర్ల మధ్య కోల్డ్ వార్ నడుస్తోంది. అదనపు, జోనల్ కమిషనర్లుగా ఉన్న కొందరు ఐఏఎస్‌లు, ఎగ్జిక్యూటివ్, సూపరింటెండెంట్ ఇంజనీర్ల మధ్య సఖ్యత కొరవడింది. రెండు కేడర్‌ల అధికారుల మధ్య ఆధిపత్య పోరు పౌర సేవలు, మౌలిక వసతుల కల్పనపై ప్రభావం చూపుతున్నాయి. తాజాగా ఓ అదనపు కమిషనర్.. సూపరింటెండెంట్ ఇంజనీర్‌కు షోకాజ్ నోటీస్ ఇవ్వడం సంస్థలో చర్చనీయాంశంగా మారింది. 'ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ఏర్పాటు విషయాన్ని పలుమార్లు గుర్తుచేసినా.. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండడం.. పనుల్లో పురోగతి లేకపోవడంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) కింద నిధులు రావడం లేదు' అని అదనపు కమిషనర్ షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు. ఎస్ఈకి షోకాజ్‌పై తెలంగాణ పబ్లిక్ హెల్త్ అండ్ మునిసిపల్ ఇంజనీర్ల సంఘం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇంజనీర్ల పనితీరుపై అసంతృప్తి ఉన్నా.. చర్యలు తీసుకోవాలన్నా చీఫ్ ఇంజనీర్‌కు సిఫారసు చేయాలని.. నేరుగా ఎలా మెమో జారీ చేస్తారని కమిషనర్ కార్యాలయంలో లేఖ అందజేసినట్టు తెలిసింది. ఇంజనీర్లపై చర్యలు, బదిలీ, పోస్టింగ్, సరెండర్, ఎఫ్ఏసీ అరెంజ్‌మెంట్ వంటి విషయాలను చీఫ్ ఇంజనీర్ ద్వారా కమిషనర్‌కు పంపాలని ఏప్రిల్ 26, 2021లో అప్పటి కమిషనర్ మెమో విడుదల చేశారు. ఈ మెమోను సవరిస్తూ ఎలాంటి ఉత్తర్వులు వెలువడలేదు. ఈ నేపథ్యంలో గత మెమో అములులో ఉందంటూ అదనపు కమిషనర్ షోకాజ్ ఇవ్వడం సబబు కాదన్నది ఇంజనీర్ల సంఘం వాదన. సంబంధిత

మిగతా 8వ పేజీలో...

ఎల్అండ్‌టీ మెట్రోకు రెండు పురస్కారాలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అత్యుత్తమ కమ్యూనికేషన్ సామర్థ్యాలను చూపినందుకు ఎల్అండ్‌టీ మెట్రోరైలుకు రెండు అత్యుత్తమ పురస్కారాలు లభించాయి. రవాణా రంగంలో ఉత్తమ కంటెంట్ మార్కెటింగ్ క్యాంపెయిన్‌కి బ్రాండ్ స్టోరీజ్ అవార్డు లభించగా, పబ్లిక్ రిలేషన్స్ ఆఫ్ ఇండియా (పీఆర్ఎస్ఐ) నుంచి ఉత్తమ ఇంటర్నల్ కమ్యూనికేషన్స్, ఉత్తమ సోషల్ మీడియా క్యాంపెయిన్‌కి పురస్కారాలు దక్కాయి. ఢిల్లీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాలను ఎల్అండ్‌టీ ఎండీ కేవీబీ రెడ్డి, సీసీవో మురళి వరదరాజన్ అందుకున్నారు. తమ బృందం శ్రమ, అంకితభావానికి ఈ పురస్కారాలు నిదర్శనమని వారు ఆనందం వ్యక్తం చేశారు.

ఆరుగురు క్రికెటర్లపై వేటు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్‌కు చెందిన ఆరుగురు అండర్-19 క్రికెటర్లపై రెండేళ్లపాటు వేటు వేసినట్లు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) సెక్రటరీ దేవ్‌రాజ్ వెల్లడించారు. హెచ్‌సీఏ టోర్నీల్లో తప్పుడు వయసు ధ్రువపత్రాలతో నిబంధనలను అతిక్రమించి ఆడినట్టు పోలీసుల విచారణలో తేలడంతో భవిష్యత్‌లో వీరు ఆడకుండా సస్పెన్షన్ విధించినట్లు పేర్కొన్నారు. పోలీసుల నివేదిక ఆధారంగా వీరిపై బీసీసీఐ చర్యలు తీసుకుందన్నారు. నిషేధం విధించిన వారిలో సాయిచంద్ర, ప్రేమ్, అనుదీప్, దివేశ్, ఆదిత్య, చిరాగ్ ఉన్నారు.

హైడ్రా రూటు మారింది..!

- కూల్చివేతలకు తాత్కాలిక విరామం
- చెరువులు, కుంటల పునరుద్ధరణకు చర్యలు
- రంగంలోకి దిగిన కమిషనర్ రంగనాథ్
- బతుకమ్మ, ఎర్రకుంట చెరువుల పనులు షురూ



బతుకమ్మకుంట వద్ద స్థానికులతో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్

హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలను చెరబట్టిన వారిపై కన్నెర్ర చేసిన హైడ్రా.. తాజాగా రూటు మార్చింది. ఆక్రమణల కూల్చివేతలకు తాత్కాలిక విరామం ఇస్తూ.. చెరువులు, కుంటల పునరుద్ధరణకు రంగంలో దిగింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బుధవారం అంబర్‌పేటలోని బతుకమ్మకుంట, తార్నాకలోని ఎర్ర చెరువును పరిశీలించారు. బతుకమ్మ కుంట పునరుద్ధరణ పనులను దగ్గరుండి మొదలుపెట్టించారు. పొక్లెయినర్లతో చెట్లు, మొక్కల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. ఆక్రమణలు పోను మిగిలిన 5.15 ఎకరాల చెరువు పునరుద్ధరణ, పార్కు అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. చెరువుల అధ్యయనం నిమిత్తం ఇటీవల బెంగళూరుకు వెళ్లి వచ్చిన అధికారులు.. వెంటనే చర్యలు ప్రారంభించారు.

ఎవరి ఇళ్లనూ కూల్చబోం

హైడ్రా అధికారులు వస్తున్నారన్న విషయం తెలిసి స్థానికులు పెద్దసంఖ్యలో గుమిగూడారు. కూల్చివేతలు జరుగుతాయన్న ప్రచారంతో పనులకు వెళ్లకుండా వేచిచూశారు. బతుకమ్మ కుంట, రామకృష్ణహట్స్ వాసులు తమ ఇళ్లను నేలమట్టం చేస్తారేమోనని ఆందోళన చెందారు. బతుకమ్మకుంట వద్దకు వచ్చిన కమిషనర్ రంగనాథ్ నేరుగా స్థానికులతో మాట్లాడారు. 'ఎవరి ఇళ్లు కూల్చం, ప్రస్తుతం ఉన్న చెరువును అభివృద్ధి చేస్తాం. శుభ్రపర్చి ఆహ్లాదకర వాతావరణం ఉండేలా తీర్చిదిద్దుతాం. ఫలితంగా మీ ఇళ్ల ధరలూ పెరుగుతాయి. ఆందోళన చెందవద్దు. తప్పుడు ప్రచారం నమ్మొద్దు' అని సూచించడంతో

మిగతా 6వ పేజీలో...

బక్కచిక్కిన బతుకమ్మ కుంట

చెరువు విస్తీర్ణం	14.06 ఎకరాలు
బఫర్‌జోన్‌తో కలిపితే..	16.13 ఎకరాలు
ఆక్రమణల తర్వాత ప్రస్తుతం ఉన్నది	5.15 ఎకరాలు

నిల్వచేసి.. వడ్డించి..

(5వ పేజీ తరువాయి)

పదార్థాలకు లేబుల్ లేకుండా నిల్వ చేస్తారా..? బ్యాక్టీరియా వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యానికి గురి కారా..? ఎందుకింత నిర్లక్ష్యమని మేయర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా హోటళ్లకు జరిమానా విధించాలని ఏఎంఓహెచ్‌లను పంకజ ఆదేశించారు. పరిస్థితి మారకపోతే సీజ్ చేస్తామని హెచ్చరించారు. రెండు హోటళ్లలో ప్రమాణాలు పాటించడం లేదని, వండిన ఆహార పదార్థాలు నిల్వ ఉంచినట్టు గుర్తించామని మేయర్ తెలిపారు.

చెప్పినా వినరా..?

అంతకుముందు జీహెచ్ఎంసీ కేంద్ర కార్యాలయంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల(ఎఫ్ఎస్ఓ)తో మేయర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కల్తీ ఆహార పదార్థాల నియంత్రణ, ఆహార భద్రత మెరుగుదలకు ఏం చేయాలన్న దానిపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎఫ్ఎస్ఓల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ఎవరికి వారుగా హోటళ్లకు వెళ్లకుండా. ఏఎంఓహెచ్, వెటర్నరీ, ఎఫ్ఎస్ఓలు కలిసి టీంగా తనిఖీలు నిర్వహించాలని గతంలో చెప్పాం.

అయినా మీరు పద్ధతి మార్చుకోలేదు. చర్యలు తీసుకోనప్పుడు తనిఖీలు నిర్వహించి ఏం లాభం. కలిసి పనిచేసేందుకు మీకున్న ఇబ్బందులేంటి' అని అన్నారు. గతంతో పోలిస్తే తనిఖీలు పెరిగినా.. మరింత విస్తృతంగా అందరూ కలిసి హోటళ్లు, రెస్టారెంట్లు, వీధి ఆహార విక్రయశాలలను పరిశీలించాలని, ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఆహార విక్రయ కేంద్రం నుంచి నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపాలని, ప్రమాణాల ప్రకారం లేకున్నా.. ప్రమాదకరమని తేలినా తదుపరి చర్యలకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

ఘనంగా గురునానక్ దేవ్‌జీ మహారాజ్ జయంతి



శోభాయాత్రలో సిక్కులు

అఫ్జల్‌గంజ్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సిక్కుల మత గురువు శ్రీగురునానక్ దేవ్‌జీ మహారాజ్ జయంతిని బుధవారం రాత్రి గురుద్వారా గురుసింగ్ సాహెబ్ ఆధ్వర్యం లో భారీకీర్తన్, శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్ర గౌలిగూడ సెంట్రల్ గురుద్వారా నుంచి ప్రారంభమై గౌలిగూడ చమన్, శంకర్ షేర్ హోటల్, అఫ్జల్‌గంజ్, సిద్దింబర్ బజార్, ఎంజే మార్కెట్‌చౌరస్తా, జాంబాగ్ మీదుగా గౌలిగూడ గురుద్వారాకు చేరుకుంది. శోభాయాత్రలో సిక్కుల మతగురువులు, మహిళలు పాల్గొని భక్తిగీతాలు, భజనలు నిర్వహించారు. సిక్కులు కర్ర, గట్కా, కత్తి విన్యాసాలు ప్రదర్శించారు. నిర్వాహకులు సత్విందర్‌సింగ్ బగ్గా, జోగేంద్రసింగ్, జైపాల్‌సింగ్ తేజ, సిక్కులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఏక్తా పర్వ్ దినోత్సవాలు



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు

తిరుమలగిరి నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి కేంద్రీయ విద్యాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి ఉత్సవాలని పురస్కరించుకొని మూడురోజులపాటు ఏర్పాటు చేసిన రాష్ట్రీయ ఏక్తా పర్వ్ వేడుకలు బుధవారం ముగిశాయి. 25 కేంద్రీయ విద్యాలయ సంఘటన్ పాఠశాల విద్యార్థులు వారి రాష్ట్రాల ప్రత్యేక సంస్కృతిక సంప్రదాయాలను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా బ్రిగేడియర్ ప్రశాంత్ అల్గేరి, డైరెక్టర్ ఎడ్యుకేషన్ టి.ప్రభుదాస్, జ్యోతి ప్రజ్వళన చేయగా, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ గౌరవ అతిథులకు స్వాగతం పలికారు. భిన్నత్వంలో ఏకత్వం చాటి చెప్పేలా విద్యార్థులు గ్రూప్ డ్యాన్స్ చేశారు. పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

వీడియో గేమింగ్ రంగంలో అపారమైన ఉద్యోగావకాశాలు

» కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు



మాట్లాడుతున్న సంజయ్ జాజు

హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వీడియో గేమింగ్ రంగంలో అపారమైన ఆర్థిక, ఉద్యోగావకాశాలు ఉన్నాయని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ కార్యదర్శి సంజయ్ జాజు పేర్కొన్నారు. ఈ నెల 13 నుంచి 15 వరకు మూడు రోజులపాటు హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్(హెచ్ఐసీసీ)లో ఇండియా గేమ్ డెవలపర్ సదస్సు నిర్వహిస్తున్నారు. బుధవారం సదస్సుకు హాజరైన సంజయ్ జాజు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వానికి వీడియో గేమింగ్, ఇంటరాక్టివ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండస్ట్రీ, రియల్ మనీ గేమింగ్ పరిశ్రమల మధ్య వైవిధ్యత పట్ల స్పష్టమైన అవగాహన ఉందన్నారు. వీడియో గేమింగ్ ఇండస్ట్రీకి విషయ పరిజ్ఞానం, సృజనాత్మకత నేతృత్వం వహిస్తుందని, భారతదేశంలో అత్యున్నత ప్రతిభావంతులను తీర్చిదిద్దడం కోసం గేమ్ డెవలపర్లతో తమ మంత్రిత్వశాఖ కలిసి పనిచేస్తుందన్నారు. అంతర్జాతీయ గేమింగ్ రంగంలో భారతదేశం ఆధిపత్యం చూపేందుకు తాము ప్రయత్నాలు చేస్తున్నామని, ఆ దిశగా వీడియో గేమింగ్ రంగంలో అపారమైన ఆర్థిక, ఉద్యోగావకాశాలను యువత ఒడిసిపట్టేందుకు వీలుగా శిక్షణ అందించేందుకు ఐఐసీటీ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీ)ని ముంబయిలో ఏర్పాటుచేస్తున్నట్లు ప్రకటించారు. దీని ప్రాంతీయ కార్యాలయం హైదరాబాద్‌లో కూడా ఏర్పాటుచేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు.

నిజాంపేటలో కుంగిన రోడ్డు



హోలిస్టిక్ ఆస్పత్రి వద్ద కుంగిన రోడ్డు

హైదర్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్‌లో ప్రధాన రోడ్డు స్వల్పంగా కుంగింది. బాచుపల్లి నుంచి కూకట్‌పల్లి జాతీయ రహదారి మార్గంలోని నిజాంపేట నుంచి జేఎన్టీయూకు వెళ్లే రోడ్డులో హోలిస్టిక్ ఆస్పత్రి వద్ద రోడ్డు కుంగి 3 అడుగుల లోతు గుంత ఏర్పడింది. గమనించిన స్థానికులు జీహెచ్ఎంసీ అధికారులకు సమాచారం ఇచ్చి, గుంత వద్ద బారికేడులు పెట్టారు. ఉదయం ఉద్యోగాలు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే సమయం కావడంతో భారీగా ట్రాఫిక్‌జాం ఏర్పడింది. ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి వాహనాలను దారి మళ్లించారు. సైబరాబాద్ అడిషనల్ ట్రాఫిక్ డీసీపీ వీరన్న, ట్రాఫిక్ ఏసీపీ వెంటయ్య, ఇన్‌స్పెక్టర్ జానయ్య, జీహెచ్ఎంసీ ఎస్ఈ చిన్నారెడ్డి, వాటర్‌వర్క్స్ జీఎం ప్రభాకర్‌రావు ప్రాంతాన్ని సందర్శించి పరిశీలించారు. కాగా తాగునీటి కోసం రోడ్డు మధ్యలో వేసిన పైపులైన్లు కాలం చెల్లడంతోనే కుంగిందని స్థానికులు చెబుతున్నారు. ఇదే రోడ్డులో మూడుచోట్ల పైపులైన్లు మార్చేందుకు ఇప్పటికే జీహెచ్ఎంసీ ప్రతిపాదనలు సిద్ధం చేయగా, అధికారుల నుంచి అనుమతులు వచ్చినట్లు జీహెచ్ఎంసీ అధికారులు చెబుతున్నారు. నిజాంపేట్‌రోడ్‌లో ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని డైవర్షన్ కోసం అధికారులు సైబరాబాద్ కమిషనరేట్‌ను అనుమతి కోరినట్లు సమాచారం. అనుమతి వచ్చాక మిగతా చోట్లా పైపులైన్లను మార్చనున్నట్లు జీహెచ్ఎంసీ అధికారులు చెబుతున్నారు.

సైబర్ మోసం.. జర పదిలం

(5వ పేజీ తరువాయి)

సైబర్ నేరగాళ్లు కస్టమ్స్ అధికారులమని.. మీ పేరుతో డ్రగ్స్ పార్సిల్ దొరికిందని, మీ అడ్రస్‌తో విదేశాలకు వెళ్తుండగా కస్టమ్స్‌లో పట్టుకున్నామని కస్టమ్స్ ఆఫీసర్‌లా ఫోన్ చేసి, కేసులు, జైలు అంటూ బెదిరిస్తారు. లేదంటే పైఅధికారులతో మాట్లాడుకొని సెటిల్ చేసుకోవాలని సూచిస్తారు.

రెస్పాండ్ కావొద్దు

- డ్రగ్స్ పార్సిల్ దొరికిందంటూ ఫోన్ వస్తే స్పందించొద్దు. పదే పదే ఫోన్ చేస్తే నంబర్ బ్లాక్ చేయాలి.
- ఇప్పుడే పోలీస్‌స్టేషన్‌కు వెళ్తున్నానని అవతలి వ్యక్తిని బెదిరించాలి. వెంటనే 1930 లేదా 100 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి. మైండ్ డైవర్టు కావొద్దు.

క్రెడిట్‌కార్డుల కథ

క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని కొందరు.. ఆన్‌లైన్‌లో కొత్త క్రెడిట్‌కార్డు ఇస్తామని బోల్తా కొట్టిస్తున్నారు. కార్డు నంబర్, సీవీవీ, ఎక్స్‌పయిరీ డేట్ తెలుసుకుంటున్నారు. ఓటీపీ చెప్పగానే కార్డులోని లిమిట్ అంతా కాజేస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌చేసి క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామంటే నమ్మొద్దు.

కేవైసీ అప్‌డేట్

మీ ఖాతా లేదా డెబిట్‌కార్డును 24 గంటల్లో బ్లాక్ చేస్తున్నామని, మీ కేవైసీ అప్‌డేట్ చేయలేదని, వెంటనే వివరాలు అప్‌డేట్ చేసుకోవాలని బల్క్ మెసేజ్‌లు పంపుతున్నారు. అదంతా నిజమని నమ్మిన కస్టమర్స్ ఫోన్ చేయగానే ఖాతా వివరాలు, డెబిట్‌కార్డు వివరాలు తెలుసుకొని ఖాతాలోని డబ్బులు కొల్లగొడుతున్నారు. కేవైసీ అప్‌డేట్ కోసం బ్యాంకు అధికారులు ఎప్పుడూ ఫోన్ చేయరని గుర్తుంచుకోండి.

కావాలని డబ్బులు పంపించి..

కావాలని మన బ్యాంకు ఖాతాకు డబ్బులు పంపుతున్న మోసగాళ్లు.. ఆ తర్వాత ఫోన్ చేసి పొరపాటున వేరే ఖాతాకు వెళ్లాల్సిన డబ్బులు మీ ఖాతాకు బదిలీ చేశాము. దయచేసి రిటర్న్ చేయండంటూ క్యూఆర్ కోడ్ పంపిస్తున్నారు. అయ్యో పాపమని దాన్ని స్కాన్ చేయగానే ఫోన్‌ను హ్యాక్ చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో బాధితుడు నగదు బదిలీ చేస్తున్నప్పుడు అన్ని వివరాలు క్యాప్చర్ చేసి ఖాతాలో ఉన్న డబ్బంతా దోచేస్తున్నారు.

ట్యాక్స్ రీఫండ్

ఇన్‌కమ్ ట్యాక్స్ రెగ్యులర్‌గా చెల్లించేవారికి కొంత రీఫండ్ ఇచ్చేలా స్కీములున్నాయి. ట్యాక్స్ పేయర్స్‌కు ఇన్‌కమ్ ట్యాక్స్ నుంచి వచ్చినట్లుగా కేటుగాళ్లు కొన్ని లింకులు పంపుతున్నారు. మీరు ట్యాక్స్ రీఫండ్ కోసం అప్లై చేసుకోండి మీకు రీఫండ్ వస్తుందని అందులో ఉంటుంది. లింకులు ఓపెన్ చేసిన తర్వాత అందులో బ్యాంకు డిటెయిల్స్ నమోదు చేయగానే సైబర్ క్రిమినల్స్ ఖాతా వివరాలు తెలుసుకొని, ఖాతాలో డబ్బంతా ఊడ్చేస్తున్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ అలాంటి లింకులను క్లిక్‌చేయకండి.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట వంచన

యూసుఫ్‌గూడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెడితే ప్రతినెలా 10శాతం ఆదాయం, ఎప్పుడంటే అప్పుడు నగదు తీసుకోవచ్చని చెప్పి ఓ వ్యక్తి కుచ్చుటోపీ పెట్టాడు. షేక్‌పేట ప్రాంతానికి చెందిన దుర్గాప్రసాద్‌కు షేర్‌మార్కెట్‌పై ఆసక్తి ఉండటంతో అమీర్‌పేటలోని రాఘవేంద్ర ట్రేడింగ్ అకాడమీలో ఆన్‌లైన్ కోర్సు చేశారు. దుర్గాప్రసాద్ ఆసక్తిని గమనించిన అకాడమీ నిర్వాహకుడు రాఘవేంద్ర తనకు చెందిన ధన్ ట్రేడింగ్ సంస్థలో పెట్టుబడి పెట్టాలని కోరాడు. ఇందుకు 10శాతం ఆదాయంతోపాటు ఎప్పుడంటే అప్పుడు రిటర్న్ ఇస్తానని నమ్మించాడు. దీంతో దుర్గాప్రసాద్, ఆయన సోదరుడు కలిసి రూ.12.50లక్షలు పెట్టుబడి పెట్టారు. తర్వాత ఆదాయం రాకపోగా.. లాగిన్, ఫోన్ నంబరు మార్చేశాడు. అదిగో ఇదిగో అంటూ తప్పించుకు తిరుగుతుండడంతో బాధితులు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నౌహీరా ఆస్తుల వేలం

హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): హీరా గ్రూప్ సంస్థల అధినేత్రి నౌహీరా షేక్‌కు సంబంధించిన ఆస్తులను వేలం వేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సిద్ధమైంది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు నౌహీరా ఆస్తులు వేలం వేసి బాధితులకు(డిపాజిటర్లు) తిరిగి చెల్లింపులు చేయనున్నట్లు ఈడీ అధికారులు తెలిపారు. పెట్టుబడులకు 36% వడ్డీ పేరుతో లక్షలాది మంది నుంచి వేల కోట్లు వసూలు చేసినట్లు నౌహీరాపై తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా కేసులు నమోదయ్యాయి. మనీ లాండరింగ్ కోణంలో విచారణ జరిపిన ఈడీ ఆమెను అరెస్ట్ చేసింది. బాధితులకు తిరిగి చెల్లింపులు చేసేందుకు స్థిరాస్తుల వేలానికి అనుమతించాలని సుప్రీం కోర్టును అభ్యర్థించింది. విచారణ అనంతరం న్యాయస్థానం అనుమతించడంతో నౌహీరా షేక్‌కు చెందిన రెండు భవనాలు వేలం వేసేందుకు నిర్ణయించినట్లు ఈడీ అధికారులు తెలిపారు. త్వరలో రూ. 25 కోట్లు బాధితులకు తిరిగి చెల్లించనున్నట్లు వెల్లడించారు.

వెయిటింగ్‌లో ఉన్న 16 మంది ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో వెయిటింగ్‌లో ఉన్న 16 మంది ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగులిస్తూ నగరపోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇమ్మాన్యుల్ (డీఐ సుల్తాన్‌బజార్), ఎస్.సైదులు (డీఐ హబీబ్‌నగర్), ఎం.వెంకటశివరావు (డీఐ తిరుమలగిరి), ఎస్.మల్లేష్ (డీఐ నాంపల్లి), సీహెచ్.సరేష్‌బాబు (డీఐ కాచిగూడ), ఈదుల శేఖర్ (డీఐ చిక్కడపల్లి), ఎస్.సైదా బాబు (డీఐ కుల్సుంపురా), ఎస్‌కే.జాకీర్ హుస్సేన్ (డీఐ ఫలక్‌నుమా), పి.జయశంకర్ (డీఐ గాంధీనగర్), రౌత్‌గోపి (డీఐ రాంగోపాల్ పేట), ఎం.వెంకటరామయ్య (సీసీఎస్‌డీడీ), హెచ్ .ధీరావత్ (సీసీఎస్‌డీడీ), కె.రవికుమార్ (సీసీఎస్‌డీడీ), పి.వెంకటగిరి, జి.సత్యం, ఎ.పురేందర్‌రెడ్డిలను (ఎస్‌బీ హైదరాబాద్)లకు పోస్టింగు ఇచ్చారు.

హైడ్రా రూటు మారింది

(5వ పేజీ తరువాయి)

ఊపిరిపీల్చుకొని చెరువు పునరుద్ధరణకు సహకరిస్తామన్నారు.

తార్నాకలో...

తార్నాకలోని ఎర్రకుంట చెరువును కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. స్థానిక నాగార్జున సొసైటీ సభ్యుల విజ్ఞప్తి మేరకు అక్కడికి వెళ్లిన ఆయన చెరువు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. 5.9 ఎకరాల్లో ఉన్న చెరువులో నీటి నిల్వ సామర్థ్యం పెంచడంతోపాటు.. బండ్, వాకింగ్ ట్రాక్ వంటివి నిర్మించనున్నారు. ప్రస్తుతమున్న దోమల బెడద కూడా తగ్గుతుందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

రోడ్డుపై ప్రహరీ.. కూల్చిన హైడ్రా

నాగారం మునిసిపల్ చైర్మన్‌పై స్థానికుల ఫిర్యాదు

రోడ్డును ఆక్రమించి నగర శివారులోని నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి నిర్మించిన ప్రహరీని హైడ్రా సిబ్బంది బుధవారం కూల్చివేశాయి. కీసర మండలం నాగారంలోని సర్వేనంబర్ 146లో 40 అడుగుల రోడ్డును ఆక్రమించారన్న స్థానికుల ఫిర్యాదుతో విచారణ చేపట్టిన అధికారులు రంగంలోకి దిగారు. నాగారం మెయిన్ రోడ్డుకు కాలనీల నుంచి నేరుగా వెళ్లేందుకు ఉన్న మార్గాన్ని చైర్మన్ ఆక్రమించి ప్రహరీ నిర్మించారు. స్థానిక మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా చైర్మన్ ఒత్తిడితో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో కాలనీవాసులు హైడ్రాను ఆశ్రయించారు. ప్రహరీ కూల్చిన అనంతరం వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని మునిసిపల్ కమిషనర్‌కు సూచించారు.



మంత్రి దామోదర రాజనర్సింహను కలిసిన ప్రభుత్వ వైద్యులు

ప్రభుత్వ వైద్యుల సమస్యలను పరిష్కరించండి

మంగళ్‌హాట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను బుధవారం తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నరహరి, సెక్రెటరీ జనరల్ డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్ ఆధ్వర్యంలో వైద్యులు కలిశారు. మంత్రికి తమ సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. డాక్టర్ల ప్రధాన సమస్యలైన 142 జీఓ రద్దు, పీజీ చేసిన వారి సరెండర్స్, రెగ్యులర్ ప్రమోషన్స్, సుదూర ప్రాంతాలలో పనిచేస్తున్న వైద్యులకు అలవెన్సు, డీహెచ్ పరిధిలో పనిచేస్తున్న వైద్యులకు టైం బాండ్ ప్రమోషన్స్ తదితర డిమాండ్లపై మంత్రితో చర్చించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి రాజనర్సింహ సాధ్యమైనంత త్వరగా వైద్యుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



మహారాష్ట్రలోని చిల్కి నియోజకవర్గంలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నేత యూసుఫ్ ఖాద్రి తదితరులు

మహారాష్ట్రలో మహేశ్వరం కాంగ్రెస్ నేతల ప్రచారం

పహాడిషరీఫ్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ తరహా అభివృద్ధి కావాలంటే మహారాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని పార్టీ మహేశ్వరం నియోజకవర్గం మైనారిటీ సెల్ చైర్మన్ యూసుఫ్ ఖాద్రి అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్.. యూసుఫ్ ఖాద్రిని మహారాష్ట్రలోని చిల్కి నియోజకవర్గం పార్టీ పరిశీలకుడిగా నియమించడంతో బుధవారం ఆయన ఆ నియోజకవర్గంలోని ముసింలు నివాసం ఉండే బస్తీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో అర్షద్ అహ్మద్, హంజా, జహారుల్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.



కర్ణాటకలో ఫిష్ స్టాల్‌ను పరిశీలిస్తున్న మెట్టు సాయికుమార్, అధికారులు

కర్ణాటకలో పర్యటించిన మెట్టు సాయికుమార్ బృందం

అఫ్జల్‌గంజ్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేటర్ చైర్మన్ మెట్టు సాయికుమార్, మత్స్యశాఖ అధికారుల బృందంతో కలిసి బుధవారం కర్ణాటక వెళ్లారు. ఆ రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మాల నారాయణ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫిష్‌స్టాల్‌ను మెట్టు సాయికుమార్ బృందం పరిశీలించింది. ఫిష్‌స్టాల్ నిర్మాణానికి మత్స్యశాఖ ఇచ్చే రాయితీ గురించి అడిగి తెలుసుకున్నారు. మత్స్యకారుల అభివృద్ధి కోసం కర్ణాటకలో అమలు చేస్తున్న ప్రతి విధానం తెలంగాణలో అమలు చేయడం తో పాటు ఫిష్‌స్టాల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర మత్స్యశాఖ అధికారులను మెట్టు సాయికుమార్ ఆదేశించారు.



ఇంటర్మీడియేట్ విద్యామండలి డైరెక్టర్ కృష్ణ ఆదిత్యను అభినందిస్తున్న ఉద్యోగులు

ఇంటర్ విద్యామండలి డైరెక్టర్‌ను కలిసిన ఉద్యోగులు

అఫ్జల్‌గంజ్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియేట్ విద్యామండలి డైరెక్టర్‌గా కృష్ణ ఆదిత్య ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బుధవారం నాంపల్లిలోని విద్యామండలి కార్యాలయంలో ఆయన ను తెలంగాణ ఇంటర్మీడియేట్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల లైబ్రేరియన్స్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు డాక్టర్ ఆర్ మంజునాయక్, స్రవంతి, జ్యోతి, ఎండీ గులాబ్ జహంగీర్, ముత్తి ఉర్‌రహ్మాన్, షానాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ గోల్ఫ్‌లో అగ్రస్థానంలో చార్జర్స్



పోటీల్లో పాల్గొన్న గోల్ఫర్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): శ్రీనిధి తెలంగాణ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్‌లో ఆటం చార్జర్స్ జట్టు అగ్రస్థానంలో కొనసాగుతోంది. బుధవారం గోల్కొండలోని హైదరాబాద్ గోల్ఫ్ కోర్సులో నాలుగో రౌండ్ ముగిసేసరికి చార్జర్స్ టీమ్ 699తో పాయింట్లతో టాప్‌లో నిలిచింది. దాసోస్ జట్టు 675 పాయింట్లతో ద్వితీయ స్థానంలో ఉంది. నాలుగో రౌండ్‌లో ఉత్తమ లాంగెస్ట్ డ్రైవ్ అవార్డు అనిల్ సురవరం, స్ట్రయిట్ డ్రైవ్ అవార్డు జగన్ మోహన్ రెడ్డికి లభించాయి.

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

● నిజాం కళాశాల స్నాతకోత్సవంలో హెచ్‌సీయూ వీసీ బీజే రావు



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న అతిథులు

రవీంద్రభారతి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నైపుణ్యాలను కలిగినప్పుడే అవకాశాలను అందుకోగలరని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బాసుత్కర్ జగదీశ్వర్ రావు అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో నిజాం కాలేజీ స్నాతకోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన విద్యార్థులకు డిగ్రీ పట్టాలు, గోల్డ్‌మెడల్స్ ప్రదానం చేసి మాట్లాడారు. అవకాశాలను అందిపుచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యను అందించిన విద్యాసంస్థలను, తమ ప్రాంతాన్ని, తల్లిదండ్రులను మర్చిపోవద్దన్నారు. విశిష్ట అతిథి ఉస్మానియా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ మొలుగారం కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులే భావి భారత నాయకులని, దేశాభివృద్ధికి కృషి చేయాలన్నారు. వివిధ రంగాల్లో నిజాం కాలేజీ పాత్ర చెప్పుకోదగినదన్నారు. నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బీమా మాట్లాడుతూ.. మారుతున్న కాలానుగుణంగా వివిధ కోర్సులను ప్రవేశపెడుతూ విద్యార్థులకు ఉత్తమమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. కళాశాల ప్రగతి నివేదికను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా వివిధ కోర్సుల్లో మెరిట్ సాధించిన 49మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, 520 మందికి డిగ్రీ పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో ఓయూ ఎగ్జామ్స్ కంట్రోలర్ డా.చాంద్‌పాషా, వైస్ ప్రిన్సిపాల్ జి.ఉపేందర్, డా.పసునూతి మనోహర్, డా.ఆవుల ఏడుకొండలుతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు

చాంద్రాయణగుట్ట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గౌలిపురా లలితాబాగ్ రోడ్‌లో గల ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినుల కు బుధవారం హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం హరిబౌలిలోని సూరజ్‌భాన్ మెటర్నరీ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హనీష్ విద్యార్థినులకు ఆరోగ్య సూత్రాలు తెలియజేశారు. అనారోగ్యానికి గురైనప్పుడు నేరుగా మెడికల్ షాపునకు వెళ్లి మాత్రలు కొనకుండా వైద్యు డిని సంప్రదించి తగిన చికిత్స చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హరినారాయణ, ఉపాధ్యాయులు ఎస్.విజయ భాస్కర్, శ్రీదేవి, మంజుల, ప్రమీళ, నవనీత, శివప్రసాద్, కార్యాలయ సిబ్బంది అనిల్‌కుమార్, సుదేష్ణ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం

చాంద్రాయణగుట్ట, నవం బరు 13 (ఆంధ్రజ్యోతి) : పాతబస్తీ బేలా కాలనీలో శ్రీనివాస కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సలహాదారు రాకేశ్ అగిహోత్రి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి బిర్లా మందిర్ వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య తిరుమలను తలపించే ఆధ్యాత్మిక వాతావరణంలో వెంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. అనంతరం బేలా కాలనీ పరిసరాల్లో స్వామి వారి పల్లకి సేవ నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.



గుమ్మడి గోపాలకృష్ణను సత్కరిస్తున్న అతిథులు

గుమ్మడి గోపాలకృష్ణకు ఏఆర్ కృష్ణ, దుగ్గిరాల పురస్కారం ప్రదానం

రవీంద్రభారతి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రంగస్థల నటుడు, కళారత్న గుమ్మడి గోపాలకృష్ణకు ఏఆర్ కృష్ణ, దుగ్గిరాల పురస్కారం ప్రదానం చేశారు. బుధవారం తెలుగు వర్సిటీలోని ఆడిటోరియంలో పద్మభూషణ్ ఏఆర్ కృష్ణ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆయన జయంతి వేడుకలను నిర్వహించారు ముఖ్యఅతిథిగా హాజరైన రిటైర్డ్ ఐఏఎస్ డా.కేవీ రమణాచారి చేతుల మీదుగా గుమ్మ డి గోపాలకృష్ణకు ఏఆర్ కృష్ణ, దుగ్గిరాల పురస్కారాన్ని అందజేసి సత్కరించారు. అనంతరం రమణాచారి మాట్లాడుతూ, తెలుగు నాటక రంగానికి ఎనలేని సేవలందించిన ఏఆర్ కృష్ణ, దుగ్గిరాల పేరిట పురస్కారాన్ని అందజేయడం అభినందనీయమన్నారు. తెలుగు రంగస్థల నటుడిగా గుమ్మడి చేసిన సేవలను గుర్తించి పురస్కారం ప్రదానం చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్ధన్, డా.ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, డా.డీఎస్ఎన్‌మూర్తి, భగీరథ, బిక్కి కృష్ణ, తడకమళ్ల రామచంద్రరావు, ఆకుల సదానందం, మహ్మద్ రఫీ, దుగ్గిరాల గౌరీ పతిశాస్త్రి, సతీషబాబు, ఏపీ నీలం తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ కలయిక

రాజేంద్రనగర్, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి): హిమాయత్ సాగర్‌లోని వాటర్ అండ్ ల్యాండ్ మేనేజ్‌మెంట్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (వాలంతరీ)లో 1989 నుంచి 2024 వరకు వివిధ హోదాలలో పనిచేసిన ఉద్యోగులు బుధవారం అత్తాపూర్‌లో ఓ వేదిక వద్ద కలుసుకున్నారు. వాలంతరీలో ఉద్యోగం చేసే వి.అమ్మన్నబాబు కూతురి వివాహ వేడుకల్లో కలుసుకున్న వీరంతా ఒకరినొకరు ఎంతో ఆప్యాయంగా పలకరించుకున్నారు. వీరిలో చాలా మంది ఉద్యోగ విరమణ పొందారు. మానవ విలువలు ముఖ్యమని చాటిచెప్పిన వీరిని చూసి పెళ్లికి వచ్చినవారు ఎంతో సంతోషించారు.

మారుతి సుజుకి 'న్యూ ఆల్ డిజైర్' కారు విడుదల



'ది ఆల్ న్యూ డిజైర్' కారును ఆవిష్కరించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, చిత్రంలో వరుణ్‌మోటార్స్ జీఎం కృష్ణ, ఏజీఎం ఆంజనేయులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మారుతి సుజుకీ సరికొత్త డిజైర్ కారును విడుదల చేసింది. మారుతి సుజుకీ కంపెనీకి నగరంలో ప్రముఖ డీలర్ అయిన వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ 'ది ఆల్ న్యూ డిజైర్ తొలికారును రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ బుధవారం ఆవిష్కరించారు. నానక్‌రాంగూడలో జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో వరుణ్‌మోటార్స్ జీఎం కృష్ణ, ఏజీఎం ఆంజనేయు లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ, సెడాన్ విభాగంలో న్యూడిజైర్ మోడల్ దేశంలోనే అత్యధికంగా అమ్ముడవుతున్న కారుగా అభివర్ణించారు. న్యూ డిజైర్ స్టైలింగ్, పనితీరు, ఫీచర్లు, భద్రత వంటి లక్షణాలతో శాశ్వత వారసత్వాన్ని కొనసాగిస్తోందన్నారు న్యూ డిజైర్ లీటర్ పెట్రోల్‌తో 24.79 కిలోమీటర్లు ప్రయాణించవచ్చన్నారు. ఈ కారు ఎక్స్ షోరూమ్ ధర రూ. 6.79లక్షల నుంచి ప్రారంభమవుతుందన్నారు.

సిద్దేశ్వరి ఆత్మహత్యకు భర్త, అత్తమామల వేధింపులే కారణం

● పోలీసులకు తల్లిదండ్రుల ఫిర్యాదు

రాజేంద్రనగర్,నవంబరు13(ఆంధ్రజ్యోతి) : తన కూతురు సిద్దేశ్వరి (20) ఆత్మహత్యకు భర్త, అత్తమామలు, ఆడపడుచు, ఆమె భర్త వేధింపులే కారణమని సిద్దేశ్వరి తండ్రి సంగనాథ్ అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు సిద్దేశ్వరి భర్త ప్రవీణ్, అత్తమామలు జయశ్రీ, శివరాజ్, ఆడపడుచు ప్రియ, ఆమె భర్త బస్వరాజ్‌లపై కేసు నమోదు చేశారు. బుధవారం సాయంత్రం ఇంట్లో ఒంటరిగా ఉన్న ప్రవీణ్ భార్య సిద్దేశ్వరి భర్తతో ఫోన్‌లో మాట్లాడిన అనంతరం చున్నీతో ఇంటి గ్రిల్స్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. కూతురు మరణవా ర్త గురించి తెలుసుకున్న కామారెడ్డి మద్నూర్‌కు చెందిన సంగనాథ్‌తో పాటు వారి బంధువులు రాంబాగ్‌కు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశా రు. ఏడు నెలల క్రితం తన కూతురు సిద్దేశ్వరి తో ప్రవీణ్‌కు వివాహం జరిపించామని, ఆ సమయంలో రూ. 5 లక్షలు, ఐదు తులాల బంగారం కట్నంగా ఇచ్చామన్నారు. పెళ్లయిన నాటి నుంచి మరో రూ. 5లక్షలు తీసుకురమ్మని తమ కూతురును వేధిస్తున్నారన్నారు. అందుకే తన కూతురు ఆత్మహత్య చేసుకుని ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్న అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ టి.వెంకట్రామిరెడ్డి దర్యాప్తు చేస్తున్నారు

ఆన్‌లైన్ చెస్‌కు రూ.2 కోట్ల ప్రైజ్‌మనీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): దేశంలో నైపుణ్య ఆధారిత మేధో క్రీడలను ప్రోత్సహించడానికి ఆన్‌లైన్ పోటీలకు శ్రీకారం చుట్టామని స్కిల్‌హబ్ ఆన్‌లైన్ గేమ్స్ (ఎస్‌ఓజీ) ఫెడరేషన్ తెలిపింది. నగరంలోని ఒక హోటల్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఎస్‌ఓజీ ఫెడరేషన్ అధ్యక్షుడు శంకర్ అగర్వాల్ మా ట్లాడుతూ వచ్చే నెలలో ఇండియన్ చెస్ మాస్టర్స్, ఇండియన్ చెస్ మాస్టర్స్ ఫర్ బ్లైండ్ అనే రెండే మేధో క్రీడలను ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నామని చెప్పారు. ఈ పోటీల్లో విజేతలకు రూ.2 కోట్ల నగదు బహుమతి దక్కనుందని తెలిపారు. వచ్చే నెల 18వ తేదీన క్వాలిఫయర్ పోటీలు ప్రారంభమవుతాయన్నారు. అక్కడి నుంచి జోనల్ స్థాయి, ఆతర్వాత మార్చిలో మెగా ఫైనల్ జరగనుందని తెలిపారు.

'ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టడం వారికే చెల్లింది'

పహాడిషరీఫ్ నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టి, ప్రజలను రెచ్చగొట్టడం కేటీఆర్, హరీశ్‌రావులకే చెల్లిందని మామిడిపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, లాల్ సతీష్ గౌడ్, కళ్లెం నరేష్ గౌడ్‌లు బుధవారం ప్రకట నలో ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి తన సొంత నియోజకవర్గం కొడంగల్ ను అన్ని నియోజకవర్గాలకు దీటుగా అభివృద్ధి చేయాలన్న తలంపుతో పరిశ్రమలను ఏర్పాటు చేసి, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో కాలుష్య రహిత ఫార్మా సిటీ ఏర్పాటు కోసం రైతుల అభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్, అధికారులపై జరిగిన దాడికి సమర్థించేలా బీఆర్ఎస్ అగ్రనాయకులు కేటీఆర్, హరీశ్‌రావులు మాట్లాడడం సిగ్గు చేటన్నారు. కొడంగల్ రైతులను పచ్చటి పొలాల నుంచి వెళ్లగొడుతన్నారంటూ చేస్తున్న ఆరోపణలు సహించరానివన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/sG1tNmG లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.



ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీకి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

శివాలయానికి దారి వదలండి

రాజేంద్రనగర్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీని ఆనుకున్న ఉన్న శివాలయంలో పూజలు చేసుకోవడానికి దారి వదలాలని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డికి బీజేపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వై.శ్రీధర్ జి.బాబూరావు, రంగ రజనీకాంత్, ఈ.శ్రీనివాస్‌లు రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ కళాశాలలో వీసీని కలిసి వినతి పత్రం అందజేశారు. పాలకమండలి సమావేశంలో మాట్లాడి తమ నిర్ణయం ప్రకటిస్తామని వీసీ రాజిరెడ్డి చెప్పారని బీజేపీ నాయకులు తెలిపారు.



ఉద్యాన యూనివర్సిటీ వీసీని కలిసిన బోధనేతర సిబ్బంది

బోధనేతర సిబ్బంది సమస్యలను పరిష్కరించండి

రాజేంద్రనగర్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న బోధనేతర, టైం స్కేల్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని బుధవారం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డిని కలిసి వినతి పత్రాలు అందజేశారు. వర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పోతురాజు యాదయ్య ప్రధాన కార్యదర్శి ఎ.చెంచు రామయ్యల ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు వీసీని కలిశారు. అనంతరం వీసీని అసోసియేషన్ తరఫున సత్కరించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు టి.కుమార్, ఎం.రజనీకాంత్, రత్నం, దీపారాణి, వంశీకృష్ణ, తులసీరాణి, యుగంధర్, వెంకటేశ్, విజయ్, కురుమూర్తి, వెంకటస్వామి, బెంజిమెన్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసిన క్రైస్తవ సంఘాల ప్రతినిధులు

క్రైస్తవ కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించాలి

రాజేంద్రనగర్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని క్రైస్తవ సంఘాలకు కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని, డిసెంబరు మాసంలో జరిగే క్రిస్మస్ వేడుకలకు సహకరించాలని బుధవారం రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. క్రైస్తవుల సంక్షేమం కోసం అండగా ఉండాలని ఎమ్మెల్యేకు వారు ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ కె.సుందర్‌పాల్, ఉపాధ్యక్షుడు రెవరెండ్ సీహెచ్ సునీల్ సామ్యూల్, కోశాధికారి రెవరెండ్ జేపీ పాల్, కమిటీ సభ్యులు రెవరెండ్ డి.ఆనంద్‌పాల్, పాస్టర్ జేపాల్ దేవరాజ్, పాస్టర్ సీహెచ్ దినకర్ ఉన్నారు.

జీఓ ప్రకారం వేతనాలు చెల్లించాలి

రాజేంద్రనగర్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి) : జలమండలి లో వాటర్ సప్లై విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి జీఓ నెంబర్ 60 ప్రకారం రూ.19,500లు, కంప్యూటర్ ఆపరేట ర్లకు రూ. 22,750లు చెల్లించాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన బుధవా రం రాజేంద్రనగర్ జలమండలి జనరల్ మేనేజర్ సాయి లక్ష్మిని కలిసి వినతి పత్రం అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ వెంకటి

కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలి

హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించి ఆర్థికంగా, ఆరోగ్యంగా ఎదగవచ్చని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి(డీఎం అండ్ హెచ్ఓ) డాక్టర్ జె.వెంకటి అన్నారు. బుధవారం డీఎం అండ్ హెచ్ఓ కార్యాలయంలో ఆరోగ్య పర్యవేక్షకులు, సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో కుటుంబ నియంత్రణ పద్ధతులను వివరించారు. సిబ్బంది అందరూ అర్హులైన దంపతులకు కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పించాలన్నారు. తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులైన ఓరల్ పిల్స్, అంతరా ఇంజక్షన్, ఐయూడి, ట్యూబెక్టమీ పద్ధతులు ఆడవారికి, మగవారికి కండోమ్, వేసెక్టమి ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో గణాకాధికారి ఒమర్ సలీహ్, ఆరోగ్య విస్తరణ అధికారి కృష్ణ కుమార్, ఆరోగ్య సిబ్బంది పాల్గొనినారు.

కత్తితో బెదిరించి స్నాచింగ్‌లు : ఇద్దరు మైనర్ల అరెస్టు

● ఐమాక్స్ వద్ద న్యాయవాదిపై దాడి చేసింది వీరే..

మంగళ్‌హాట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఐమాక్స్ వద్ద న్యాయవాది కల్యాణ్‌పై దాడి చేసి మొబైల్ ఫోన్ ఎత్తుకెళ్లిన కేసును పోలీసులు ఛేదించి ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. బుధవారం ఆబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ ఆకుల చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు గన్‌ఫౌండ్రిలోని ప్రసాద్ అపార్ట్‌మెంట్ వద్ద వాచ్‌మెన్‌ను ఇద్దరు కత్తితో బెదిరించి మొబైల్ ఫోన్‌ను లాక్కెళ్లారు. అక్కడి నుంచి వారు వచ్చిన హోండా యాక్టివాపై ఐమాక్స్ వద్దకు వెళ్లారు. అక్కడ వాకింగ్ చేస్తున్న న్యాయవాది కల్యాణ్ వద్ద ఉన్న మొబైల్ ఫోన్‌ను దొంగిలించేందుకు యత్నించారు. ఆయన ప్రతిఘటించడంతో వారి వెంట తెచ్చుకున్న కత్తితో బెదిరించారు. ఈ పెనుగులాటలో న్యాయవాది కల్యాణ్‌కు గాయాలయ్యాయన్నారు. సెంట్రల్ జోన్ పరిధిలో ఇదే తరహాలో రెండు కేసులు నమోదు కావడంతో డీసీపీ నేతృత్వంలో రెండు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా రాంనగర్ చేపల మార్కెట్ వద్ద ఓ మైనర్‌ను అదుపులోకి తీసుకుని అతడి వద్ద దొంగిలించిన రెడ్‌మీ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. అతనిచ్చిన సమాచారం మేరకు చాంద్రాయణగుట్ట బండ్లగూడ వద్ద మరో మైనర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడి వద్ద న్యాయవాది కల్యాణ్ నుంచి దొంగిలించిన మొబైల్ ఫోన్, దాడికి ఉపయోగించిన కత్తి, హోండా యాక్టివాను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారి ఆధార్ కార్డుల ఆధారంగా వారు మైనర్లు అని తేలిందని, వారి వయసును నిర్ధారించేందుకు ఉస్మానియా ఆస్పత్రిలో టెస్టుల కోసం పంపించా మన్నారు. గతంలో వారిపై ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో మొబైల్ స్నాచింగ్ కేసు నమోదైందన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించిన అనంతరం కస్టడీకి తీసుకుని విచారిస్తామని ఏసీపీ చంద్రశేఖర్ తెలిపారు.

బ్లాక్ మెయిల్ చేస్తున్న ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ అరెస్ట్

చార్మినార్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రెయిన్ బజార్ పోలీసుస్టేషన్ పరిధిలోని బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్న ఓ ఫ్రీలాన్స్ జర్నలిస్టును పోలీసులు అరెస్ట్ చేశారు. రెయిన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం.. రెయిన్ బజార్ రాజా పరిధిలోని ఇమ్లీబన్‌కు చెందిన మొహమ్మద్ అబ్దుల్ లతీఫ్ షర్ఫాన్‌కు మహేశ్వరం మండలంలోని నాగారం గ్రామంలో కొంత భూమి ఉంది. వాటిని సంబంధించి ఫేస్‌బుక్‌లో దుష్ప్రచారం చేస్తూ, ఫేస్‌బుక్‌లో పెట్టిన పోస్టులు తొలగించాలంటే లక్ష రూపాయలు ఇవ్వాలని ఫ్రీల్యాన్స్ రిపోర్టర్ తన్వీర్ అహ్మద్ ఖాజాను డిమాండ్ చేయడంతో లతీఫ్ రెయిన్ బజార్‌పోలీ సులకు ఫిర్యాదు చే శాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మంగళవారం రాత్రి కోఠిలో లతీఫ్ నుంచి తన్వీర్ అహ్మద్ ఖాజా రూ.70 వేలు తీసుకుంటుండగా అ తడిని పట్టుకొని డబ్బు స్వాధీనం చేసుకొన్నారు. బుధవారం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

తరగతి గది బోధనకే తొలి ప్రాధాన్యం

● ఓయూ పాలన పూర్తిగా ఆన్‌లైన్ : వీసీ కుమార్



మాట్లాడుతున్న వీసీ ప్రొ.కుమార్

హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తరగతి గది బోధనకే తన మొదటి ప్రాధాన్యమని ఉస్మానియా వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎం.కుమార్ తెలిపారు. జియో ట్యాగింగ్ ద్వారా అధ్యాపకులు తమ హాజరును నమోదు చేసుకొని విద్యార్థులతో కలిసి పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. వీసీగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి ఉస్మానియా వర్సిటీ దూరవిద్యాకేంద్రం ఆడిటోరియంలో అధ్యాపకులతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీసీ కుమార్ మాట్లాడుతూ ఓయూలో పాలన పూర్తిగా ఆన్‌లైన్ చేస్తున్నట్లు ప్రకటించారు. డిసెంబర్ ఒకటో తేదీ నుంచి లావాదేవీలన్నీ ఆన్‌లైన్ ద్వారానే జరుగుతాయని, పేస్లిప్, ఫాం 16 సహా ధ్రువపత్రాలన్నీ ఆన్‌లైన్‌లోనే డౌన్‌లోడ్ చేసుకునే విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు స్పష్టం చేశారు. న్యాక్ గుర్తింపు కోసం అవసరమైన సమాచారాన్ని అంతర్గత నాణ్యతా అంచనాల విభాగానికి (ఐక్యూఏసీ) అందజేయాలని అధ్యాపకులను ఆదేశించారు. క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్‌లో వెయ్యిలోపు ర్యాంక్ సాధించే దిశగా టార్గెట్‌తో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ నరేష్‌రెడ్డి, ఓఎస్డీ జితేంద్రనాయక్, ఐక్యూఏసీ డైరెక్టర్ శిరీష సహా ఆయా విభాగాల డీన్లు, ప్రిన్సిపాల్స్, బీఓఎస్, డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కూల్చివేతలపై సుప్రీంతీర్పు ఉపశమనం

● మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ

హైదరాబాద్, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): ఆస్తుల కూల్చివేతపై సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పును మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ స్వాగతించారు. అధికారి న్యాయమూర్తి కాలేరని, నిందితున్ని దోషిగా ప్రకటించలేరని, నిందితులు, దోషులుగా ఉన్నందున ఇళ్లను కూల్చివేస్తే రాజ్యాంగ విరుద్ధమని వెలువరించిన తీర్పు ఉపశమనం కలిగించిందని ఒవైసీ పేర్కొన్నారు. ముస్లింలు, ఇతర అణగారిన వర్గాలను లక్ష్యంగా చేసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వాలను ఈ తీర్పు నిలువరిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేస్తూ ఒవైసీ బుధవారం ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.

అత్యాచారం కేసులో యువకుడికి 25 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

మంగళహాట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి న్యాయస్థానం 25 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ నాంపల్లిలోని 12వ అదనపు కోర్టు సెషన్స్ జడ్జి టి. అనిత తీర్పు చెప్పారు. మంగళ్‌హాట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లేపల్లి ప్రాంతానికి చెందిన హల్దేడ్ సుమీత్(19) పెళ్లిళ్లు, శుభకార్యాలలో బ్యాండ్ వాయించే పని చేస్తుంటాడు. 2021 సెప్టెంబరు 15న ఓ మహిళ భర్త గొడవ పడుతున్నాడని హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లింది. పోలీసులు ఆమె భర్తను పీఎస్‌కు పిలిపించి దంపతులిద్దరికీ కౌన్సెలింగ్ ఇస్తున్నారు. తల్లిదండ్రులు కనిపించడం లేదని బాలిక(9) ఇంటి నుంచి బయటకు వచ్చింది. హల్దేడ్ సుమీత్ బాలికను మల్లేపల్లి చౌరస్తా సమీపంలో ఖాళీ ప్రదేశానికి అర్ధరాత్రి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. బాలిక విషయం తల్లికి చెప్పగా.. మంగళ్‌హాట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును నాంపల్లి కోర్టు బుధవారం విచారించింది. నిందితుడికి 25 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 5 వేల జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు చెప్పిందని పోలీసులు తెలిపారు.

ఐఏఎస్‌లు వర్సెస్ ఇంజనీర్లు

(5వ పేజీ తరువాయి)

విభాగం చీఫ్ ఇంజనీర్ అక్టోబరు 31వ తేదీన ఉద్యోగ విరమణ చేసిన దృష్ట్యా.. తాను షోకాజ్ ఇవ్వాల్సి వచ్చిందని అదనపు కమిషనర్ వారితో అన్నట్టు తెలిసింది. గతంలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ ఓ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వివరణ సహేతుకంగా లేకుంటే శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. దీనిపై అప్పట్లోనూ ఇంజనీర్లు అభ్యంతరం తెలిపారు. ఈ క్రమంలోనే అప్పటి కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎవరి వాదన వారిదే..

బల్దియా కేంద్ర, జోనల్ కార్యాలయాల్లో అధికారుల మధ్య వార్ ఇబ్బందికరంగా మారుతోంది. మౌలిక వసతుల కల్పనతో పాటు.. తోటి ఉద్యోగుల పనితీరుపైనా ప్రభావం చూపుతోంది. జోనల్, అదనపు కమిషనర్లు, కొందరు ఇంజనీరింగ్ అధికారుల మధ్య విభేదాలతో కింది అధికారులు, ఉద్యోగులు సతమతమవుతున్నారు. ఎగ్జిక్యూటివ్, సూపరింటెండెంట్ ఇంజనీర్లు తమ కేడర్‌ను పట్టించుకోకుండా పలువురు జోనల్, అదనపు కమిషనర్లు వ్యవహరిస్తున్నారని అభిప్రాయపడుతున్నారు. పనుల్లో ఆలస్యమైతే అడగొద్దా..? ప్రభుత్వ ఆదేశాల మేరకు పనులు చేయాల్సి ఉంటుంది కదా..? అని అదనపు/జోనల్ కమిషనర్లు పేర్కొంటున్నారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ఏర్పాటు విషయంలో అదనపు కమిషనర్, ఎస్ఈ మధ్య ఓ సమావేశంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్టు తెలిసింది. కొందరు ఐఏఎస్‌లు జోనల్, సర్కిల్ కార్యాలయాల్లోని అధికారులతో సామరస్యపూర్వకంగా ఉంటున్నప్పటికీ ఇంకొందరు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. అదే సమయంలో ఇంజనీరింగ్ అధికారులు కొందరు.. తాము సీనియర్లం.. మమ్మల్ని ప్రశ్నిస్తారా..? మాపై పెత్తనం చేస్తారా..? అన్నట్టు వ్యవహరిస్తున్నారు. పనిచేయకున్నా.. అడగవద్దన్నట్టుగా కొందరి తీరు ఉంటోంది. షోకాజ్ నోటీస్‌కు ఎస్ఈ వివరణ ఇస్తారా..? వివాదం సద్దుమణిగినట్టేనా అన్నది తేలాల్సి ఉంది.

ఆలోచింపజేసిన ప్రదర్శనలు

● నార్మ్‌లో ముగిసిన స్టార్టప్‌ల సదస్సు



చిరుధాన్యాల స్టాల్

రాజేంద్రనగర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని నేషనల్ అకాడమీ అఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్(నార్మ్)లో 'సుస్థిర వ్యవసాయంలో స్టార్టప్‌ల దోహదం' అనే థీమ్‌తో జరిగిన జాతీయ సదస్సు ఇనూత్న ఆవిష్కరణలకు వేదికగా నిలిచింది. రెండు రోజులపాటు జరిగిన సదస్సు బుధవారం సాయంత్రం ముగిసింది. ఈ సదస్సులో దేశ నలుమూలల నుంచి యువ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధ సంస్థల నిపుణులు, రైతులు, వ్యవసాయ విభాగం అధికారులు పాల్గొన్నారు. నార్మ్ డైరెక్టర్, నార్మ్ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ అయిన నార్మ్ ఏ ఐడియా చైర్మన్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సైంటిస్టులు డాక్టర్ సెంథిల్ వినాయగమ్, డాక్టర్ ఎస్‌ఏ విజయ్ అవినాషలింగం పర్యవేక్షణలో ఈ సదస్సు జరిగింది. చివరి రోజు భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ వర్చువల్‌గా సదస్సులో పాల్గొన్నారు. శాస్త్రవేత్తలు, నిపుణులు, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సమావేశంలో ఐటీసీ లిమిటెడ్‌కు చెందిన ఎస్.శివకుమార్, ఐసీఏఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సీమ జగ్గీ, నార్మ్‌కు చెందిన డాక్టర్ వి.రామసుబ్రమణ్యన్, డాక్టర్ పి.వెంకటేశన్, డాక్టర్ బి.నిర్మల పాల్గొన్నారు.

మిల్లెట్, వెజిటెబుల్ జామ్‌లు



మిల్లెట్ జామ్, వెజిటెబుల్ జామ్‌ల స్టాల్

నార్మ్‌లో జరిగిన స్టార్టప్‌ల సదస్సులో చిరుధాన్యాలతో తయారు చేసిన మిల్లెట్ జామ్, కూరగాయలతో తయారు చేసిన వెజిటెబుల్ జామ్‌లు ఎంతగానో ఆకట్టుకున్నాయి. బ్రౌన్ షుగర్‌ను కలిపి వీటిని తయారు చేశారు. బీటెక్ చేసిన హరి ప్రసాద్ ఈ మిల్లెట్ జామ్‌ను తయారు చేసి అందుబాటులో ఉంచారు.

మధుమేహులకు ప్రయోజనకారి కొర్రల డ్రింక్



మిల్లెట్ డ్రింక్

పామ్యుట్రా విఎల్లెట్ ఫుడ్ పేరుతో చిరుధాన్యాలైన కొర్రలతో చేసిన డ్రింక్ మధుమేహంతో బాధపడుతున్న వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎం.ఫార్మసీ చేసిన శైలేష్ తెలిపారు. చిరుధాన్యాలు నేరుగా తినడానికి ఇబ్బందిపడే వారికి ఈ విఎల్లెట్ డ్రింక్ బాగుంటుందని ఆయన వివరించారు. ఐడీఏ బొల్లారంలోని పరిశ్రమలో ఈ డ్రింక్ తయారు చేస్తున్నారు. విఎల్లెట్ డ్రింక్‌లో కొర్రలతో పాటు పండ్ల నుంచి తీసిన పౌడర్, స్టీవియ మొక్క రసంతో తయారు చేస్తారు. వీరికి కేంద్ర ప్రభుత్వానికి చెందిన బైరాక్ అనే సంస్థ ఆర్థిక సహకారం అందించింది.

రూ.12వేలకే హైబ్రిడ్ సోలార్ డ్రయర్



హైబ్రిడ్ సోలార్ డ్రయర్ గురించి తెలుసుకుంటున్న విద్యార్థులు

కోయంబత్తూర్‌కు చెందిన ఎన్.విధుబాలు బీఈ, ఈఈఈ పూర్తి చేశారు. వ్యవసాయదారులకు ఉపయోగపడే సోలార్ హైబ్రిడ్ డ్రయర్‌ను కనిపెట్టారు. దీంట్లో ఆహార వస్తువులతో పాటు గుడ్లు కూడా డ్రై చేసే అవకాశం ఉంది. ఆహార ఉత్పత్తులను ఆరబెట్టి వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేసుకునే విధంగా ఈ హైబ్రిడ్ సోలార్ డ్రయర్ ఉపయోగపడుతుందని ఎన్.విధుబాలు తెలిపారు. ఇది రూ.12వేలకు లభ్యమవుతుందని, పెద్దది కావాలంటే రూ. 65వేలు ఉంటుందని తెలిపారు.

ఆలోచనలకు రూపం నార్మ్ ఏ ఐడియా



నార్మ్ ఏ ఐడియా స్టాల్

నార్మ్‌లోని ఏ ఐడియా యువ శాస్త్రవేత్తలు, నిపుణులకు శాస్త్రీయ పరమైన సూచనలు, సలహాలు ఇవ్వడమే కాకుండా వారికి మార్కెటింగ్ సౌకర్యాలను కల్పిస్తూ ప్రోత్సహిస్తోంది. ఇప్పటి వరకు నార్మ్ ఏ ఐడియా ద్వారా 350 వరకు స్టార్టప్‌లను ఏర్పాటు చేయడానికి సహకారం అందజేశారు. అనేక రకాల వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులను వివిధ రూపాలలో మార్కెట్‌లోకి విడుదల చేయడానికి నార్మ్ ఏ ఐడీయా బాటలు వేసింది.

సెల్‌ఫోన్‌తో బోర్ ఆన్, ఆఫ్



స్మాల్ మోటారు రూపొందించిన యువ నిపుణులు

న్యాస్త్రా గ్రామోజ్వల సోలూష్యన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో రైతుల పొలాలలో ఉండే బోర్‌ను సెల్ ఫోన్ ద్వారా ఆన్, ఆఫ్ చేయడంతో పాటు కరెంటు లైట్లు కూడా ఆన్, ఆఫ్ చేయడం పై నలుగురు యువ నిపుణులు న్యాస్త్రా స్మాల్ మోటర్ మేనేజ్‌మెంట్‌ను రూపొందించారు. ఇది కేవలం రూ.4వేలకే లభ్యమవుతుంది. ఈ విధానం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. బాల బార్గవి నరిశెట్టి, రాగుల ప్రశాంత్‌రెడ్డి, రేకులపల్లి నరోత్తంరెడ్డి, మిథ్లేష్ బోయిన దీనిని తయారు చేసి రైతులకు అందుబాటులో ఉంచారు.

కాచిగూడ రైల్వేస్టేషన్‌లో జన ఔషధి కేంద్రం

● వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ



కాచిగూడ రైల్వేస్టేషన్ వద్ద జన ఔషధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం లోకేష్ విష్ణోయి

బర్కత్‌పుర, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కాచిగూడ రైల్వేస్టేషన్‌లో భారతీయ జన ఔషధి కేంద్రం ఏర్పాటు చేశారు. వికసిత్ భారత్, స్వాస్థ్య భారత్ కార్యక్రమంలో భాగంగా దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో కాచిగూడ రైల్వేస్టేషన్ ప్రధాన గేటుకు సమీపంలో ఈ జన ఔషధి కేంద్రం ఏర్పాటు చేశారు. బిహార్ రాష్ట్రంలోని దర్భంగా నుంచి బుధవారం ఉదయం 11.38 గంటలకు ప్రధాని మోదీ వర్చువల్‌గా ఆన్‌లైన్ వీడియో ద్వారా ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఇందుకోసం రైల్వే అధికారులు కాచిగూడ రైల్వేస్టేషన్ వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ డివిజన్ డీఆర్‌ఎం లోకేష్ విష్ణోయి మాట్లాడుతూ.. భారతీయ జన ఔషధి కేంద్రం పేదలకు ఎంతో ఉపయోగకరమైనదని అన్నారు. ఇక్కడ తక్కువ ధరలకు ఔషధాలను కొనుగోలు చేయవచ్చని తెలిపారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంటాయని, రైల్వే ప్రయాణికులతోపాటు స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ డీఐజీ సాదల్‌జెబ్‌ఖాన్, హైదరాబాద్ డివిజన్ చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ అశోక్‌కుమార్ సింగ్, దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ. శ్రీధర్, కాచిగూడ రైల్వేస్టేషన్ డైరెక్టర్ కె. బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

90 నిమిషాల పాటు పేరిణి తాండవం

● తల్లీకూతుళ్లకు భారత్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం



పురస్కారగ్రహీతలతో అతిథులు

రవీంద్రభారతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తొంభై నిమిషాల పాటు నిర్విరామంగా నవజనార్దన పారిజాతం, పేరిణి తాండవం చేసిన ప్రముఖ న్యాయవాది, నర్తకీమణి దువ్వూరి వాచ్ఛల్యేంద్ర(తల్లి), యూనివర్స్ ఇంటెలిజెన్స్ అభిమానిక యాదవ్(కూతురు) భారత్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్నారు. రవీంద్రభారతిలో జైజవాన్, జైకిసాన్, జూ కళాకార్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లీకూతుళ్లు వాచ్ఛలేంద్ర, అభిమానిక యాదవ్ నారీశక్తి నాట్య హేళ శీర్షికన ప్రత్యేక నాట్యాన్ని ప్రదర్శించారు. తొంభై నిమిషాలపాటు సాగిన వీరి నాట్యం ప్రేక్షకుల్ని అలరించింది. శ్రీకృష్ణుడు, శివుడి పాత్రంలో డాక్టర్ కాంతిలాల్ జైన్ ఆకట్టుకున్నారు. చక్కటి నాట్యంతో కళాకారులు హోరెత్తించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎంపీ సముద్రాల వేణుగోపాలచారి కళాకారులను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా తల్లీకూతుళ్లకు భారత్ వరల్డ్ రికార్డ్స్ పత్రాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో భారత్ వరల్డ్ రికార్డ్స్ అధ్యక్షుడు లయన్ కె.వి.రమణారావు, ఎం.శ్రీధర్, పేరిణి కుమార్, డా.కాంతిలాల్ జైన్ తదితరులు పాల్గొని కళాకారులను సత్కరించి అభినందించారు.

కబ్జాల నుంచి స్థలాలను కాపాడుకోలేని స్థితిలో వక్ఫ్‌బోర్డు

● కబ్జాదారులపై చట్ట ప్రకారం కేసు పెట్టాలి

● వక్ఫ్‌బోర్డు తీరుపై ఎమ్మెల్యే మర్రి ఆగ్రహం



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర రెడ్డి

మల్కాజిగిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు స్థలాన్నే కబ్జాల నుంచి కాపాడుకోలేని దుస్థితిలో వక్ఫ్‌బోర్డు పనిచేస్తోందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరెడ్డి ఆరోపించారు. కబ్జా చేసిన వారికి పోలీసులు వత్తాసు పలకడం వెనుక ప్రభుత్వ పెద్దలెవరున్నారో స్పష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. వక్ఫ్‌బోర్డు తీరు పేదలకో న్యాయం.. పెద్దలకో న్యాయం అన్నట్టుగా ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. మల్కాజిగిరిలో 750 ఎకరాలు తమవే అన్న వక్ఫ్‌బోర్డు సీఈవో ప్రకటనతో పాటు ఆయా సర్వే నంబర్లలో రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలంటూ చేసిన ప్రకటనతో పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇటీవల వక్ఫ్‌బోర్డు రిజిస్ట్రేషన్ల నిలిపివేత కోరుతూ నిషేధిత సర్వే నంబర్లను ప్రకటించింది. అయితే, నిషేధిత జాబితాలో లేని 398, 399 సర్వే నంబర్లలో వివాదాస్పదంగా మారిన వక్ఫ్ భూములను సర్వే నిర్వహించి నిజాలు తేల్చాలని ఎమ్మెల్యే అన్నారు. ప్రస్తుతం అందులో కబ్జాలో ఉన్న వారికి వక్ఫ్ చట్టం 52ఏ ప్రకారం నోటీసులిచ్చి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయాల్సి ఉండగా.. సదరు వక్ఫ్ అధికారులు ఎవరికి బయపడుతున్నారో తెలియడంలేదన్నారు. ఈ సర్వే నంబర్లలోని దాదాపు 20 ఎకరాల భూమిని కబ్జాచేసిన వారికి పోలీసులే సహకరించడం సమంజసమా అని ఆయన ప్రశ్నించారు. వక్ఫ్‌బోర్డు సీఈవోకు తెలియకుండానే కబ్జాలు జరుగుతున్నాయా? స్థానిక వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ (ముతవల్లి) సహకారం కబ్జా చేసిన వారికి లేదా? అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. నియోజకవర్గంలోని దాదాపు 70 వరకు కాలనీలు, బస్తీలు నిషేధిత జాబితా సర్వే నంబర్లలో ఉన్నాయని, ఇప్పటి వరకు ఎవరికి నోటీసులు ఇవ్వని అధికారులు ఇప్పుడే ఎందుకు నోటీసులంటూ భయపెడుతున్నారో అర్థం కావడంలేదన్నారు. కబ్జాకు పాల్పడిన వారిపై వక్ఫ్‌బోర్డు చట్టం 52ఏ ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

వరి, పత్తి కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంచాలి

● తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు రవి కుమార్



మాట్లాడుతున్న రవి కుమార్

బర్కత్‌పుర, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వరి, పత్తి కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచి రైతులను ఆదుకోవాలని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జిలుకర రవి కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం బర్కత్‌పురలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సన్న వడ్ల క్వింటాల్‌కు రూ.2,500 ఉండగా వాటిని రూ.2,100కు తగ్గించి రైస్ మిల్లర్లు కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారని, అలాంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సర కాలంలో ఏమి సాధించిందని ప్రజా విజయోత్సవ సభ నిర్వహిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలలో మహిళలకు ఉచిత బస్సు మినహాయిస్తే మిగతా ఐదు పథకాలు ఎంతమంది ప్రజలకు అందుతున్నాయో శ్వేత పత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కొడంగల్‌లో కలెక్టర్, రెవెన్యూ అధికారులపై జరిగిన దాడులు సమర్థనీయం కాదని, ఇందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఔషధ పరిశ్రమల ఏర్పాటుపై ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా ప్రభుత్వం వ్యవహరించాలని ఆయన కోరారు.

ఐదు రోజులు.. 4.44 లక్షల కుటుంబాలు

(5వ పేజీ తరువాయి)

4.44 లక్షల కుటుంబాల వివరాల సేకరణ జరిగింది. ఆశించిన స్థాయిలో సర్వే జరగని నేపథ్యంలో 20వ తేదీ వరకు పూర్తి చేయడం కష్టమే అని, కొన్ని రోజులు గడువు పొడిగించాల్సి వస్తుందని జీహెచ్ఎంసీ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

సర్వే వివరాలిచ్చిన మాజీ ఉపరాష్ట్రపతి

ఖైరతాబాద్ : సర్వేలో భాగంగా ఎన్యూమరేటర్ బుధవారం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు నివాసంలో వివరాలు సేకరించారు. జూబ్లీహిల్స్ రోడ్ నం.21లోని ఆయన నివాసంలో ఎన్యూమరేటర్ ఉమాదేవి, సూపర్‌వైజర్ శివకుమార్‌లు వివరాలు నమోదు చేసుకున్నారు.

కదలరు.. నడవరు

● తగ్గిన శారీరక శ్రమతోనే ముప్పు ● పెరుగుతున్న మధుమేహ వ్యాధిగ్రస్తులు

● నేడు వరల్డ్ డయాబెటిస్ డే



హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆధునిక జీవన విధానం, కదలికలేని ఉద్యోగాలు, ఫాస్ట్ ఫుడ్, మానసిక ఒత్తిడిలు మధుమేహాన్ని పెంచడానికి కారణమవుతున్నాయని అంటున్నారు వైద్యులు. కార్పొరేట్ ఉద్యోగంలో శరీరానికి ఎక్కువగా పనులు చెప్పకపోవడం, సరైన వ్యాయమం లేకపోవడం, వర్క్ ఫ్రమ్ హోమ్‌లో ఉంటే సోఫా నుంచి కిందకు దిగడం లేదు. తరచూ ఏదో ఒకటి తినడం వల్ల మధుమేహం చాప కింద నీరులా వ్యాపిస్తోంది. ఆల్కహాల్, పొగతాగడం వల్ల బ్లడ్ షుగర్ స్థాయి పెరుగుతోంది. ఐటీ ఉద్యోగుల్లో మధుమేహం ఎక్కువగా కనిపిస్తుండగా, సాధారణ ఉద్యోగుల్లో 30 ఏళ్ల లోపే మధుమేహం బారిన పడుతున్నట్లు వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

ఇతర అవయాలకు ప్రమాదం

మధుమేహం ఉంటే కిడ్నీ, కళ్లు, గుండె, రక్తనాళాలు, కాళ్లు, చేతులు ఎక్కువగా దెబ్బతింటాయంటున్నారు. మధమేహం ఉన్న వారిలో చిగుళ్ల వ్యాధులు వస్తాయని, దవడ ఎముకకి ఇన్‌ఫెక్షన్ సోకుతుందని, నోట్లో బ్యాక్టీరియా ఎక్కువవవుతుందన్నారు.

ఒక్కో వైద్యుడి ఓపీలో 40 శాతం మంది

ఒక్కొక్క వైద్యుడి ఓపీలో 40 శాతం మంది మధుమేహ బాధితులుంటున్నారని వైద్యులు వివరిస్తున్నారు. ఇందులో 20 నుంచి 30 శాతం మంది ఐటీ ఉద్యోగులే ఉంటున్నారని చెబుతున్నారు. 13 నుంచి 19 ఏళ్ల మధ్య వయస్సు గల వారిలో 20 శాతం, 20 నుంచి 30 వయస్సు ఉన్న వారిలో 30 శాతం, 30 నుంచి 40 వయస్సున్న వారిలో 40 శాతం, 40 కంటే ఎక్కువ వయస్సు ఉన్న వారిలో 50 శాతం కంటే మించి మధుమేహంతో బాధపడుతున్నారని వైద్యులు తెలిపారు. గతంలో ఓ ఫార్మా కంపెనీ నిర్వహించిన సర్వేలో కూడా యువతలో ఎక్కువగా మధుమేహం ఉన్నట్లు తేలింది. 1900 మందిని సర్వే చేయగా.. యువత 25 శాతానికి మించి మధుమేహంతో బాధపడుతున్నట్లు, 43 శాతం మంది ఈ వ్యాధిగ్రస్తులు కిడ్నీ బాధితులున్నట్లు తెలిసింది.

గర్భిణులకు మధుమేహం ఉంటే..

గర్భిణులకు మధుమేహం ఉంటే పుట్టబోయే బిడ్డ, తల్లికి ప్రమాదమని, కొన్నిసార్లు ప్రాణాపాయ పరిస్థితిని ఎదుర్కొనే అవకాశం ఉందని వైద్యులు స్పష్టం చేశారు. కొంతమంది గర్భిణులకు ప్రసవం తర్వాత మధుమేహం అకస్మాత్తుగా తగ్గిపోతుందని, ఐదేళ్ల తర్వాత తిరిగి మళ్లీ వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు.

అధిక శాతం ఉద్యోగుల్లో..

కార్పొరేట్ ఉద్యోగం చేసే వారికి డయాబెటిస్ శాపంగా మారిందని అంటున్నారు వైద్యులు. కంప్యూటర్, ఇంటర్నెట్‌తో ఎక్కువసేపు పనిచేసేవారు, డెస్క్ వర్క్, ఏసీలో అధిక సమయం గడిపే వారికి మధుమేహం పొంచి ఉందంటున్నారు. కొన్ని కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగులను పరీక్షించగా సగానికంటే ఎక్కువ మందికి మధుమేహం ఉన్నట్లు తేలిందన్నారు. కదలికలేని శరీరంలో ఇన్సులిన్ రెసిటెన్సీ పెరుగుతుందని, తద్వారా మధుమేహం వచ్చే ప్రమాదముందని తెలిపారు.

ఈ లక్షణాలు కనిపిస్తే అప్రమత్తంగా ఉండాలి

అలసట, విపరీతంగా దాహం వేయడం, ఆకలి ఎక్కువగా ఉంటే అప్రమత్తంగా ఉండాలి. తరచూ మూత్రం రావడం, ఏకాగ్రత లోపించడం, ఎక్కువగా నీరు తాగడం, దెబ్బలు తగిలినచోట గాయం మానకపోవడం, చిరాకు వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. పిల్లలు నిద్రలో మూత్ర విసర్జన, బరువు కోల్పోవడం, నీరసంగా ఉండడం, వణకడం వంటి లక్షణాలు కనిపిస్తే అప్రమత్తంగా ఉండాలి.


ప్రాసెస్ ఆహారంతో ముప్పు



చాక్‌లెట్లు, క్రీమ్ బిస్కెట్లు, ప్రాసెస్ ఫుడ్‌లో అల్ట్రాప్రాసెస్ షుగర్ ఎక్కువగా ఉంటుంది. చిన్నప్పటి నుంచి ఇలాంటి ఆహార పదార్థాలు తినడం వల్ల 50లో రావాల్సిన మధుమేహం 20 వయస్సు లోనే వస్తుంది. చాలామంది డబుల్ ప్రాసెస్ బియ్యం తింటున్నారు. అందులో పోషకాలు చాలా తక్కువగా ఉంటాయి. ఇలాంటి అన్నం తినడం వల్ల త్వరగా మధుమేహం బారిన పడుతున్నారు. ప్రస్తుతం దంపుడు బియ్యం తినడం లేదు. ప్రాసెస్ బియ్యానికి ఎక్కువగా అలవాటు పడుతున్నారు. అలవాటు కోసం మొదట సింగిల్ ప్రాసెస్ బియ్యం, రెండు నెలల తర్వాత పాలిష్ బియ్యం తినాలి. ఆ తర్వాత బ్రౌన్ రైస్ అలవాటు చేసుకోవాలి. జీవన శైలి మార్పు అనేది శాశ్వత్వంగా ఉండాలి. తప్పనిసరిగా 15 నిమిషాలు వ్యాయామం చేయాలి. చెమట పడితేనే మంచిది. చపాతీకి బదులు జొన్నరొట్టె తినాలి. ఇడ్లీ, రాగి, జొన్న పిండి కలిపి చేసుకోవాలి. పెసరట్టు తినాలి. తెల్ల ఉప్మా తినొద్దు, పొట్టుతో ఉన్న పప్పులు తినాలి. బ్రౌన్ బ్రెడ్ మంచిది కాదు.

- డాక్టర్ టీఎన్‌జే రాజేష్, సీనియర్ ఇంటర్నల్ మెడిసిన్, డయాబెటాలజిస్టు

కొత్త కేసులు పెరుగుతున్నాయి



మధుమేహానికి సంబంధించి కొత్త కేసులు పెరుగుతున్నాయి. 20 నుంచి 30 ఏళ్ల వారు ఎక్కువగా ఉంటున్నారు. ఓపిలో 5 నుంచి 10 శాతం మంది, ఆస్పత్రికి వచ్చే వారిలో 20 నుంచి 40 ఏళ్ల లోపు ఉంటున్నారు. బలహీనంగా ఉండి, మూత్రం ఎక్కువగా వస్తుంటే పరీక్షలు చేయించుకోవాలి. మధుమేహం నియంత్రణలో లేకపోతే న్యూరోపతి, కిడ్నీ, గుండె సంబంధిత సమస్యలు వస్తాయి. డయాబెటిక్ వల్ల గుండె సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయి. పీసీఓడీ సమస్య వల్ల మధుమేహం ఇబ్బందులు ఉంటున్నాయి. ప్రతి ఏడుగురి శిశువుల్లో ఒకరు పుట్టక సమయంలోనే గెస్టేషనల్ డయాబెటీస్ మెల్లిటస్(జీడీఎం) ప్రభావానికి లోనవుతున్నారు.

- డాక్టర్ స్మితవల్లా, ఎండోక్రైనాలజిస్టు, కిమ్స్ ఆస్పత్రి



గోళ్లు అందంగా..!

చేతులు అందంగా కనిపించాలంటే గోళ్లను ఆరోగ్యంగా ఉంచుకోవాలి. బలహీనమైన గోళ్లు అనారోగ్యాన్ని సూచిస్తాయి. గోళ్లు లేత గులాబీ రంగులో నున్నగా మెరుస్తూ పొడవుగా పెరగాలంటే ఆహారంలో ఏ పోషకాలు ఉండాలో తెలుసుకుందాం!

ప్రొటీన్లు: గోళ్లు కెరటిన్ అనే ప్రొటీన్‌తో తయారవుతాయి. మనం తీసుకునే ఆహారంలో ప్రొటీన్లు లోపిస్తే గోళ్లు బలహీనంగా పెళుసుగా మారతాయి. గోళ్లు అందంగా పెరగాలంటే ప్రొటీన్లు సమృద్ధిగా లభించే చిక్కుళ్లు, టోఫు, గుడ్లు, చేపలు, చికెన్ తినాలి.

బయోటిన్: ఇది గోళ్లు విరగకుండా కాపాడుతుంది. బయోటిన్ అధికంగా లభించే గుడ్లు, బాదాం, వాల్‌నట్స్, ఓట్స్, సాల్మన్, చిలకడదుంప, అవకాడో, కాలీఫ్లవర్‌లను తరచూ తినడం వల్ల గోళ్లు బలంగా పెరుగుతాయి. బయోటిన్ లోపం అధికంగా ఉంటే వైద్యుని పర్యవేక్షణలో సప్లిమెంట్స్ వాడవచ్చు.

జింక్: ఇది గోళ్లు పెళుసుబారకుండా కాపాడుతుంది. ప్రమాదవశాత్తూ గోళ్లు విరిగినా, గోళ్లపై పగుళ్లు వచ్చినా తగిన మరమత్తులు చేసి గోళ్లు బలంగా పెరిగేలా చూస్తుంది. చిక్కుళ్లు, శనగలు, పలు రకాల నట్స్ నుంచి జింక్ పుష్కలంగా లభిస్తుంది.

విటమిన్లు: గోళ్లు ఆరోగ్యంగా పెరగాలంటే విటమిన్లు, మినరల్స్, కాల్షియం తప్పనిసరి. గోళ్లు ఆక్సీకరణ బారిన పడకుండా ఎ విటమిన్ కాపాడుతుంది. సి విటమిన్ గోళ్లలో కొల్లాజెన్‌ను ఉత్పత్తి చేసి అవి దృఢంగా ఉండేలా చూస్తుంది. ఇ విటమిన్ గోళ్లకు తేమ, పోషణను అందిస్తుంది. క్యారెట్, క్యాప్సికమ్, మొలకలు, సిట్రస్ పండ్లు, స్ట్రాబెరీ, అరటి పండు, కివీ పండ్లు తరచూ తినడం వల్ల గోళ్లకు రక్తప్రసరణ జరిగి బలంగా పెరుగుతాయి. ప్రతిరోజూ ఒక గ్లాసు పాలు తాగడం కూడా మంచిదే.



సజ్జలతో సజావుగా!

ఏ వయసువారికైనా సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించే చిరుధాన్యాల్లో సజ్జలు ప్రధానమైనవి. వీటికి స్వతహాగా వేడిని కలిగించే గుణం ఉంటుంది. కాబట్టి శీతాకాలంలో సజ్జలను ఆహారంగా తీసుకుంటే శరీరంలోని ఉష్ణోగ్రతను కాపాడుకోవచ్చు. వీటిలో గ్లూటెన్ ఉండదు. ఎన్నో పోషకాలతో నిండిన సజ్జలు అందించే ప్రయోజనాల గురించి తెలుసుకుందాం!

ఆరోగ్యానికి...

- తరచూ సజ్జలు తినడంవల్ల వీటిలోని పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలు రక్తపోటుని నిరోధిస్తాయి. గుండె సంబంధిత వ్యాధులు రాకుండా చేస్తాయి.
- సజ్జలతో తయారు చేసిన ఆహార పదార్థాలను తిన్నపుడు వాటిలో ఉండే కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్స్ వల్ల ఎక్కువ సమయం కడుపు నిండిన భావన ఉంటుంది. ఇవి నిదానంగా జీర్ణమవడం వల్ల తొందరగా ఆకలి అనిపించదు. తద్వారా శరీర బరువు నియంత్రణలో ఉంటుంది.
- రక్తంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది. ఇవి మధుమేహ రోగులకు అమృతంలా పని చేస్తాయి. వీటిలోని పీచుపదార్థం ప్రీ బయాటిక్‌లా పని చేసి జీర్ణాశయాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.
- సజ్జలను ఆహారంలో చేర్చుకోవడంవల్ల శరీరానికి కావాల్సిన విటమిన్లు, మినరల్స్ అంది రక్తహీనత, అధిక కొవ్వువల్ల తలెత్తే సమస్యలను నియంత్రిస్తాయి. శరీరంలో మంచి కొలెస్ట్రాల్ శాతాన్ని పెంచి కార్డియో వాస్క్యులర్, బ్రెస్ట్ క్యాన్సర్, ఆస్తా తదితర వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయి. సజ్జల నుంచి లభించే బి విటమిన్లు కండరాలను దృఢంగా మారుస్తాయి. శీతాకాలంలో వచ్చే కీళ్ల సమస్యలు, బోలు ఎముకల వ్యాధిని నివారిస్తాయి.

అందానికి....

- సజ్జలలో యాంటీ ఆక్సిడెంట్లు, ఫినాలిక్స్ ఉంటాయి. ఇవి శరీరంలో జీవక్రియలను వేగవంతం చేస్తాయి. చర్మ సంబంధిత సమస్యలను నివారిస్తాయి. వృద్ధాప్య ఛాయలను అడ్డుకుంటాయి.
- సజ్జలను తినడం వల్ల శరీరానికి కావాల్సిన ఐరన్, ఇ విటమిన్ లభిస్తాయి. దీనివల్ల చర్మం మీద మొటిమలు, ముడుతలు తగ్గి మెరుపు సంతరించుకుంటుంది. సజ్జలలో ఉండే బి 6, నియాసిన్, ఫోలేట్, ఐరన్, జింక్, ప్రొటీన్ల వల్ల శిరోజాలు ఒత్తుగా పెరుగుతాయి.

విజేత





బాడీబిల్డింగ్ అంటే ఆసక్తి...
కానీ ఇంట్లో అందుకు అంగీకరించరు. అందుకే ఉద్యోగానికి వెళుతున్నానని చెప్పి... జిమ్‌లో సాధన చేసింది. ఇల్లాలిగా అటు ఇంటి పనులు... అమ్మగా ఇటు పసిబిడ్డ బాధ్యతలు... అన్నిటినీ సమన్వయం చేసుకొంటూ అనుకున్నది సాధించింది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు పతకాలు గెలిచింది. అంతర్జాతీయ పోటీల్లో తలపడి... భారత్‌కు పతకాలు అందివ్వడమే తన లక్ష్యమంటున్న **సయ్యద్ ఆసిఫా**ను 'నవ్య' పలుకరించింది.

సాహసమే ఊపిరిగా..!

"అంకితభావంతో కృషి చేయాలే కానీ అసాధ్యమనేది ఏదీ ఉండదు. ఇది నాకు అనుభవం నేర్పిన పాఠం. పెళ్లి, పిల్లలు, కుటుంబం... ఆ తరువాత చాలామంది అమ్మాయిలు ఇక కొత్తగా ఏమీ సాధించలేమని అనుకొంటారు. కానీ నా ప్రయాణం పెళ్లయ్యి, ఒక బిడ్డ పుట్టాకే మొదలైంది. ఏపీలోని ప్రకాశం జిల్లాలోని ఓ సంప్రదాయ ముస్లిం కుటుంబం మాది. మా నాన్న ఆర్మీ ఉద్యోగి కావడంతో దేశంలోని వివిధ ప్రాంతాల్లో నా విద్యాభ్యాసం సాగింది. 2014లో ఇంటర్ పూర్తి కాగానే ఇంట్లోవాళ్లు నాకు పెళ్లి చేశారు. మావారు కూడా ఆర్మీ ఉద్యోగే.

ఆయన సహకారంతో...

పెళ్లి తరువాత నేను చదువు కొనసాగించాలని అనుకున్నాను. మావారికి చెబితే సరేనన్నారు. ఆయన సహకారంతో డిగ్రీ చదివాను. మాకు ఓ బాబు పుట్టాడు. మావారి సహకారంతో ఎంబీయే కూడా పూర్తి చేశాను. తరువాత ఓ సంస్థలో ఉద్యోగం వచ్చింది. అదికూడా మార్కెటింగ్‌లో. సాధారణంగా మార్కెటింగ్ అనగానే మగవారికే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కానీ మహిళలు ఎందులోనూ తీసిపోరని నిరూపించాలని అనుకున్నాను. ఆఫీస్‌లో కూర్చొనే ఉద్యోగం కాదనుకుని మార్కెటింగ్ వైపు వెళ్లాను.

అలా మొదలైంది...

చిన్నప్పటి నుంచి నాకు క్రీడలపై ఆసక్తి ఎక్కువ. బాబు పుట్టాక రోజూ ఉదయం లేవగానే రన్నింగ్ మొదలుపెట్టాను. క్రమంగా అది నా దినచర్యల్లో భాగమైపోయింది. ఆ క్రమంలోనే నా దృష్టి మారథాన్‌లపై పడింది. తొలిసారి 2017లో 5కేఎం మారథాన్‌లో పాల్గొన్నాను. మంచి అనుభూతిని ఇచ్చింది. మరింత సాధన చేసి... మరుసటి ఏడాది జైపూర్‌లో జరిగిన హాఫ్ మారథాన్‌లో పోటీపడ్డాను. నా ఫిట్‌నెస్ చూసి కొందరు స్నేహితులు సలహా ఇచ్చారు... బాడీబిల్డింగ్ మీద దృష్టి పెట్టమని. ఆ సలహా నచ్చింది. 'ఎందుకు ప్రయత్నించకూడదు' అనుకున్నా. అలా 2019లో బాడీబిల్డింగ్ కోసం హైదరాబాద్ పహాడీషరీఫ్‌లోని ఒక జిమ్‌లో చేరాను.

పిల్లాడిని వెంటబెట్టుకొని...

మా అబ్బాయిని వెంటబెట్టుకొని జిమ్‌కు వెళ్లేదాన్ని. నా వ్యాయామాలు అయ్యేంతవరకు వాడు అక్కడే ఉండేవాడు. జిమ్‌లో చేరిన కొత్తల్లో అందరూ నన్ను వింతగా చూసేవారు. తరువాత నా ప్రయత్నం గురించి తెలుసుకుని ఎంతో ప్రోత్సహించారు. బాడీబిల్డింగ్ కోసం ఎలాంటి వ్యాయామాలు చేయాలి? ఎలాంటి ఆహారం తీసుకోవాలి? తదితర అంశాల్లో సూచనలు, సలహాలు ఇచ్చేవారు. మావారికి తప్ప మా ఇంట్లో ఎవరికీ నేను జిమ్‌కు వెళుతున్న విషయం తెలియదు. వాళ్లకు తెలిస్తే ఒప్పుకోరు. అందుకే బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నానని కుటుంబ సభ్యులకు చెబుతూ వచ్చాను. నేను ఇంట్లోవాళ్ల కంట పడకుండా కసరత్తులు చేశాను.

అదే నా లక్ష్యం...

అవకాశం, అయినవారి సహకారం ఉంటే అమ్మాయిలు ఎందులోనూ తీసిపోరని చెప్పే ప్రయత్నం నాది. అంతర్జాతీయ పోటీల్లో దేశం తరుపున పాల్గొనడం ఏ క్రీడాకారులకైనా ఉద్వేగభరిత క్షణం. విజయం సాధించి మువ్వన్నెల జెండా కప్పుకున్నప్పుడు ఎంతో గర్వంగా ఉంటుంది. ప్రస్తుతం నా ముందున్న లక్ష్యం అదొక్కటే... అంతర్జాతీయ వేదికపై తలపడి... భారత్‌కు పతకాలు తేవాలని. నేను పతకాలు సాధిస్తే... అది చూసి మరింతమంది అమ్మాయిలు స్ఫూర్తి పొందుతారనీ, బాడీబిల్డింగ్‌లోకి వస్తారనీ నా ఆశ.



అప్పటివరకు తెలియదు...

బాడీబిల్డింగ్‌లో కురచ దుస్తులు ధరిస్తారని నాకు ముందు తెలియదు. క్రీడాకారులు తమ సౌలభ్యం కోసం పొట్టి దుస్తులు ధరించడం సహజమని తరువాత అర్థమైంది. ఒక ముస్లిం మహిళగా బాడీబిల్డింగ్‌ను ఎంచుకోవడం పెద్ద సాహసమేనని చెప్పాలి. రెండేళ్లకు పైగా తీవ్రగా శ్రమించాను. పోటీలకు కావల్సిన విధంగా నా శరీరాన్ని తీర్చిదిద్దుకున్నాను. 2022లో మొదటిసారి బరిలోకి దిగాను. జోనల్, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పోటీపడ్డాను. తమిళనాడులో నిర్వహించిన దక్షిణ భారత చాంపియన్‌షిప్‌లో ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించాను. లుధియానాలో జరిగిన జాతీయ చాంపియన్‌షిప్‌లో నాలుగో స్థానం దక్కించుకున్నాను. నా కష్టానికి ఫలితం దక్కింది. నా లక్ష్యానికి మరింత చేరువ అయ్యాను. అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాను. మాల్దీవ్స్‌లో ఇటీవల నిర్వహించిన ప్రపంచ బాడీబిల్డింగ్ సైకిక్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో దేశం తరుపున పాల్గొన్నాను. ఇది నాకు లభించిన అద్భుత అవకాశం.

ఎన్నిటినో వదిలేసి...

కఠోర వ్యాయామాలవల్ల కండలు పెరగడం, ముఖాకృతిలో మార్పులు రావడంతో బంధువుల నుంచి, వారు వేసే ప్రశ్నల నుంచి తప్పించుకొనేందుకు పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు వెళ్లడం మానేశాను. ఎప్పుడైనా వెళితే... 'ఏంటీ రోజు రోజుకూ మగరాయుడిలా మారిపోతున్నావు' అనేవారు. సమాధానం ఇవ్వకుండా దాటవేసేదాన్ని. బాడీబిల్డింగ్‌లో వ్యాయామాలు ఎంత ముఖ్యమో ఆహార నియమాలు పాటించడం కూడా అంతే ముఖ్యం. దీని కోసం ప్రత్యేకమైన ఆహారం తీసుకోవాలి. ఇంట్లో అందరితో కలిసి భోజనానికి కూర్చున్నప్పుడు కొద్దిగా తినేసి పక్కకు వచ్చేదాన్ని. తరువాత ఎవరి కంటా పడకుండా నిపుణులు సూచించిన ఆహారం తీసుకొనేదాన్ని. అనుకున్నది సాధించాలంటే కొన్నింటిని త్యాగం చేయక తప్పదు. దాని కోసం నేను మంచి ఉద్యోగం వదులుకున్నాను. కుటుంబం, కట్టుబాట్లను దాటి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నాను. అది సత్ఫలితాలను ఇస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది."

● మగ్దుం బాషా షేక్

సలహా

మధుమేహం రాకుండా
ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

డాక్టర్! నాకు 40 ఏళ్లు. మధుమేహం ముప్పు పొంచి ఉందని వైద్యులు చెప్పారు. ప్రిడయాబెటిక్ పరిస్థితి మధుమేహానికి దారి తీయకుండా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి?

- ఓ సోదరి, హైదరాబాద్

మధుమేహం వచ్చే ముందు కొన్ని లక్షణాలు కనిపిస్తూ ఉంటాయి. అయితే జీవనశైలిలో మార్పులతో వీటిని సులువుగానే అదుపులో పెట్టుకోవచ్చు. ప్రిడయాబెటిక్‌లో చక్కెర స్థాయిలు సహజం కంటే కాస్త ఎక్కువగా, టైప్2 మధుమేహం మోతాదు కంటే కాస్త తక్కువగా ఉంటాయి. ఈ ఆరోగ్య పరిస్థితిలో ఆరోగ్యం తీవ్రంగా కుదేలయ్యే పరిస్థితి తలెత్తే వరకూ మధుమేహ లక్షణాలేవీ బయల్పడవు. కాబట్టి మధుమేహం ముప్పు పొంచి ఉన్న వాళ్లు ముందస్తు రక్తపరీక్షలు చేయించుకుంటూ చక్కెర స్థాయిల మీద ఓ కన్నేసి ఉంచాలి. మరీ ముఖ్యంగా...

- స్థూలకాయులు
- 45 ఏళ్లు దాటినవాళ్లు
- టైప్2 డయాబెటిస్ కుటుంబ చరిత్ర ఉన్నవాళ్లు
- వారంలో కనీసం మూడు సార్లు కూడా వ్యాయామం చేయనివాళ్లు
- గర్భంతో ఉన్నప్పుడు మధుమేహం బారిన పడినవాళ్లు
- పాలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ ఉన్నవాళ్లు

ఈ కోవకు చెందినవాళ్లు రెట్టింపు అప్రమత్తంగా నడుచుకోవాలి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

ప్రిడయాబెటిక్ అని నిర్ధారణ అయినప్పుడు ఆ పరిస్థితిని అంగీకరించి, అందుకు తగ్గట్టు జీవనశైలి మార్పులు చేసుకోవాలి. మందులు వాడుతూ దాన్ని అదుపులో ఉంచుకుంటే సరిపోతుందిలే! అనుకోకుండా దాంతో ముడిపడి ఉండే ఆరోగ్య సమస్యలను ఎప్పటికప్పుడు కనిపెడుతూ, వాటిని తిప్పి కొడుతూ ఉండాలి. అందుకోసం...

- **బరువు తగ్గాలి:** అధిక బరువును వ్యాయామంతో ఏ కొంత తగ్గించుకోగలిగినా టైప్2 మధుమేహం ముప్పు తగ్గుతుంది. మొత్తం శరీర బరువులో 7% తగ్గినా స్పష్టమైన ఫలితం దక్కుతుంది. కాబట్టి వారానికి 150 నిమిషాలకు తగ్గకుండా వ్యాయామం చేయాలి. అంటే వారంలో ఐదు రోజుల పాటు, రోజుకు 30 నిమిషాల నడక సరిపోతుంది. వేగంగా నడవడం లేదా అంతే సమానమైన ఫలితం దక్కే ఇతరత్రా వ్యాయామాలు కూడా ఎంచుకోవచ్చు.



- **సరిపడా నిద్ర:** రోజుకు 8 గంటలు తగ్గకుండా నిద్ర పోవాలి. రాత్రుళ్లు ఆలస్యంగా నిద్రపోతూ, ఉదయం ఆలస్యంగా నిద్ర లేచే అలవాటు మానుకోవాలి. అలాగే మధ్యాహ్న సమయాల్లో కునుకులకు స్వస్థి చెప్పాలి. నిద్ర లేమి తీపి తినాలనే కోరికను పెంచుతుంది. ఫలితంగా మరుసటి ఉదయం తీయని పదార్థాలను ఎక్కువగా తింటూ ఉంటాం. అధిక క్యాలరీలు కలిగి ఉండే తీపి వల్ల శరీర బరువు పెరుగుతుంది.
- **సమతులాహారం:** మాంసకృత్తులు, పీచు, పిండిపదార్థాలు సమతులంగా ఉండే ఆహారం తీసుకోవాలి. ఒకేసారి ఎక్కువ పరిమాణాలు కాకుండా తక్కువ పరిమాణాల్లో ఎక్కువ సార్లు తినాలి. వీలైనంత ఎక్కువ పీచు, మాంసకృత్తులు, వీలైనంత తక్కువ పిండిపదార్థాలు తీసుకోవాలి. ఆకుకూరలు, తీపి తక్కువ ఉండే పళ్లు, తాజా కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి. అలాగే తృణధాన్యాలను కూడా తీసుకుంటూ ఉండాలి. పాలిష్ పట్టిన బియ్యం, గోధుమలకు బదులుగా ముడి బియ్యం, పొట్టుతో కూడిన పప్పుదినుసులను ఎంచుకోవాలి.
- **దురలవాట్లు:** ధూమపానం, మద్యపానం అలవాట్లను మానేయడం ద్వారా ప్రిడయాబెటిస్, మరింత పెరగకుండా ఆపే వీలుంది

● డాక్టర్ సందీప్ రెడ్డి గంట
సీనియర్ ఎండోక్రైనాలజిస్ట్, హైదరాబాద్

స్ఫూర్తి



జనపనార ఉత్పత్తులతో
జీవితాలను సరిదిద్ది...

కట్టెల మోపు తలకెత్తుకుని, ప్రతి రోజూ తన ఇంటి ముందు నుంచి నడుచుకుంటూ వెళ్లే మహిళను చూసి, 'అది ఆమె తల రాత' అని సరిపెట్టుకోలేకపోయింది బెంగాల్‌కు చెందిన జుంకీ అయ్యంగార్. నిరుపేద మహిళల బతుకులను సరిదిద్దే ఆలోచన దిశగా అడుగులేసి, నిర్భాగ్య మహిళలకు జీవనభృతిని అందించే 'ఓర్నా' శిక్షణా కేంద్రాన్ని స్థాపించింది. ఆసక్తికరమైన ఆమె కథ తెలుసుకుందాం!

"ఓర్నా శిక్షణా కేంద్రాన్ని స్థాపించినప్పుడు నా వయసు 57. సమాజం నుంచి ఎంతో పొందాను. ఇప్పుడు తిరిగిచ్చే సమయం వచ్చిందని అనిపించిన వెంటనే, మహిళలకు జీవనభృతిని అందించే శిక్షణా సంస్థను స్థాపించాలనే ఆలోచన టక్కున స్ఫురించింది. మాది ఉన్నత మధ్య తరగతి కుటుంబం. సమాజసేవ మాకు అలవాటే! తాతయ్య ఆడపిల్లలకు చదువు నేర్పించాలనే సంకల్పంతో వెనకబడిన ప్రాంతాల్లో బడులు నడిపేవారు. నేను ఆయన్నుంచే స్ఫూర్తి పొందాను. ఉన్నత చదువులు చదివాను. ఐఐటీ ముంబయి నుంచి డిజైనింగ్‌లో మాస్టర్స్ చేశాను. యుఎస్ టఫ్ట్స్ విశ్వవిద్యాలయం నుంచి ఎమ్మెస్ చేశాను. ప్రస్తుతం జోధ్‌పూర్, కాన్పూర్ ఐఐటీ విద్యార్థులకు ప్రొడక్ట్ డిజైన్ నేర్పిస్తున్నాను. అక్కడ నేర్పిస్తున్న విద్యనే మహారాష్ట్రలోని గ్రామీణ విద్యార్థులకు కూడా ఉచితంగా నేర్పిస్తూ ఉంటాను. ఖండాలాలో రెండేళ్ల పాటు వర్క్‌షాపులు కూడా ఏర్పాటు చేశాను. ఆ సమయంలోనే కుటుంబానికి తల్లులే వెన్నెముకలు అనే విషయం అవగతమైంది. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పేద కుటుంబాలకు చెందిన మహిళలు ఎంతటి అంతర్గత శక్తిని కలిగి ఉన్నప్పటికీ, జీవనభృతికి తోడ్పడే అవకాశాలేవీ వాళ్లకు అందుబాటులో లేవనే విషయాన్ని నేను గమనించాను. అప్పుడే వాళ్ల పరిస్థితిలో మార్పు తీసుకురావాలని నిర్ణయించుకున్నాను. అలా బెంగాల్‌కే పరిమితమైన కాంటా పనితనాన్ని, జనపనార ఉత్పత్తులకు జోడించి, వినూత్నమైన ఉత్పత్తులను సృష్టించి, మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించాలని భావించాను. అలా నా ప్రయాణం ఖండాలాలో మొదలైంది.

ఇంటి నుంచే ఆదాయం

ఖండాలా సందర్శించినప్పుడు, అక్కడి మన్ దేశీ ఫౌండేషన్ అనే ఒక గ్రామీణ బ్యాంకు గురించి తెలిసింది. ఆ బ్యాంకు అధికారులు వర్క్‌షాప్‌కు అవసరమైన వసతులు కల్పించి, చుట్టుపక్కల నివసించే గ్రామీణ మహిళలతో అనుసంధానమయ్యే అవకాశం కల్పించారు. ఓర్నా సంస్థ ద్వారా, ఇంటికే పరిమితమైన నైపుణ్యం లేని మహిళలకు ఉచితంగా శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టాం. ఉత్పత్తుల తయారీకి అవసరమైన ముడిపదార్థాలను వాళ్ల ఇళ్లకే తీసుకువెళ్లి అందించి, కుట్టు, ఎంబ్రాయిడరీ పనితనాలను ఓపిగ్గా నేర్పించాం. మా ఉత్పత్తులన్నీ జనపనారతో తయారైనవే! పైగా ఇవి పర్యావరణహితమైనవి కూడా! ఇలా ఇంటిపట్టునే తయారుచేసిన ఉత్పత్తులు, మాకు అందించిన వెంటనే తగిన రుసుమును చెల్లిస్తూ ఉండడంతో మహిళలు ఎంతో చురుగ్గా పని చేయడం మొదలుపెట్టారు. ఇవి అత్యంత మన్నికైన ఉత్పత్తులు కావడంతో కొనుగోళ్లు కూడా పెరిగాయి.

ఖండాలాలో రెండేళ్ల పాటు వర్క్‌షాపులు కూడా ఏర్పాటు చేశాను. ఆ సమయంలోనే కుటుంబానికి తల్లులే వెన్నెముకలు అనే విషయం అవగతమైంది. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పేద కుటుంబాలకు చెందిన మహిళలు ఎంతటి అంతర్గత శక్తిని కలిగి ఉన్నప్పటికీ, జీవనభృతికి తోడ్పడే అవకాశాలేవీ వాళ్లకు అందుబాటులో లేవనే విషయాన్ని గమనించాను.



విదేశీ విక్రయాలు

మొదటి విడతలో తయారైన ఉత్పత్తులను అమెరికాలో విక్రయించాలని నిర్ణయించుకున్నాను. భారతీయ చేతివృత్తుల సంప్రదాయాలను పాశ్చాత్య దేశాలకు పరిచయం చేయడంతో పాటు, మారుమూల భారతీయ చేతివృత్తులకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తీసుకురావాలనే సంకల్పమే ఇందుకు కారణం. వ్యాపారాన్ని విస్తరించడం కోసం 2019లో ఓర్నా ఉత్పత్తులను భారతదేశంలో కూడా అందుబాటులోకి తీసుకొచ్చాను. గ్రామీణ మహిళా వ్యాపారులను ప్రోత్సహించే, భివ్యాడి జాత్రా అనే ప్రఖ్యాత భారతీయ వాణిజ్య జాతరలో, ప్రధాన విభాగంలో ప్రదర్శన కోసం మా ఉత్పత్తులు ఎంపికయ్యాయి. ప్రదర్శనలో మా ఉత్పత్తులు సాధించిన విజయం ఓర్నా వృద్ధికి ఎంతో బాగా తోడ్పడింది. పూణెలో ఉన్న ఓర్నాతో అనుసంధానమై ఉన్న మహిళలందరూ 18 నుంచి 45 ఏళ్ల వారే! వినియోగదారులతో పాటు, బొటిక్‌లు, టోకు వ్యాపారులకు, ఓర్నా ఉత్పత్తులను విక్రయిస్తోంది. అమెరికా, దుబాయి, యుకె, జర్మనీల్లో కూడా ఓర్నా వినియోగదారులున్నారు. సంప్రదాయం ఉట్టిపడే ఉత్పత్తులను తయారుచేయడమే మా లక్ష్యం. ఎంబ్రాయిడరీ బ్యాక్‌ప్యాక్స్, టోట్స్, పర్సులు ఎక్కువగా అమ్ముడవుతూ ఉంటాయి. అలాగే భుజాలకు తగిలించుకునే సంచులు, ల్యాప్‌టాప్ సంచులు, కోస్టర్లు, టీ టవల్స్, బాటిల్ హోల్డర్స్ కూడా తయారు చేస్తూ ఉంటాం.

అభిప్రాయాల విలువ పెరిగింది

ప్రస్తుతం ఓర్నా వార్షిక ఆదాయం 10 నుంచి 24 లక్షలు. మహిళల శిక్షణకు మాకు రెండు నుంచి మూడేళ్ల సమయం పడుతూ ఉంటుంది. అయినప్పటికీ పట్టుదలగా నేర్చుకుని, తమ కాళ్ల మీద తాము నిలబడే స్థితికి చేరుకోవాలనే సంకల్పం ప్రతి మహిళలో నాకు కనిపిస్తూ ఉంటుంది. ఇది హర్షించదగిన విషయం. ఇప్పుడు ఆ మహిళల అభిప్రాయాలకు కుటుంబంలో ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. వాళ్లు వాళ్ల పిల్లలకు మెరుగైన జీవితాలను అందించగలుగుతున్నారు. ఓర్నా ద్వారా నేను అనుకున్నది సాధించగలిగాను. ఈ జీవితానికి ఇంతకంటే ఏం కావాలి?"



పనిలో బిజీగా ఉన్నా..

డబ్బింగ్ చెబుతున్న రష్మిక

అల్లు అర్జున్, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న చిత్రం 'పుష్ప 2:ది రూల్'. ఈ చిత్రంలో తన పాత్రకు డబ్బింగ్ చెప్పే పనిలో ఉన్నారు రష్మిక. ఆ ఫొటోలను బుధవారం సోషల్ మీడియాలో షేర్ చేశారు. 'పనిలో బిజీ అయ్యాను, సెకండాఫ్‌కు డబ్బింగ్ చెబుతున్నాను. 'పుష్ప 2' గురించి మాటల్లో చెప్పలేను. ప్రథమార్థం అద్భుతంగా ఉంటుంది. ద్వితీయార్థం అంతకు మించి అనేలా ఉండబోతోంది. ఇంకొన్ని రోజుల్లో చిత్రీకరణ పూర్తవనుంది. దీంతో చిత్రబృందాన్ని ఇకపై మిస్ అవుతున్నానే అనే ఆలోచన బాధ కలిగిస్తుంద'న్నారు. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ నెల 17న ట్రైలర్‌ను విడుదల చేస్తున్నారు. డిసెంబర్ 5న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. శ్రీలీల చేస్తున్న ప్రత్యేక గీతాన్ని ఇటీవలే చిత్రీకరించారు. ఈ చిత్రంలో ఫహాద్ ఫాజిల్, సునీల్, అనసూయ, రావు రమేశ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

రానా సరికొత్త టాక్ షో




సెలబ్రిటీల జీవితాల్లోని ఎవరికీ తెలియని కోణాలను ఆవిష్కరించే వెబ్ సిరీస్ 'ద రానా దగ్గుబాటి షో' ఈనెల 23 నుంచి ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవనుంది. ఈ ప్రోగ్రామ్‌ని స్పిరిట్ మీడియా బేనర్‌పై రానా నిర్మించి హోస్ట్ చేస్తున్నారు. ఈ సరికొత్త అన్‌స్క్రిప్టెడ్ ఒరిజినల్ సిరీస్ ఎనిమిది ఎపిసోడ్లు ఉంటుంది. ఇందులో ప్రముఖ సెలబ్రిటీలు అన్ ఫిల్టర్డ్ సంభాషణలు, ఎక్సయిటింగ్ యాక్టివిటీస్‌లో పాల్గొంటారు. దుల్కర్ సల్మాన్, నాగచైతన్య అక్కినేని, సిద్ధూ జొన్నలగడ్డ, శ్రీలీల, నాని, ఎస్ఎస్ రాజమౌళి, రామ్ గోపాల్ వర్మ వంటి సెలబ్రిటీలు పాల్గొంటారు. 'సెలబ్రిటీల వ్యక్తిత్వానికి ఒక ప్రత్యేక కోణాన్ని 'ద రానా దగ్గుబాటి షో' చూపుతుంది' అని అన్నారు ప్రైమ్ వీడియో ఇండియా ఒరిజనల్స్ హెడ్ నిఖిల్ మధోక్.



వాసు జీవితానికి వెలుగులాంటి పాత్ర

వరుణ్‌తేజ్ హీరోగా నటించిన 'మట్కా' చిత్రం గురువారం విడుదలవుతోంది. ఇందులో కథానాయికగా నటించిన మీనాక్షి చౌదరి బుధవారం మీడియాతో మాట్లాడుతూ 'ఇందులో వరుణ్‌తేజ్ వాసుగా నటిస్తే, నేను సుజాత పాత్ర పోషించాను. ఇది మూడు డిఫరెంట్ ఫేజుల్లో ఉంటుంది. వాసుతో పాటు ట్రావెల్ అయ్యే క్యారెక్టర్. ఒక్క మాటలో చెప్పాలంటే వాసు జీవితానికి వెలుగులాంటి పాత్ర ఇది. టీనేజ్‌లో ఒకలా కనిపిస్తాను. లైఫ్‌లో దశలు మారుతున్న కొద్దీ నా లుక్‌లో మార్పు ఉంటుంది. దర్శకుడు కరుణకుమార్ లుక్ విషయంలో చాలా శ్రద్ధ వహించారు. ఆయన ఎన్నో స్కెచెస్ వేసి నా క్యారెక్టర్ లుక్ డిజైన్ చేయించారు. ఇప్పటివరకూ నేను చేసిన పాత్రల్లో డిఫరెంట్ లుక్ ఉన్న సినిమా ఇది. ఎంజాయ్ చేస్తూ ఆ పాత్ర చేశాను' అన్నారు. వరుణ్‌తేజ్ గురించి వివరిస్తూ 'చాలా మంచి వ్యక్తి. మంచి సినిమా నాలెడ్జ్ ఉంది. వాసు పాత్రను అద్భుతంగా పోషించారు. మా కాంబినేషన్లో ఒక సాంగ్ ఉంది. అది లవ్ సాంగ్. ఒక లైఫ్ స్టోరీలా ఉంటుంది. ఆ సాంగ్ ని డైరెక్టర్ గారు చాలా అద్భుతంగా ప్రజెంట్ చేశారు. ఈ సినిమా కోసం అందరూ ఎంతో ఎఫర్ట్ పెట్టారు. తప్పకుండా సినిమా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు మీనాక్షి.



గోదారి గట్టుమీద...

అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. దిల్‌రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. మరో అప్డేట్‌ను చిత్రబృందం పంచుకుంది. ఈ చిత్రంలోని తొలి గీతానికి రమణ గోగుల గాత్రం అందిస్తున్నారు. 'గోదారి గట్టు మీద' అంటూ సాగే ఈ పాటను త్వరలో విడుదల చేయనున్నారు. గతంలో వెంకటేశ్ నటించిన 'లక్ష్మి' చిత్రంలోని పాటలకు రమణ గోగుల సంగీత సారథ్యం వహించారు. మళ్లీ 18 ఏళ్ల తర్వాత వెంకటేశ్, రమణ గోగుల కాంబినేషన్ ఇలా కుదిరింది.

హసీనా ప్రేమగీతం



ఇరవై ఏళ్ల క్రితం వచ్చిన 'సిక్స్‌టీన్స్' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతోన్న చిత్రం 'రిస్క్ - ఎ గేమ్ ఆఫ్ యూత్'. ప్రముఖ సంగీత దర్శకుడు ఘంటాడి కృష్ణ స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సందీప్ అశ్వా కథానాయకుడు. సన్య ఠాకూర్, జోయా ఝవేరి హీరోయిన్లు. రాజీవ్ కనకాల కీలక పాత్ర పోస్తున్నారు. ఈ చిత్రం నుంచి 'ఓ హసీనా' అంటూ సాగే ప్రేమ గీతాన్ని నటుడు సత్యం రాజేశ్ చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే అంశాలు ఈ చిత్రంలో ఉన్నాయని ఘంటాడి కృష్ణ తెలిపారు.

ఉత్కంఠ భరిత ప్రేమకథ



పవన్ శంకర్, యాని హీరో, హీరోయిన్లుగా దర్శకుడు జి.ఎం.నాయుడు తెరకెక్కిస్తున్న చిత్రం జిపిఎల్(గాడ్స్ ప్రీమియర్ లీగ్). అల్లు సాయి లక్ష్మణ్ నిర్మాత. ఈ చిత్రం పూజా కార్యక్రమాలు హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జి.ఎం.నాయుడు మాట్లాడుతూ' పవన్ కళ్యాణ్ అభిమానిగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నా. జిపిఎల్ టైటిల్ ఈ కథకు సరిగ్గా సరిపోతుంది. మనం పైన ఉన్న భగవంతుడి ఆదేశాల మేరకు నడుస్తాము అనే పాయింట్‌తో ఈ సినిమా కథాంశం ఉండబోతుంది' అని తెలిపారు. నిర్మాత అల్లు సాయి లక్ష్మణ్ మాట్లాడుతూ' అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే విధంగా ఈ చిత్రం ఉంటుంది. లవ్ ఇన్వెస్టిగేషన్ సస్పెన్స్ థ్రిలర్‌గా రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ సింగిల్ షెడ్యూల్‌లో పూర్తిచేయబోతున్నాం' అని చెప్పారు. తనికెళ్ల భరణి, హెబ్బాపటేల్, బ్రహ్మాజీ, నాగ మహేష్, నవీన్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.

ఇన్ ప్రోగ్రెస్

నాన్నకు ప్రేమతో



తండ్రీ కొడుకుల అనుబంధం ఇతివృత్తంగా తెరకెక్కుతోన్న చిత్రం 'లవ్ యువర్ ఫాదర్'. పవన్ కేతిరాజు దర్శకత్వంలో కిశోర్ రాఠీ, అన్నపురెడ్డి సామ్రాజ్య లక్ష్మి నిర్మిస్తున్నారు. శ్రీహర్ష, కశిక కపూర్, రియా సింగా జంటగా నటిస్తున్నారు. గాయకుడు ఎస్పీ చరణ్ ఈ చిత్రంలో తండ్రి పాత్ర పోషిస్తున్నారు. ఛత్రపతి శేఖర్, రఘుబాబు, భద్రం కీలకపాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం పోస్టర్ విడుదల కార్యక్రమాన్ని యూనిట్ నిర్వహించింది. కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రమిదని నిర్మాతలు తెలిపారు. మణిశర్మ సంగీతం ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకుడు చెప్పారు.

అమరావతికి మహా వరం

- ఔటర్, తూర్పు బైపాస్ భూసేకరణ ఖర్చు భరిస్తాం
- ఏపీ ప్రభుత్వానికి కేంద్రం హామీ
- రాష్ట్రానికి తప్పిన 6 వేలకోట్లకుపైగా ఆర్థిక భారం

అమరావతి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాజధానిగా అమరావతి శీఘ్ర అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి ఫలించింది. రాజధాని అభివృద్ధిలో కీలకమైన రెండు ప్రాజెక్టుల భూసేకరణ ఖర్చును కేంద్రమే భరించనుంది. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ (ఎంవోఆర్‌టీహెచ్) సానుకూలత వ్యక్తం చేసింది. ఆ ప్రాజెక్టుల్లో ఒకటి 189 కిలోమీటర్ల పొడవైన అమరావతి ఔటర్ రింగ్‌రోడ్డు. మరొకటి 59 కిలోమీటర్ల పొడవైన తూర్పుబైపాస్. ఈ రహదారుల నిర్మాణం చేయాలంటే వేల ఎకరాల భూమిని సేకరించాలి. అదంతా రూ. ఆరువేల కోట్లపైనే భారీ ఖర్చుతో కూడుకున్న పని. ఏపీకి ఉన్న అప్పులు, ఆర్థిక కష్టాల నేపథ్యంలో భూ సేకరణ చేసే స్థోమత సర్కారుకు లేదు. ఆ ఖర్చును కేంద్రమే భరించాలని చంద్రబాబు ఇటీవల ఢిల్లీకి వెళ్లినప్పుడు కేంద్ర రహదారుల మంత్రి నితిన్‌గడ్కరీని కలిసి విజ్ఞప్తి చేశారు. ఇప్పుడు ఆ ప్రయత్నాలు ఫలించాయి. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు, తూర్పుబైపాస్‌ల కోసం భూ సేకరణకు అయ్యే ప్రతీ రూపాయి తామే భరిస్తామని ఎంవోఆర్‌టీహెచ్ స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి లిఖితపూర్వక సమాచారం ఇచ్చింది. ప్రతిగా, పరోపకారం కింద తమకు స్టేట్ జీఎస్టీ మినహాయింపు ఇవ్వాలని కోరింది. ఇందుకు సర్కారు కూడా సరేనంది. స్టేట్ జీఎస్టీని మినహాయిస్తూ ఆదేశాలు ఇచ్చింది. కేంద్ర నిర్ణయం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై దాదాపు ఆరువేల కోట్ల ఆర్థికభారం తప్పింది.

అసభ్యకర పోస్టులు పెట్టేవారిపై కేసులు పెడితే తప్పేంటి?

- న్యాయమూర్తులు కూడా బాధితులే
- పోలీసులు పెట్టే కేసుల్లో జోక్యం చేసుకోలేం: ఏపీ హైకోర్టు
- ఇష్టారీతిన చేస్తామనే భావన కుదరదు
- ఈ వ్యవహారంలో పిల్ వేయడానికి వీల్లేదు
- కావాలంటే క్వాష్ పిటిషన్లు వేసుకోండి
- పిటిషనర్‌కు హైకోర్టు స్పష్టీకరణ

అమరావతి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాలలో అసభ్యకర, అనుచిత పోస్టులు పెడుతున్నవారిపై పోలీసులు నమోదు చేస్తున్న కేసుల విషయంలో జోక్యం చేసుకోవడానికి హైకోర్టు నిరాకరించింది. అసభ్యకర పోస్టులు పెడుతున్నవారి పై కేసులు పెడితే తప్పేముందని ప్రశ్నించింది. ఒక దశలో తమను కూడా ఉపేక్షించ లేదని, అసభ్యకర పోస్టులకు న్యాయమూర్తులు కూడా బాధితులుగా మారారని గుర్తు చేసింది. పోలీసు కేసుల్లో ఏరకంగానూ జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. నేరానికి పాల్పడిన వ్యక్తుల విషయంలో పోలీసులు చట్టనిబంధనల మేరకు నడుచుకుంటుంటే తాము ఎలా నిలువరించగలమని ప్రశ్నించింది. పోలీసులు నమోదు చేసిన కేసుల పై అభ్యంతరం ఉంటే సంబంధిత వ్యక్తులకు క్వాష్ పిటిషన్లు దాఖలు చేసుకొనే ప్రత్యామ్నాయ మార్గం ఉందని గుర్తు చేసింది. కేసుల నమోదుపై ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేయడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. ప్రస్తుత పిల్ పై తగిన నిర్ణయం వెల్లడిస్తామని ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నవారిపై సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా కేసులు పెడుతూ పోలీసులు చట్టనిబంధనలను ఉల్లంఘిస్తున్నారని, పోలీసుల చర్యలపై విచారణకు ఆదేశించాలని కోరుతూ పాత్రికేయుడు, వైసీపీ ప్రభుత్వంలో అధికార భాషా సంఘం అధ్యక్షుడు పోలా విజయ్‌బాబు హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలుచేశారు. ఈ పిల్ బుధవారం విచారణకు రాగా, పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. "సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నవారి పై పోలీసులు వరుస కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. పోలీసుల చర్య వాక్ స్వాతంత్ర్యాన్ని హరించేదిగా ఉంది. ప్రభుత్వ యంత్రాంగమే వెనుక ఉండి మూకుమ్మడి కేసుల నమోదును ప్రోత్సహిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా పోస్టులు పెడుతున్నవారిపై ఒకే తరహాలో కేసులు పెడుతున్నారు. పోస్టులు పెట్టినవారిపై సీఆర్పీసీ సెక్షన్ 153(ఏ) కింద కేసులు పెట్టడానికి వీల్లేదని ఇదే కోర్టు తీర్పు ఇచ్చింది, పోలీసుల చర్య సుప్రీం కోర్టు తీర్పుకి విరుద్ధంగా ఉంది" అని వాదించారు. ఈ వాదనలపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. సామాజిక మాధ్యమాలలో 2000 మంది అసభ్యకర, అనుచిత పోస్టులు పెడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, అలాంటివారిపై పోలీసులు కేసులు పెడితే తప్పేముందని ప్రశ్నించింది. పోలీసులు ఒకే తరహా కేసులు పెట్టడం లేదని, కొందరు వ్యక్తులు ఒకే తరహా దూషణలు, అసభ్యకర పోస్టులు పెట్టి దుష్ప్రచారం చేస్తున్నారని వ్యాఖ్యానించింది. ఒక దశలో న్యాయమూర్తులు కూడా ఈ దూషణలకు బాధితులుగా మారారని గుర్తు చేసింది.

సోషల్ సైకోలపై ఉక్కుపాదం

- అసభ్య పోస్టులు పెట్టినవారిపై కేసులు..ఆర్జీవీకి నోటీసులు

అమరావతి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో కీలక నేతలను లక్ష్యంగా చేసుకొని సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టిన వైసీపీ సానుభూతిపరులపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఫొటోలను మార్ఫింగ్ చేసి అసభ్యకరంగా తన ఎక్స్ అకౌంట్‌లో పోస్ట్ చేసిన కేసులో సినీ డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మకు ప్రకాశం జిల్లా మద్దిపాడు పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఎస్‌ఐ బి.శివరామయ్య బుధవారం హైదరాబాద్ వెళ్లి ఆర్జీవీకి నోటీసులు అందజేశారు. ఈ నెల 19న ఒంగోలు రూరల్ సర్కిల్ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని అందులో పేర్కొన్నారు. కాగా, సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆయన తనయుడు రాజగోపాల్‌రెడ్డిపై సోషల్ మీడియాలో అసభ్యకర వ్యాఖ్యలతో పోస్టులు పెట్టిన కేసుకు సంబంధించి వైసీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం ముత్తుకూరు పోలీస్‌స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు.

డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా వైజయంతిని మళ్లీ నియమించొద్దు

- సీఎంకు తెలంగాణ క్యాడర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్(డీవోపీ)గా మళ్లీ జి. వైజయంతిని నియమించరాదని పేర్కొంటూ సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ క్యాడర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ అసోసియేషన్ విజ్ఞాపన సమర్పించింది. ఈనెల 30వ తేదీతో ఆమె పదవి పూర్తవుతుందని, మళ్లీ అదే పోస్టులో నియమించాలని ఆమె పెట్టుకున్న దరఖాస్తును తిరస్కరించాలని అసోసియేషన్ అధ్యక్షురాలు పి. శైలజ తదితరులు సీఎంకు విజ్ఞప్తి చేశారు. బీఎన్‌ఎస్‌ఎస్ఎ నిబంధనల ప్రకారం డీవోపీ పదవి చేపట్టాలంటే 15 ఏళ్లపాటు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసి ఉండాలి లేదా సెషన్స్ జడ్జిగా పనిచేసి ఉండాలనే నిబంధనలు ఉన్నాయని వారు తెలిపారు. సీఐడీ లీగల్ అడ్వైజర్‌గా, ప్రాసిక్యూషన్స్ జాయింట్ డైరెక్టర్, అడిషనల్ డైరెక్టర్ తదితర పోస్టులు నిర్వహించిన వైజయంతి నిబంధనల ప్రకారం డీవోపీ పోస్టుకు అర్హురాలు కాదని పేర్కొన్నారు. ఆంధ్రా స్థానికత కలిగిన వైజయంతి తెలంగాణ అధికారుల పట్ల పక్షపాతంతో వ్యవహరిస్తున్నట్లు చాలా ఫిర్యాదులు వచ్చాయన్నారు. క్యాడర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు సీనియార్టీ ప్రకారం సదరు పోస్టు ఇవ్వాలని వారు కోరారు.

ఇందిరమ్మ ఇల్లు.. 400 చదరపు అడుగుల్లో..

(మొదటి పేజీ తరువాయి)

ఇల్లు నిర్మించుకోవడానికి లబ్ధిదారునికి ప్రభుత్వం నాలుగు విడతల్లో రూ. 5 లక్షలు ఇస్తుందని తెలిపారు. పునాది నిర్మాణం పూర్తి కాగానే రూ. లక్ష, లెంటల్ లెవల్‌కు చేరగానే రూ.1.25 లక్షలు, స్లాబు వేశాక రూ. 1.75 లక్షలు, గృహప్రవేశం సమయంలో మిగిలిన లక్ష రూపాయలను ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. గ్రామ సభలను నిర్వహించి పేదల్లో బహుపేదలను లబ్ధిదారులుగా ఎంపిక చేస్తామని, ఇంటిని ఇంటి యజమానురాలి పేరునే మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. గాంధీభవన్‌లో బుధవారం జరిగిన మంత్రితో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మంత్రితో ముఖాముఖి కార్యక్రమంలో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు సంబంధించి వినతి పత్రాలే వచ్చాయని వెల్లడించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నమూనాలు



చూపించి గెలిచిన బీఆర్ఎస్ పార్టీ.. పదేళ్ల అధికారంలో ఉండి కట్టించలేదని విమర్శించారు. అలాగే ధరణి సమస్యలు, రుణమాఫీ తదితర అంశాలపైనా వినతులు వచ్చాయని చెప్పారు. కొత్త ఆర్వోఆర్ ముసాయిదా బిల్లుకు తుది మెరుగులు దిద్దడం పూర్తికావచ్చిందన్నారు. త్వరలోనే దేశానికే రోల్ మోడల్‌గా నిలిచే కొత్త ఆర్ఓఆర్ చట్టాన్ని తీసుకురానున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి పేరుతో కనుసైగలతో ప్రభుత్వ స్థలాలను తమ పేరిట మార్చుకున్నారని, ఆ స్థలాలను తిరిగి తీసుకుని పేదవాళ్లకు ఇస్తామని పేర్కొన్నారు. కొంత మంది అర్హులైన రైతులకు రూ.13 వేల కోట్ల మేరకు రుణాలను మాఫీ చేయాల్సి ఉందని, డిసెంబరు నెలలో పున ఆ రుణాలను మాఫీ చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో పండిన ధాన్యం చివరి గింజ వరకూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. బీఆర్ఎస్ హయాంలో రైతులను జైల్లో పెట్టిన విషయాన్ని మరిచిపోయి ఆ పార్టీ నేతలు మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు.

వికారాబాద్ ఘటన వెనుక ఉన్నదెవరో తేల్చుతాం

వికారాబాద్ ఘటన వెనుక ఉన్న వారు ఎవరో అతి త్వరలో తేల్చేసి మీడియా ముందు ఉంచుతామని మంత్రి పొంగులేటి చెప్పారు. రైతుల ముసుగులో కొందరు దౌర్జన్యానికి పాల్పడుతున్నారని, ప్రజలకు మంచి చేద్దాం అనుకుంటున్న అధికారులను, ప్రభుత్వాన్ని బదనాం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు అనే పేరు ముందు పెట్టి ముసుగు వెనక ఎవరు ఉన్నారో బయటపెడుతామని స్పష్టం చేశారు. కాగా, బుధవారంనాటి మంత్రితో ముఖాముఖీ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, ప్రజల నుంచి 300 వరకూ దరఖాస్తులను మంత్రి పొంగులేటి స్వీకరించారు. పలు సమస్యలకు సంబంధించి కలెక్టర్లకు ఫోన్లు చేసి పరిష్కరించాల్సిందిగా మంత్రి సూచించారు.

కొంత రుణం.. కొంత బాండ్లతో!

(మొదటి పేజీ తరువాయి)



ఆ రుణాన్ని తీర్చివేయాల్సి ఉంటుంది. పీపీపీ విధానంలో అయితే.. నిర్మాణ వ్యయంలో ప్రైవేటు సంస్థతో పాటు, ప్రభుత్వం కూడా కొంతమేర నిధులను భరించాల్సి ఉంటుంది. రహదారిని నిర్మించిన సంస్థ కొన్నేళ్లపాటు దాన్ని నిర్వహిస్తూ, టోల్ వసూలు చేసుకుని, ఆ తరువాత ప్రభుత్వానికి అప్పగిస్తుంది. హైదరాబాద్‌లో నిర్మించిన మెట్రో రైల్ ప్రాజెక్టు ఇందుకు ఒక ఉదాహరణ. ఇక, బీవోటీ విధానంలో.. ప్రైవేటు సంస్థే రోడ్డును నిర్మించి, టోల్ వసూలు చేసుకుంటుంది. టోల్ వసూలు చేసినంతకాలం రోడ్ నిర్వహణను సదరు సంస్థే పర్యవేక్షిస్తుంది. ఆ తరువాత ప్రభుత్వానికి అప్పగిస్తుంది. హెచ్ఏఎం విధానంలో అయితే.. వ్యయంలో నిర్మాణ సంస్థ 40 శాతం, మరో 20శాతం ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. మిగతా 40% బ్యాంకు రుణం. ఈ విధానంలో.. రోడ్డు నిర్మాణం పూర్తయ్యాక వసూలు చేసే టోల్ రుసుములో రాష్ట్రానికి కూడా కొంత వాటా వస్తుంటుంది. పైగా రహదారి నిర్మాణం కోసం ప్రైవేటు సంస్థ వెచ్చించిన నిధులను వారికి ప్రభుత్వం వెంటనే చెల్లించాల్సిన అవసరంలేదు. ఏడాదికి కొంత చొప్పున కిస్తీల రూపంలో చెల్లించేందుకు వెసులుబాటు ఉంటుంది. ప్రస్తుతం దేశంలో ఈ హైబ్రిడ్ యాన్యుటీ విధానమే ఎక్కువగా అమల్లో ఉంది. అయితే, ఇటీవలి కాలంలో పలు రాష్ట్రాల్లో 'ఇన్‌విట్' విధానంలోనూ రహదారులను నిర్మిస్తున్నారు. ఈ పద్ధతిలో నిర్మాణానికి అయ్యే మొత్తం వ్యయంలో కొంత ప్రైవేటు సంస్థల నుంచి, మరి కొంత మొత్తాన్ని బాండ్ల రూపంలో సేకరిస్తారు. ఈ పద్ధతిలో రహదారి నిర్మాణానికి నిధులిస్తే.. టోల్ ద్వారా ఎంత ఆదాయం వస్తుందనే విషయాన్ని పరిగణనలోకి తీసుకున్నాకే ప్రైవేటు సంస్థలు నిధులను అందిస్తాయి. ఆ తర్వాత కూడా ఇంకా నిధులు అవసరమైతే వాటిని బాండ్ల రూపంలో సేకరిస్తారు. రహదారి నిర్మాణమయ్యే ప్రాంతాల ప్రజలు, వ్యాపారులతో పాటు వాణిజ్య మార్కెట్లలో పెట్టుబడులు పెట్టే సంస్థల నుంచి బాండ్లను తీసుకుంటారు. అలా తీసుకున్న బాండ్లకు.. రహదారి నిర్మాణమైన తరువాత టోల్ ద్వారా, రహదారికి ఇరువైపులా ఏర్పాటుచేసే వాణిజ్య వ్యాపార సముదాయాల ద్వారా వచ్చే ఆదాయం నుంచి కొంత మొత్తాన్ని క్రమంగా చెల్లిస్తుంటారు. ఈ విధానంలో అయితే ప్రభుత్వంపై ఆర్థికభారం పడబోదనే అభిప్రాయాలు వ్యక్తమైనట్లు తెలిసింది.

త్వరలో డీపీఆర్ కన్సల్టెంట్..

ఆర్ఆర్ఆర్ దక్షిణభాగం నిర్మాణం, ఆ దారిలో చేపట్టే వెహికల్ అండర్ పాస్, రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, క్రాసింగ్, జంక్షన్లు తదితర నిర్మాణాలపై సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించేందుకు ఒక కన్సల్టెంట్‌ను నియమించనున్నారు. ఇందుకోసం త్వరలో టెండర్లను ఆహ్వానించనున్నారు. రహదారి వెళ్లే మార్గంలో ఏమైనా గ్రామాలు, ఆవాసాలు ఉన్నాయా? ఉంటే అక్కడ ఎంతమంది నివసిస్తున్నారు? చెరువులు, కుంటలు ఎన్ని ఉన్నాయి? సాగు భూములున్నాయా? అటవీభూములెన్ని ఉన్నాయి? తదితర వివరాలను ఈ నివేదిక రూపకల్పనలో భాగంగా సేకరిస్తారు. ఆ దారిలో సాగేతర, అటవీయేతర భూములుంటే ఎలాంటి ఇబ్బందులూ ఉండవని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుత రూట్ మ్యాప్ ప్రకారం ఈ రహదారి చౌటుప్పల్ దగ్గర ప్రారంభమై ఇబ్రహీంపట్నం, కందుకూరు, ఆమనగల్, చేవెళ్ల, శంకర్‌పల్లి మీదుగా సంగారెడ్డిలోని ఉత్తర భాగానికి అనుసంధానం కానుంది.

ప్రత్యేక అమలు విభాగం..

దక్షిణభాగం రహదారి అలైన్‌మెంట్ నుంచి ఇతరత్రా అన్ని అంశాలనూ పర్యవేక్షించేందుకు ప్రత్యేక అమలు విభాగాన్ని (ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్-పీఐయు) ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఔటర్ రింగు రోడ్డు ప్రాజెక్టు నిర్మాణ సమయంలో కూడా.. నాటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం ఇలాగే ఒక ప్రత్యేక అమలు విభాగాన్ని ఏర్పాటుచేసింది. ఓఆర్ఆర్ నిర్మాణాన్ని ఆ విభాగమే పర్యవేక్షించింది. ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే ఈ పీఐయులో.. ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) చీఫ్ ఇంజినీర్ (సీఈ), డిప్యూటీ ఇంజినీర్ (డీఈ), సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ), మేనేజర్, అకౌంటెంట్ సహా పలువురు సిబ్బంది ఉండనున్నారు.

కస్టమ్ మిల్లింగ్.. 'పొరుగు' మిల్లర్లకూ

(మొదటిపేజీ తరువాయి)

అప్పగిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తాజాగా ప్రకటించారు. దీంతో ఇతర రాష్ట్రాల్లో ఉన్న రైస్‌మిల్లర్ల దృష్టి తెలంగాణ వైపు మళ్లింది.

బ్యాంకు గ్యారెంటీ వంద శాతం

తెలంగాణ రైస్‌మిల్లర్లు 10 శాతం బ్యాంకు గ్యారెంటీ ఇవ్వటానికే ససేమిరా అంటున్నారు. ఈ పద్ధతి రద్దుచేయాలని డిమాండ్ చేస్తున్నారు. కానీ ఏపీలో వంద శాతం బ్యాంకు గ్యారెంటీ నిబంధన అమలుచేస్తున్నారు. అంటే ఇక్కడ కోటి రూపాయల విలువైన ధాన్యం తీసుకుంటే.. రూ. 10 లక్షలకు బ్యాంకు గ్యారెంటీ ఇస్తే సరిపోతుంది. కానీ ఏపీలో కోటి రూపాయల విలువైన ధాన్యం తీసుకోవాలంటే కోటి రూపాయలకు బ్యాంకు గ్యారెంటీ ఇవ్వాలనే నిబంధన ఉంది. అక్కడి రైస్ మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీ ఇచ్చి మిల్లింగ్ చేసి బియ్యం అప్పగిస్తున్నారు. ఇక్కడ మాత్రం వేల కోట్ల విలువైన ధాన్యం తీసుకొని ఇష్టం వచ్చినట్లుగా అమ్ముకొని బియ్యం తిరిగివ్వటానికి ముప్పుతిప్పలు పెడుతున్నారు. అయితే 100శాతం బ్యాంకు గ్యారెంటీ నిబంధనకు అలవాటుపడిన ఏపీ రైస్ మిల్లర్లు తెలంగాణ ప్రభుత్వానికి కూడా 100 శాతం బ్యాంకు గ్యారెంటీ ఇచ్చి ధాన్యం తీసుకెళ్లటానికి సుముఖంగా ఉన్నారు. అయితే ఎక్కడెక్కడ ధాన్యం అందుబాటులో ఉంది? స్థానిక రైస్‌మిల్లర్లు ఎక్కడ ధాన్యం తీసుకోవటంలేదు? ఎక్కడి ధాన్యాన్ని ఇతర రాష్ట్రాల మిల్లర్లకు అప్పగించాలనే అంశంపై రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ కసరత్తు చేస్తోంది. మధ్యంతర గోదాములకు తరలించకముందే ఇతర రాష్ట్రాల రైస్‌మిల్లర్లకు ధాన్యం అప్పగిస్తే రవాణా ఖర్చు లు, ఎగుమతి,దిగుమతి హమాలీ ఖర్చుల భారం పడబోదనే ఆలోచనతో ఉంది. ధాన్యం ఉత్పత్తి రాష్ట్రంలో 155 లక్షల టన్నులుండటంతో వీలై నం త ధాన్యాన్ని బయటికి పంపించాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉంది.

నాగార్జున పరువుకు నష్టం కలగలేదు

- నాంపల్లి కోర్టులో మంత్రి సురేఖ కౌంటర్
- మంత్రి వ్యాఖ్యలు బాధించాయి: సత్యవతి రాథోడ్

హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు అక్కినేని నాగార్జున, ఆయన కుటుంబ పరువుకు నష్టం కలిగేలా తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని మంత్రి కొండా సురేఖ నాంపల్లి కోర్టుకు తెలిపారు. ఎన్ కన్వెన్షన్ వ్యవహారం, తన కుమారుడు నాగచైతన్య విడాకుల విషయమై మంత్రి చేసిన వ్యాఖ్యల వల్ల తమ కుటుంబ గౌరవ మర్యాదలకు భంగం కలిగాయంటూ నాగార్జున క్రిమినల్ పరువు నష్టం దావా వేసిన తెలిసిందే. దీనిపై న్యాయస్థానం ఇచ్చిన సమన్లకు మంత్రి సురేఖ న్యాయవాది గుర్మీత్ సింగ్ కౌంటర్ దాఖలు చేశారు. సురేఖ మాట్లాడిన అంశాల వల్ల నాగార్జున, ఆయన కుటుంబ గౌరవ మర్యాదలకు ఎలాంటి భంగం వాటిల్లలేదని కౌంటర్‌లో స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను తదుపరి విచారణ సమయంలో కోర్టుకు సమర్పిస్తామని తెలిపారు. దీంతో విచారణను కోర్టు ఈనెల 21వ తేదీకి వాయిదా వేసింది.

నోటికి ఏదొస్తే అది మాట్లాడారు..

కేటీఆర్‌పై మంత్రి సురేఖ నోటికి ఏదొస్తే అది మాట్లాడారని నాంపల్లి కోర్టులో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ వాంగ్మూలమిచ్చారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఓ నటి విడాకుల విషయమై, కేటీఆర్‌ని బాధ్యుడిని చేస్తూ మంత్రి చేసిన వ్యాఖ్యలు మహిళగా తనను బాధించినట్లు పేర్కొన్నారు. నాగచైతన్య, సమంత విడాకులకు తానే కారణమని సురేఖ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై కేటీఆర్ క్రిమినల్ పరువు నష్టం దావా వేసిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి గతంలో కేటీఆర్, దాసోజు శ్రవణ్ వాంగ్మూలాలివ్వగా.. తాజాగా సత్యవతి, బాల్క సుమన్, తుల ఉమ స్టేట్‌మెంట్లను కోర్టు రికార్డు చేసింది. బాధ్యత గల మహిళా మంత్రి అయి ఉండి మరో స్త్రీ, ఇతరుల వ్యక్తిగత విషయాలపై అవాస్తవాలను ప్రచారం చేయడం ఎంత మాత్రం భావ్యం కాదని సత్యవతి అన్నారు. భవిష్యత్తులో సురేఖ ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా కోర్టు గట్టి చర్యలు తీసుకోవాలని బాల్క సుమన్, ఉమ తమ వాంగ్మూలాల్లో చెప్పారు. అనంతరం తదుపరి విచారణ ఈనెల 20కి వాయిదా పడింది. ఈ కేసుల విషయమై టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ తిరుపతి వర్మ మాట్లాడుతూ.. ఇవన్నీ పూర్తిగా రాజకీయ ప్రేరేపిత దావాలన్నారు. నాగార్జున దావా పరువు నష్టం కిందకు రాదని, ఆ కేసు నిలబడదని చెప్పారు. ఇటు హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో వేసిన రూ.100 కోట్ల సివిల్ పరువు నష్టం దావాపై కూడా కౌంటర్ వేశామని తెలిపారు.

ఐఏఎస్‌గా చంద్రశేఖర్‌రెడ్డి

హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నాన్ స్టేట్ సివిల్ సర్వీస్ (ఎస్ఎస్‌సీఎస్) కోటా కింద రాష్ట్ర సహకార శాఖలో పని చేస్తున్న కె.చంద్రశేఖర్‌రెడ్డి ఐఏఎస్ అధికారిగా ఎంపికయ్యారు. ఎంపిక జాబితా-2023 మేరకు ఆయనను ఐఏఎస్‌గా కన్‌ఫర్డ్ చేస్తూ కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి బుధవారం ఉత్తర్వులను పంపించింది. తెలంగాణ క్యాడర్‌లో ప్రస్తుతానికి ప్రొబేషనరీ అధికారిగా కొనసాగుతారని స్పష్టం చేసింది.

పీఆర్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సృజన



హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ(పీఆర్) కమిషనర్‌గా సృజన బాధ్యతలు స్వీకరించారు. 2013 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆమె ఆంధ్రప్రదేశ్ నుంచి రిలీవ్‌అయి తెలంగాణకు వచ్చారు. ఇక్కడ పీఆర్ కమిషనర్‌గా కొనసాగుతున్న అనితా రాంచంద్రన్.. తాజాగా చేసిన బదిలీల్లో మహిళా శిశుసంక్షేమ శాఖ, ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శిగా వెళ్లారు. ఆమె స్థానంలో కమిషనర్‌గా సృజన బుధవారం పీఆర్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

నారాయణ ఏఐ టూల్ 'ఆస్త్రా' ఆవిష్కరణ

- విద్యార్థుల ప్రశ్నలకు కేవలం 30 సెకన్లలో జవాబు

హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ లెర్నింగ్‌ను మరింత సులభతరం చేసేందుకు నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో మరో అధునాతన ఏఐ టూల్ 'ఆస్త్రా'ను ఆవిష్కరించారు. ఎన్ లెర్న్ ప్లాట్‌ఫామ్‌ను మరింత మెరుగుపరుస్తూ విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆస్త్రా అనేది ఏఐ ఆధారిత చాట్‌బాట్ అని, విద్యార్థులు ప్రశ్నలు అడిగిన కేవలం 30 సెకన్లలోపే తిరిగి సమాధానాలను అందిస్తుందని నారాయణ విద్యాసంస్థల అధినేత పునీత్ కొత్తప తెలిపారు. ఇప్పటికే దాదాపు 15,000 మంది విద్యార్థులకు సేవలందించి 91 శాతం విద్యార్థులతో 5 స్టార్ రేటింగ్‌ను పొందిందని పునీత్ పేర్కొన్నారు.

హైదరాబాద్ నుంచి శబరిమలకు 26 ప్రత్యేక రైళ్లు

- 17 నుంచి డిసెంబరు 2 వరకు భక్తులకు అందుబాటులో

హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): శబరిమల అయ్యప్ప భక్తులకు దక్షిణ మధ్య రైల్వే తీపి కబురు చెప్పింది. జ్యోతి దర్శనం కంటే ముందుగానే శబరిమల వెళ్లే ప్రయాణికుల కోసం హైదరాబాద్ నుంచి 26 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఈ ప్రత్యేక రైళ్లు ఈ నెల 17వ తేదీ నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయని సీపీఆర్ఓ శ్రీధర్ తెలిపారు. కాచిగూడ-కొట్టాయం మార్గంలో 10, నాందేడ్-కొల్లాం మార్గంలో 1, కొల్లాం-సికింద్రాబాద్ మార్గంలో 1, కొల్లాం-మౌలాలి మార్గంలో 2, మౌలాలి-కొల్లాం మార్గంలో 2 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నామని ఆయన వెల్లడించారు.

ప్రత్యేక బస్సుల్లోనే 50 శాతం అదనపు చార్జీలు

- కార్తీక పౌర్ణమి రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు: ఆర్టీసీ

హైదరాబాద్, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి రద్దీకి అనుగుణంగా ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక బస్సుల్లోనే సాధారణ చార్జీలకు అదనంగా 50 శాతం వసూలు చేస్తున్నట్టు టీజీఎస్ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. ఈ మేరకు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ జీవో ప్రకారం హైదరాబాద్‌తో పాటు జిల్లా కేంద్రాల నుంచి నడిచే ప్రత్యేక బస్సుల్లో సవరించిన చార్జీలు వర్తిస్తాయన్నారు. స్పెషల్ బస్సులు మినహా మిగతా బస్సుల్లో సాధారణ చార్జీలే అమల్లో ఉంటాయని స్పష్టం చేశారు. కార్తీక పౌర్ణమి దృష్ట్యా ప్రత్యేక బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్‌ను tgsrtcbus.in వెబ్‌సైట్‌లో చేసుకోవచ్చని సూచించారు. మరిన్నీ వివరాలకు ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 సంప్రదించాలన్నారు.

వ్యవసాయ భూముల్లో సౌర విద్యుత్తు పంట!

రాష్ట్రంలో 4వేల మెగావాట్ల సోలార్ విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం

- స్వయం సహాయక సంఘాలకు ప్రాధాన్యం
- యూనిట్ విద్యుత్తు రూ.3.13 చొప్పున ధరకు కొనుగోలు చేయనున్న డిస్కమ్‌లు
- 6 ఎకరాలుంటే ఏటా 25 లక్షల ఆదాయం

హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సౌరవిద్యుత్తు ఉత్పత్తికి ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం.. ఇకపై రైతుల వ్యవసాయ భూముల్లో సోలార్ విద్యుత్తు ప్లాంట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రధాన మంత్రి కిసాన్ ఉర్జా సురక్షా ఎవమ్ ఉత్థాన్ మహాభియాన్ (పీఎం కుసుమ్)లో భాగంగా రాష్ట్రంలోని వ్యవసాయ భూముల్లో ఈ ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. రాష్ట్రంలో ఏడాదికి 300 రోజులపాటు సౌరవిద్యుత్తు ఉత్పాదనకు అనుకూలత ఉండటంతో ఈ నిర్ణయం తీసుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 4వేల మెగావాట్ల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. ఈ పథకాన్ని అమలు చేయడానికి తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీరెడ్‌కో)ను ఏజెన్సీగా నియమిస్తూ ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, పీఎం కుసుమ్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం గతంలోనే అమల్లోకి తెచ్చింది. దీని కింద 2026 డిసెంబరు 31 నాటికి దేశవ్యాప్తంగా వ్యవసాయ భూముల్లో 30,800 మెగావాట్ల సౌర విద్యుత్తును ఉత్పత్తి చేయాలనేది ప్రభుత్వం లక్ష్యం. ఈ పథకంలో ఏ, బీ, సీ కాంపోనెంట్లు ఉండగా.. రైతులు వాణిజ్య ఉత్పాదన కోసం సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవడానికి కాంపోనెంట్-ఏలో వెసులుబాటు ఉంది. 0.5 మెగావాట్ నుంచి 2 మెగావాట్ల దాకా ప్లాంట్‌లు పెట్టుకోవడానికి ప్రభుత్వం వెసులుబాటు ఇవ్వనుంది. రాష్ట్రంలో సోలార్ విద్యుత్తు ప్లాంట్లు పెట్టడానికి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సిద్ధంగా ఉన్నప్పటికీ.. రైతాంగానికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.



రూ.3.13కు యూనిట్ చొప్పున కొనుగోలు..


రైతుల వ్యవసాయ భూముల్లో ఏర్పాటు చేసే సోలార్ ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తును యూనిట్‌కు రూ.3.13 చొప్పున ధరకు డిస్కమ్‌లతో ప్రభుత్వమే కొనుగోలు చేయిస్తుంది. ఈ మేరకు యూనిట్ ధరను తెలంగాణ విద్యుత్తు నియంత్రణ మండలి (టీజీఈఆర్‌సీ) ఇదివరకే ఖరారు చేసింది. రైతులు తాము ఉత్పత్తి చేసిన విద్యుత్తును వ్యవసాయ అవసరాలకు వాడుకోగా.. మిగిలిన విద్యుత్తును డిస్కమ్‌లకు విక్రయించడానికి ఈ పథకంలో వెసులుబాటు ఉంది. కాగా, 33/11 కేవీ సబ్‌స్టేషన్ల వారీగా ఏయేచోట ఎంత మేర సౌరవిద్యుత్తు ప్లాంట్లు పెట్టుకోవడానికి అవకాశం ఉందో డిస్కమ్‌లు నోటిఫై చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత రైతుల నుంచి రెడ్‌కో దరఖాస్తులు స్వీకరించనుంది. అయితే రైతులు స్వయంగా లేదా సంఘాలుగా ఏర్పడటం, సహకార సంఘాల ద్వారా లేదా స్వయం సహాయక సంఘాలు లేదా మండల సమాఖ్యల ద్వారా ప్లాంట్లు పెట్టుకోవడానికి అవకాశం ఉంటుంది. భూములను లీజుకు తీసుకోవడం ద్వారా కూడా ప్లాంట్లు పెట్టుకునేందుకు వీలుంటుంది. సౌరఫలకాలు పెట్టే సంస్థల జాబితాను సిద్ధం చేయడం, వాటి ఏర్పాటుకు ఎంత వసూలు చేస్తారనే వివరాలను ప్రభుత్వానికి అందజేసే బాధ్యతను నోడల్ ఏజెన్సీగా ఉన్న రెడ్‌కో నిర్వహిస్తుంది. ప్లాంట్లు పెట్టుకోవడానికి వీలుగా బ్యాంకుల నుంచి ఒప్పందాలు చేయించే బాధ్యత కూడా రెడ్‌కోదే.

స్వయం సహాయక సంఘాలకే తొలి ప్రాధాన్యం

పీఎం కుసుమ్ కింద రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ సంఘాలసభ్యుల్లో ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో రైతు కుటుంబాలకు చెందినవారే ఉండటంతో వారి ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. ఈ సంఘాలకు రుణాలు కూడా పావలా వడ్డీకే లభిస్తాయి. కాగా, ఒక మెగావాట్ ప్లాంట్ పెట్టుకుంటే ఏడాదికి సగటున 15 లక్షల యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. ఈ లెక్కన ఏడాదికి రూ.45 లక్షల దాకా ఆదాయం వస్తుంది. ఒక మెగావాట్ ప్లాంట్ పెట్టడానికి సౌరఫలకాలతోపాటు పరికరాలకు రూ.3 కోట్ల నుంచి రూ.3.5కోట్ల దాకా వ్యయమవుతుంది. స్వయం సహాయక సంఘాల ద్వారా బ్యాంకుల నుంచి రుణం తీసుకుంటే.. ఏటా ప్లాంట్ల నిర్వహణ వ్యయానికి రూ.50 వేల నుంచి రూ.లక్ష దాకా అయ్యే అవకాశముంది. ఇలా.. ఒక మెగావాట్ ప్లాంట్ ఏర్పాటుకు బ్యాంకు రుణం, వడ్డీ, నిర్వహణ వ్యయం పోను ఏటా రూ.25 లక్షల దాకా ఆదాయం వస్తుందని అంచనా. ఒక మెగావాట్ ప్లాంట్ పెట్టడానికి 6 ఎకరాల భూమి అవసరం. ఈ లెక్కన ఏడాదికి ఎకరాకు రూ.4.5 లక్షలకుపైగా ఆదాయం సమకూరుతుంది. ఈ పథకాన్ని అమలు చేసినందుకు డిస్కమ్‌లకు కేంద్రం మెగావాట్‌కు రూ.6.6 లక్షల దాకా ప్రొక్యూర్‌మెంట్ ఆధారిత ప్రోత్సాహకం (పీబీఐ) అందించనుంది.

ధాన్యం సేకరణలో ఇబ్బందులు కలగొద్దు


- అధికారులు సమన్వయంతో పనిచేయాలి: మంత్రి తుమ్మల



హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ధాన్యం సేకరణకు నోడల్ ఏజెన్సీగా పనిచేస్తున్న పౌరసరఫరాలశాఖతో మార్కెటింగ్ శాఖ అధికారులు సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఎండీ ఉదయ్ కుమార్, ఆగ్రోస్ ఎండీ కావేటి రాములు, మార్కెటింగ్‌శాఖ అధికారులతో బుధవారం సచివాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా... ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సామాగ్రిని అందుబాటులో ఉంచాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లకు అనుగుణంగా గోదాముల్లో నిల్వ సామర్థ్యాన్ని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రస్తుతం 29 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా నిల్వ సామర్థ్యం ఉందని అధికారులు మంత్రికి తెలిపారు. కాగా, రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లకు అవసరమైన వస్త్రాల కోసం టెస్కోకు ఆర్డర్లు ఇవ్వాలని తుమ్మల సూచించారు. ఇప్పటికే ఆర్డర్లు ఇచ్చిన వస్త్రాల సరఫరాను త్వరగా పూర్తిచేయాలని చేనేతశాఖ అధికారులను ఆదేశించారు.

అద్దెకు బ్యాంకు ఖాతాలు!

- కమీషన్ల కోసం సైబర్ నేరగాళ్లకు అకౌంట్ వివరాలు
- తెలంగాణలో 48 మంది అరెస్టు
- రూ. 8.16 కోట్లు కొట్టేసిన ముఠా
- ముఠా సభ్యులపై రాష్ట్రంలో 508 కేసులు



హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కమీషన్ల కోసం కక్కుర్తిపడి సైబర్ నేరగాళ్లు లావాదేవీలు చేసుకునేందుకు బ్యాంకు ఖాతాలను ఇస్తోన్న ఓ ముఠాను తెలంగాణ పోలీసులు పట్టుకున్నారు. రాష్ట్రంలో నమోదైన 508 సైబర్ నేరాల్లో నిందితులుగా ఉన్న ఓ ముఠాకు చెందిన 48 మందిని అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో 10 మంది ఏజెంట్లు, కమీషన్ల కోసం బ్యాంకు ఖాతాలు ఇచ్చిన వారు 38 మంది ఉన్నారు. వీరిలో క్యాబ్ డ్రైవర్లు, చిరుద్యోగులతోపాటు ఐటీ ఉద్యోగులు కూడా ఉన్నారు. వీరి నుంచి 53 సెల్‌ఫోన్లు, 4 ల్యాప్‌టాప్‌లు, 18 బ్యాంకు పాస్ పుస్తకాలు, 16 చెక్‌బుక్‌లు, ఏటీఎం కార్డులు ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టులకు సంబంధించిన వివరాలను సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎస్‌బీ) డైరెక్టర్ శిఖా గోయల్ బుధవారం విలేకరులకు వెల్లడించారు. తాము అరెస్టు చేసిన వారిపై దేశవ్యాప్తంగా 2,194 కేసులు ఉన్నాయన్నారు. ఈ ముఠా ప్రజలను మోసగించి రూ.8.16 కోట్లు కొల్లగొట్టిందని చెప్పారు.

కమీషన్లకు ఆశపడి..

సైబర్ నేరగాళ్ల కోసం రాష్ట్రంలో ఏజెంట్లు పనిచేస్తున్నారు. ఆధార్ కార్డు, ఇతర గుర్తింపు వివరాలు సేకరించి ఈ ఏజెంట్లే బ్యాంకుల్లో కరెంట్ అకౌంట్లు తెరుస్తుంటారు. ఇందుకుగాను సైబర్ నేరగాళ్లు తమకు ఖాతా ఇచ్చిన వారికి కమీషన్ కింద కొంత మొత్తం చెల్లిస్తుంటారు. ఒక్కో ఖాతాను గరిష్ఠంగా మూడు నెలలే వాడే సైబర్ నేరగాళ్లు ఒక్కో ఖాతాలో 2 లేదా 3 లావాదేవీలు మాత్రమే చేస్తారు. ప్రధాన నిందితులు ఇంటర్నెట్ బ్యాంకింగ్ సాయంతో ఏజెంట్లు, ఖాతాలు సమకూర్చిన వారికి కమీషన్ బదిలీ చేసి మిగిలిన మొత్తాన్ని అంతర్జాతీయ ఖాతాల్లోకి మళ్లిస్తుంటారు.

ఖమ్మం వాసిపై 688 కేసులు..!

కమీషన్ కోసం సైబర్ నేరగాళ్లకు తమ బ్యాంకు ఖాతాలను ఇచ్చిన వారిలో ఖమ్మం జిల్లాకు చెందిన కొండల్‌రావు అనే వ్యక్తిపై దేశ వ్యాప్తంగా 688 కేసులు నమోదయ్యాయి. కొండల్ రావు తన భార్య ఖాతాను కూడా సైబర్ నేరగాళ్లకు ఇచ్చాడని, వీరి ఖాతాల నుంచి కోట్ల రూపాయలు దారిమళ్లాయని పోలీసులు గుర్తించారు. అలాగే, హైదరాబాద్, హఫీజ్‌పేట్ ప్రాంతానికి చెందిన అక్షయ్ కుమార్‌పై దేశవ్యాప్తంగా 136 కేసులు నమోదయ్యాయి. కమీషన్ల కోసం సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు సమకూర్చి అరెస్టయిన వారిలో క్యాబ్ డ్రైవర్ల నుంచి ఐటీ ఉద్యోగుల వరకు వివిధ వర్గాల వారున్నారు. ఇప్పటిదాకా అరెస్టయిన వారి బ్యాంకు ఖాతాల్లో జరిగిన లావాదేవీల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అలాగే ఆయా బ్యాంకుల అధికారుల పాత్రపై కూడా వారు దృష్టి సారించారు.

సీఎం అల్లుడికి భూమి కేటాయించినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తా

» కేటీఆర్‌కు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సవాల్

హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ ఫార్మా విలేజ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అల్లుడి కంపెనీకి భూమిని కేటాయించినట్లు నిరూపిస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానంటూ కేటీఆర్‌కు.. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సవాల్ విసిరారు. లేని పక్షంలో కేటీఆర్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలన్నారు. సీఎం రేంత్‌రెడ్డి తన అల్లుడి కంపెనీ కోసమే కొడంగల్‌లో ఫార్మా విలేజ్‌కు భూమిని సేకరిస్తున్నారంటూ కేటీఆర్ ఆరోపణలపైన రామ్మోహన్‌రెడ్డి ఈ మేరకు స్పందించారు. కొడంగల్ ఫార్మా విలేజ్‌లో భూమి కోసం ఇప్పటి వరకు ఏ ఒక్కరూ దరఖాస్తు చేసుకోలేదన్నారు. అక్కడ కాలుష్యరహిత ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. వెనుకబడిన కొడంగల్, పరిగి లాంటి నియోజకవర్గాల్లో పరిశ్రమలు రావాల్సిన అవసరం లేదా? అన్ని పరిశ్రమలూ సిరిసిల్ల, సిద్దిపేటలకే రావాలా? అంటూ నిలదీశారు. సీఎల్పీ మీడియా హాల్లో బుధవారం ఈ మేరకు మాట్లాడారు.

రైతుల్ని ఒప్పించే భూ సేకరణ: విప్ రామచంద్ర

హైదరాబాద్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కొడంగల్ ఫార్మా విలేజ్‌కు రైతుల్ని ఒప్పించే భూ సేకరణ జరుగుతోందని ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్ అన్నారు. రైతుల వేశాల్లో ఉన్న బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలే కలెక్టర్, అధికారులపైన దాడి చేశారని ఆరోపించారు. దాడులు చేయడమే బీఆర్ఎస్ సంస్కృతన్నారు. అసెంబ్లీ మీడియా హాల్లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే యన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి రామచంద్రనాయక్ మాట్లాడారు. కొడంగల్‌లో మొత్తం 6 వందల ఎకరాల్లో ఫార్మా క్లస్టర్ రాబోతోందని, ఇందులో 200 ఎకరాలు గ్రీన్ ఏరియాలో ఉంటుందని చెప్పారు. ఇప్పటి వరకు రైతులు 120 ఎకరాలు ఇచ్చారని తెలిపారు. ఈ ఫార్మా విలేజ్‌తో రూ. 15 వేల కోట్ల పెట్టుబడులు, 30 వేల ఉద్యోగాలు రానున్నాయని రామచంద్రనాయక్ చెప్పారు. అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ ప్రధానిని, కేంద్ర మంత్రులను కలవని కేటీఆర్.. ఇప్పుడు అరెస్టుకు భయపడే ఢిల్లీకి వెళ్లారని యన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ఖలిస్థాన్ ఉగ్రవాదులు దేశానికి ఎంత ప్రమాదమో, కల్వకుంట్ల కుటుంబం తెలంగాణకు అంత ప్రమాదమని విమర్శించారు.

అబద్ధానికి ప్యాంటు, చొక్కా తొడిగితే.. కేటీఆర్

» ఈరవత్రి అనిల్ కుమార్

అబద్ధానికి ప్యాంటు, చొక్కా తొడిగితే అది కేటీఆర్ అని మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ఈరవత్రి అనిల్‌కుమార్ ఎద్దేవాచేశారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రకటనలను చూపించి.. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన ప్రకటనలంటూ కేటీఆర్ అబద్ధాలు చెప్పడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ ఖజానాను దోపిడీ.. దుర్వినియోగం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆరోపించారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.

ప్రభుత్వ తీరు వల్లే లగచర్ల రచ్చ: డీకే అరుణ



వికారాబాద్/పూడూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ తీరు వల్లే లగచర్ల ఘటన చోటు చేసుకుందని ఎంపీ డీకే అరుణ ఆరోపించారు. లగచర్లలో 144 సెక్షన్, శాంతిభద్రతల సమస్య ఎందుకొచ్చిందో తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధి కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నప్పుడు రైతులకు అర్థమయ్యే రీతిలో చెప్పి ఒప్పించి ప్రాజెక్టులు తీసుకురావాలని అభిప్రాయపడ్డారు. వికారాబాద్ కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను బుధవారం కలిసిన ఆమె.. లగచర్ల ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇప్పటికైనా సీఎం లగచర్లకు వెళ్లి రైతులకు భరోసా కల్పించాలని, వారు కోరుకునే పరిహారం అందించి ప్రాజెక్టులు చేపట్టాలని సూచించారు. పరిశ్రమలను ఎవరూ అడ్డుకోరని, ప్రజలకు ఇబ్బందులు కలిగించే పరిశ్రమలు రావద్దన్నారు. అనంతరం లగచర్లకు వెళ్తున్న ఎంపీ అరుణను మన్నెగూడ వద్ద చెన్‌గోముల్ పోలీసులు అడ్డుకున్నారు. దాంతో బీజేపీ కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోలీసుల తీరుపై అరుణ ఆగ్రహం వ్యక్తం చేశారు.

కక్ష పూరితంగా అక్రమ కేసులు: మెతుకు ఆనంద్

వికారాబాద్/పూడూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బేషజాలకు పోయి.. కక్షపూరితంగా బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు నమోదు చేయిస్తున్నారని బీఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్, మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్‌లో పట్నం నరేందర్‌రెడ్డిని అరెస్టు చేసిన పోలీసులు.. వికారాబాద్ డీటీసీకి తరలించారు. విషయం తెలుసుకున్న ఆనంద్, మహేశ్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి డీటీసీకి చేరుకుని, నరేందర్‌రెడ్డితో భేటీ అయ్యారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ లగచర్లలో తమపై దాడి జరగలేదని కలెక్టరే స్వయంగా చెబుతుంటే.. పట్నం నరేందర్‌రెడ్డిని సహా పలువురిని అరెస్టు చేయాల్సిన అవసరమేంటని ప్రశ్నించారు. రైతుల్లో అన్ని పార్టీల వారు ఉన్నారని, కేవలం బీఆర్ఎస్‌కు చెందిన వారినే అరెస్టు చేయడం తగదని అన్నారు. ఓ పంచాయతీ కార్యదర్శికి సంబంధం లేకున్నా అరెస్ట్ చేశారని మండిపడ్డారు.

ఆ కంపెనీ రేవంత్ బావమరిదిదే: రాణి రుద్రమ

హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): లగచర్లలో పెట్టాలనుకుంటున్న ఔషధ పరిశ్రమ సీఎం రేవంత్‌రెడ్డి బావమరిది సృజన్‌రెడ్డిదని బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ ఆరోపించారు. అడికోర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో అతను భాగస్వామని పేర్కొన్నారు. కంపెనీ ఏర్పాటు చేసినప్పుడు రేవంత్ కూడా అందులో భాగస్వామిగా ఉన్నారని, తరువాత కొంతకాలానికి ఆయన వాటాను సృజన్‌రెడ్డి పేరుమీదకు మార్చారన్నారు. రేవంత్‌కు, కల్వకుంట్ల కవితకు సృజన్ బినామీగా ఉంటూ అనేక వ్యాపారాలు చేస్తున్నారని ఆరోపించారు. కల్వకుంట్ల, రేవంత్ కుటుంబాలు కలిసి తెలంగాణను దోచుకుంటున్నాయని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ రెండు ఒకటే: ఎంపీ చామల

న్యూఢిల్లీ, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని మహారాష్ట్ర ఎన్నికలు, లగచర్ల ఘటనతో మరోసారి రుజువైందని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి ఆరోపించారు. మహారాష్ట్రలో బీజేపీ గెలుపు కోసం బీఆర్ఎస్ కృషి చేస్తుందని విమర్శించారు. లగచర్ల ఘటనపై బీఆర్ఎస్ నాయకుల ఆరోపణలకు బీజేపీ మద్దతుగా నిలవడం సిగ్గుచేటన్నారు. బుధవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. గడిచిన పదేళ్లలో కలెక్టర్లపై దాడులు జరగలేదని బీఆర్ఎస్ అంటోందని, తాము బాధ్యత కలగిన ప్రతిపక్షంగా ఉన్నామని, అందుకే ఎటువంటి అసాంఘిక చర్యలకు పాల్పడలేదని చెప్పారు. ఫార్ములా-ఈ కేసు నుంచి తప్పించుకోవడానికే కేటీఆర్ ఢిల్లీ వచ్చారని ఆరోపించారు. సృజన్‌రెడ్డి రేవంత్ బావమరిది కాదని బీఆర్ఎస్ నేత కందాల ఉపేందర్‌రెడ్డి సొంత అల్లుడన్నారు.

ట్రాఫిక్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన సిద్దిపేట ఏసీపీ, మరో ముగ్గురిపై కేసు నమోదు

యూసుఫ్‌గూడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన సిద్దిపేట ఏసీపీతోపాటు మరో ముగ్గురిపై మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ పీఎస్ ఎస్సై కాంతారావు తన సిబ్బందితో కలిసి మంగళవారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. అర్ధరాత్రి 11.30 గంటలకు మైత్రీవనం నుంచి ఎస్సార్‌నగర్ వైపునకు ఓ కారు వచ్చింది. ట్రాఫిక్ పోలీసులను చూసి డ్రైవింగ్ సీటులో ఉన్న వ్యక్తి పక్కసీటులోకి మారారు. ఇది గమనించిన మహిళా కానిస్టేబుల్.. ఎస్సై కాంతారావుకు తెలిపింది. ఆయన డ్రైవింగ్ చేసిన వ్యక్తిని బ్రీత్ అనలైజర్‌లో ఊదమని కోరగా.. ఊదనని చెప్పాడు. అప్పుడు ఎస్సై వద్దకు వచ్చిన సుమన్‌కుమార్ తాను సిద్దిపేట ఏసీపీనని, కేసు లేకుండా పంపాలని సూచించారు. కాంతారావు కుదరదనడంతో ఏసీపీ సుమన్‌కుమార్ ఆవేశంతో ఆయన్ను నెట్టడంతోపాటు కారులో ఉన్నవారంతా కలిసి న్యూసెన్స్ చేశారు. ఈ మేరకు ఏసీపీతోపాటు డ్రైవర్ ఎన్.జైపాల్‌రెడ్డి, కారులో ఉన్న ఎస్.శ్రీనివాస్, జి.వెంకట్‌రావుపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

లగచర్ల దాడిలో కేటీఆర్ ప్రమేయం!

(మొదటిపేజీ తరువాయి)

భారతీయ నాగరిక్ సురక్ష సంహిత(బీఎన్ఎస్ఎస్), పీడీపీపీ చట్టాల కింద.. హత్యాయత్నం, దాడి, అధికారిక విధుల అడ్డగింత తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నరేందర్‌రెడ్డి రిమాండ్ రిపోర్ట్‌లో కేటీఆర్ ఆదేశాలతోనే ఈ కుట్రను అమలు చేశారని స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లో అరెస్టు..

నరేందర్‌రెడ్డి బుధవారం ఉదయం 6 గంటల సమయంలో జూబ్లీహిల్స్‌లోని కేబీఆర్ పార్క్‌లో వాహ్యాళిలో ఉండగా.. వికారాబాద్ టాస్క్‌ఫోర్స్, ప్రత్యేక పోలీసు బృందాలు అరెస్టు చేశాయి. అక్కడి నుంచి నేరుగా వికారాబాద్‌లోని పోలీసు శిక్షణ కేంద్రానికి తరలించాయి. ఉదయం 8.30 నుంచి 1.30 వరకు.. ఐదుగంటల పాటు నరేందర్‌రెడ్డిని డీఎస్పీ స్థాయి అధికారి నేతృత్వంలోని దర్యాప్తు బృందం విచారించింది. ఆ తర్వాత తమ వద్ద ఉన్న సాంకేతిక ఆధారాలను ఆయన ముందు పెట్టి.. పలు ప్రశ్నలు సంధించింది. అదే సమయంలో.. జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, ఆ తర్వాత మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ కూడా నరేందర్‌రెడ్డిని విడివిడిగా విచారించారు. "అధికారులపై దాడికి ముందు బోనగాని సురేశ్ రాజ్‌తో ఏం మాట్లాడారు? కర్రలు, కారంపొడిని సిద్ధం చేసుకోవాలని గ్రామస్థులను ప్రోత్సహించారా? దాడి జరిగిన తర్వాత సురేశ్ కాల్ చేశాడా? ఇప్పుడు అతను ఎక్కడ ఉన్నాడు?" అని ప్రశ్నించినట్లు తెలిసింది. అయితే.. నరేందర్‌రెడ్డి విచారణకు సహకరించలేదని తెలిసింది. పలు ప్రశ్నలకు "తెలియదు".. "నాకు సంబంధం లేదు".. "కాదు".. అని ముక్తసరి సమాధానాలు చెప్పినట్లు సమాచారం. "ఎమ్మెల్యేగా పనిచేశాను. కార్యకర్తలు ఫోన్ చేస్తుంటారు. ప్రతి ఒక్కరి ఫోన్‌ను ఆన్సర్ చేస్తాను" అని పేర్కొన్నట్లు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. దర్యాప్తునకు సహకరించకపోవడంతో.. తమ వద్ద ఉన్న సాంకేతిక ఆధారాలను ముందు పెట్టిన పోలీసులు.. నరేందర్‌రెడ్డిని అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం నరేందర్‌రెడ్డిని పరిగి మీదుగా కొడంగల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించాక.. కొడంగల్ కోర్టులో హాజరుపరిచారు. అప్పటికే పోలీసులు అక్కడ రిజర్వ్ బలగాలతో భారీ భద్రతను ఏర్పాటు చేశారు. నరేందర్‌రెడ్డి తరఫున బీఆర్ఎస్ లీగల్‌సెల్ న్యాయవాదులు వాదనలను వినిపించారు. వాదోపవాదాలను నమోదు చేసుకున్న జడ్జి.. నరేందర్‌రెడ్డికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య నరేందర్‌రెడ్డిని చర్లపల్లి జైలుకు తరలించారు. ఈ కేసులో మంగళవారం 16 మంది రిమాండ్‌కు వెళ్లగా.. బుధవారం నరేందర్‌రెడ్డితోపాటు శివ(ఏ-3), బోగమోని మహేశ్(ఏ-21), బేగరి విశాల్(ఏ-22), నీరటి సాయిలు(ఏ-24), నీరటి రమేశ్(ఏ-27)లను పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. కాగా.. కొడంగల్ కోర్టు వద్ద పలువురు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలిచ్చారు.



పట్నం నరేందర్‌రెడ్డిని అరెస్టు చేసి వాహనంలో తరలిస్తున్న పోలీసులు

కుట్రపూరితంగా నరేందర్‌రెడ్డిని అరెస్టు చేశారని ఆరోపించారు. అటు కొడంగల్ నియోజకవర్గంలో ఇంటర్నెట్ సేవల బంద్ కొనసాగుతోంది. దీంతో.. బుధవారం కూడా మీసేవా కేంద్రాలు, బ్యాంకులు పనిచేయలేదు.

సురేశ్‌పై.. మైనర్ బాలికపై అత్యాచార అభియోగం!

ఈ కేసులో ప్రధాన నిందితుడు బోనగాని సురేశ్‌ను అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. అతను పొరుగు రాష్ట్రంలో ఉన్నట్లు తెలుసుకుని, రెండు బృందాలు అక్కడికి చేరుకున్నాయి. ఒకట్రెండు రోజుల్లో సురేశ్ అరెస్టుకు అవకాశాలున్నట్లు తెలుస్తోంది. చిన్నతనం నుంచే సురేశ్‌పై వివాదాస్పదుడనే ముద్ర ఉంది. 15 ఏళ్ల క్రితం అతను ఓ మైనర్ బాలికపై అత్యాచారం చేశాడనే అభియోగముంది. అప్పట్లో పెద్దలు పంచాయితీ పెట్టి, జరిమానాతో సరిపెట్టినట్లు సమాచారం. ఆ తర్వాత హైదరాబాద్‌కు మకాంమార్చి.. అక్కడే పెళ్లి చేసుకుని, స్థిరపడ్డాడు. పట్నం నరేందర్‌రెడ్డి కొడంగల్‌కు వచ్చాక.. సురేశ్ ఈ ప్రాంతంలో రాకపోకలను పెంచుకున్నాడు. నరేందర్‌రెడ్డికి అనుచరుడిగా ఉంటూ.. దుద్యాల మండల బీఆర్ఎస్‌లో కీలకంగా ఉన్నాడు.

సూత్రధారి నరేందర్‌రెడ్డి: ఐజీ సత్యనారాయణ



లగచర్ల ఘటన వెనక సూత్రధారి మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అని మల్టీజోన్-2 ఐజీ వి.సత్యనారాయణ స్పష్టం చేశారు. బుధవారం సాయంత్రం ఆయన కలెక్టరేట్ వద్ద ఎస్పీ నారాయణరెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. "తొలుత సురేశ్ ప్రధాన సూత్రధారి అని భావించాం. కానీ, సాంకేతిక ఆధారాలను సేకరించిన తర్వాత.. పట్నం నరేందర్‌రెడ్డి పాత్ర వెలుగులోకి వచ్చింది. ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన అధికారులపై దాడికి ఉసిగొల్పింది ఆయనే. ఆయన ఆదేశాలతోనే సురేశ్ స్థానికులతో కలిసి దాడికి పాల్పడ్డాడు" అని వివరించారు. ఇంకా ఈ కేసులో సురేశ్‌రాజ్, దేవదాస్, గోపాల్‌నాయక్, విఠల్ కీలక నిందితులని, వారిని అరెస్టు చేసేందుకు 4 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. "ప్రత్యక్ష సాక్షులు, ప్రాథమిక ఆధారాల మేరకు.. ఇప్పటి వరకు గుర్తించిన నిందితుల్లో 19 మందికి ఈ ప్రాంతంలో అసలు భూములే లేవు. ఫార్మా క్లస్టర్ భూసేకరణతో వారికి ఎలాంటి నష్టం జరగదు. భూసేకరణ నోటిఫికేషన్‌లోనూ వారి పేర్లు లేవు. ఉద్దేశపూర్వకంగా కలెక్టర్‌ను తప్పుదోవ పట్టించి, లగచర్లకు తీసుకువచ్చిన సురేశ్, అతని సోదరుడు మహేశ్‌కు కూడా భూముల్లేవు. అసలు సురేశ్, దేవదాస్ అనే వ్యక్తులు స్థానికంగా ఉండనేఉండరు. ఒక పక్కా ప్రణాళిక ప్రకారం కుట్రను అమలు చేసి, అధికారులపై దాడి చేశారు. తొలుత 57మందిని అదుపులోకి తీసుకుని, విచారించాం. వారిలో చాలామంది అధికారులపై దాడిని అడ్డుకునే ప్రయత్నం చేశారు" అని పేర్కొన్నారు. సురేశ్ ఓ మైనర్ బాలికపై లైంగిక దాడి చేశాడనే అభియోగాలపైనా దృష్టిసారిస్తామన్నారు. అమాయకులనెవరినీ అరెస్టు చేయడం లేదని వివరించారు. కాగా.. కలెక్టర్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలోనూ ఈ అంశాలే ఉన్నాయి. అధికారులపై దాడి చేసిన వారిలో 17మందికి ఎలాంటి భూములు లేవని కలెక్టర్ వెల్లడించారు. వీరే ముందుండి దాడులకు పాల్పడ్డారని పేర్కొన్నారు. నరేందర్‌రెడ్డి ఫోన్‌ను సీజ్‌చేసి, విశ్లేషణకు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపామని వివరించారు.

బీఆర్ఎస్ విధ్వంస రచనను అడ్డుకుంటాం: తిరుపతిరెడ్డి

కొడంగల్‌లో బీఆర్ఎస్ చేస్తున్న విధ్వంస రచనను అడ్డుకుని, అభివృద్ధిని కొనసాగిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు, కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి అన్నారు. అధికారులపై జరిగిన దాడి ఘటనను నిరసిస్తూ.. బుధవారం ఆయన లగచర్లలో విలేకరులతో మాట్లాడారు. దాడి వెనక ఉన్న కుట్రదారులు, సూత్రధారులు ఎంతటి వారైనా.. వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. "స్వాతంత్ర్యానంతర కాలం నుంచి కొడంగల్ అభివృద్ధికి నోచుకోలేదు. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తుంటే.. బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేక, అల్లరిచిల్లరగా తిరిగే యువకులను పోగుచేసి, వారికి మద్యం తాగించి, అధికారులపై దాడులు చేయించారు. కొడంగల్‌లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు కుట్ర పన్నుతున్నారు" అని తిరుపతిరెడ్డి ఆరోపించారు. ఈ ఘటనను కాంగ్రెస్ సర్కారు రాజకీయం చేయదలచుకోలేదని, పోలీసులు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు. కొడంగల్ అభివృద్ధిలో భాగంగానే ఇక్కడ ఫార్మా ఇండస్ట్రీ హబ్ రాబోతుందని వివరించారు. కొడంగల్ ఇప్పుడు కాకుంటే.. ఇంకెప్పుడూ అభివృద్ధి చెందదన్నారు. అధికారులపై దాడి చేసిన వారిలో రైతులెవరూ లేరని, అంతా విధ్వంసకారులేనన్నారు. కలెక్టర్ కూడా ఈ విషయాన్ని నిర్ధారించినట్లు తెలిపారు. మల్లన్నసాగర్ విషయంలో హరీశ్, కేటీఆర్ రాత్రికిరాత్రే ప్రజలను తరలించిన విషయాన్ని గుర్తుచేశారు.

ఎంత ఖర్చయినా ముందుకెళ్లండి?

కేటీఆర్-నరేందర్‌రెడ్డి మధ్య జరిగిన ఫోన్ సంభాషణకు సంబంధించిన ఆడియో రికార్డులను పోలీసులు సేకరించినట్లు తెలిసింది. దాడికి ముందు.. ఆ తర్వాత వీరిద్దరూ నాలుగు సార్లు ఫోన్‌లో మాట్లాడుకున్నట్లు పోలీసు శాఖలో విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. "ఎంత దూరమైనా వెళ్లండి. ఎంత ఖర్చయినా ఫర్వాలేదు. దాడుల విషయంలో ముందుకు వెళ్లాలి" అని కేటీఆర్ ఆదేశించినట్లు పేర్కొంటున్నాయి. మొత్తం 47 మంది నిందితులను గుర్తించినట్లు చెబుతున్న పోలీసులు.. పేర్లను వెల్లడించడం లేదు. అయితే.. ఆడియో రికార్డింగ్ ఆధారాలను కూడా సంపాదించిన నేపథ్యంలో.. న్యాయ నిపుణులతో చర్చించిన తర్వాత.. కేటీఆర్ పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

రిమాండ్ రిపోర్టులో కేటీఆర్ పేరు

పట్నం నరేందర్‌రెడ్డిని కోర్టులో హాజరుపరిచినప్పుడు పోలీసులు సమర్పించిన రిమాండ్ రిపోర్ట్‌లో మాజీ మంత్రి కేటీఆర్ పేరు ఉండడం సంచలనంగా మారింది. కేటీఆర్ ఆదేశాల మేరకే తాము పనిచేసినట్లు నిందితులు వాంగ్మూలమిచ్చినట్లు పోలీసులు ఆ రిపోర్ట్‌లో పేర్కొన్నారు. "కేటీఆర్ ఆదేశిస్తే.. నరేందర్‌రెడ్డి పాటిస్తూ.. వ్యూహాన్ని అమలు చేశారు. కుట్రలో భాగంగానే ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన కలెక్టర్, అదనపు కలెక్టర్, తహసీల్దార్, కడా అధికారి, డీఎస్పీపై దాడి చేశారు. నిందితుల కుట్ర ప్రకారం.. అధికారులను హత్య చేయాలనుకున్నా.. ఆ పథకం పూర్తిస్థాయిలో అమలు కాలేదు. అధికారులు గాయాలతో బయటపడ్డారు. ప్రాథమిక విచారణలో నరేందర్‌రెడ్డి కీలక విషయాలను వెల్లడించారు. కేటీఆర్, ఇతర నాయకుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకే దాడి చేశారు. దాడికి ముందు నుంచి.. ఆ తర్వాత పలుమార్లు నరేందర్‌రెడ్డి, కుట్రను అమలు చేసిన సురేశ్ ఫోన్‌లో మాట్లాడుకున్నారు" అని పోలీసులు రిమాండ్ రిపోర్టులో స్పష్టం చేశారు.

నేడు రాష్ట్రవ్యాప్త నిరసనలు

» అధికారులపై దాడులను ఖండిస్తూ ఉద్యోగుల జేఏసీ పిలుపు

» దాడులు విధులకు ఆటంకం కాదు: ఐఏఎస్ అధికారుల సంఘం

» కేటీఆర్.. మీకు పోలీస్ విధులు తెలియవా?: అధికారుల సంఘం

హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్, ఇతర అధికారుల మీద జరిగిన దాడికి నిరసనగా గురువారం రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు ఉద్యోగుల జేఏసీ పిలుపునిచ్చింది. అధికారులపై జరిగిన దాడిని తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, పింఛన్‌దారులు, కార్మికులు, ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల తరఫున ఖండిస్తున్నామని జేఏసీ ఛైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్‌రావు తెలిపారు. బుధవారం టీజీవో భవన్‌లో మీడియాతో వారు మాట్లాడారు. దాడులకు పాల్పడిన దోషులను శిక్షించాలని కోరుతూ గురువారం అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద, హైదరాబాద్‌లో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ నాయకత్వంలో నిరసనలు తెలపాలని పిలుపునిచ్చారు. నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని, భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేయాలని సూచించారు. దాడులు మరోసారి పునరావృతమైతే 10 లక్షల మంది ఉద్యోగులకు నాయకత్వం వహించే 206 ఉద్యోగ సంఘాల భాగస్వామ్యంతో ఉన్న జేఏసీ ఉద్యమ కార్యాచరణకు పిలుపునిస్తుందని హెచ్చరించారు. ఉద్యోగులకు రక్షణ కల్పించాలని, దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉద్యోగుల జేఏసీ, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు చంద్రమోహన్, ట్రెసా అధ్యక్ష, కార్యదర్శులు రవీందర్ రెడ్డి, గౌతమ్.. సంఘం నేతలతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారికి సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. ఇదే విషయమై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు ధర్నాలు చేయాలని వి.లచ్చిరెడ్డి నేతృత్వంలోని ఉద్యోగుల జేఏసీ ఓ ప్రకటన విడుదల చేసింది. అధికారులపై జరిగిన దాడిని ఖండించకపోగా కొందరు నాయకులు దాడికి పాల్పడిన వారిని పరామర్శించడం ప్రజాస్వామ్యానికే అవమానమని లచ్చిరెడ్డి పేర్కొన్నారు. కాగా, కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై జరిగిన దాడిని తెలంగాణ ఐఏఎస్ అధికారుల సంఘం ఖండించింది. ఈ విషయంలో ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ఐఏఎస్ అధికారుల సంఘం అధ్యక్షుడు శశాంక్ గోయెల్, కార్యదర్శి జయేశ్ రంజన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇలాంటి దాడులు.. అధికారుల విధులను ఏవిధంగానూ ఆటంక పర్చలేవని పేర్కొన్నారు. కాగా, పోలీస్ విధులపై మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యల్ని పోలీస్ అధికారుల సంఘం తప్పుబట్టింది. పదేళ్లు పరిపాలించిన వారికి పోలీస్ విధుల గురించి తెలియకపోవడం ఆశ్చర్యంగా ఉందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.గోపీరెడ్డి అన్నారు. పోలీస్ విధుల్లో జోక్యం చేసుకోవద్దని, పోలీస్ వ్యవస్థను తప్పుపట్టే ప్రయత్నాలు మానుకోవాలని సూచించారు.

కలెక్టర్‌పై దాడి.. బీఆర్ఎస్ కుట్రే

ఇందులో ఎంత పెద్ద వారున్నా ఉపేక్షించం.. ఇది పద్ధతేనా? కేసీఆర్ జవాబు చెప్పాలి: భట్టి

» దాడులపై బీజేపీ వైఖరేంటి?: పొన్నం

హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): లగచర్లలో కలెక్టర్, అధికారులపై దాడి బీఆర్ఎస్ కుట్రేనని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం అరాచక శక్తుల ద్వారా అమాయకులైన దళిత, గిరిజన రైతులను రెచ్చగొట్టి దాడి చేయించారని ధ్వజమెత్తారు. దాడి నేపథ్యంలో ఫోన్ కాల్స్ డేటాను పరిశీలించగా...బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన ఓడిన అభ్యర్థి ఈ తతంగం నడిపించినట్లు తేలిందన్నారు. సచివాలయంలో బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి భట్టి విలేకరులతో మాట్లాడారు. ఈ దాడి వెనుక ఎంతటి పెద్దవారున్నా ఉపేక్షించబోమని, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే... అధికారులకు వినతిపత్రాలు ఇవ్వడం, చర్చించడం, న్యాయస్థానాలకు వెళ్లడం వంటి అవకాశాలు ఉండగా... బీఆర్ఎస్ నాయకులు కుట్రపూరితంగా అమాయక రైతులను రెచ్చగొట్టి అధికారులపై దాడులు చేయించడం దుర్మార్గమని విమర్శించారు. రాష్ట్రంలో పరిశ్రమలు రావొద్దు, నిరుద్యోగులకు ఉద్యోగాలు రావొద్దు, అభివృద్ధి జరగొద్దనే దుర్మార్గ ఆలోచనతో ప్రతిపక్షం వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. "పదేళ్ల పాటు సీఎంగా ఉన్న కేసీఆర్‌ను అడుగుతున్నా.. ఇలా దాడులు చేయించడం కరెక్టేనా? ప్రతిపక్ష నాయకుడిగా బయటకు వచ్చి ఈ విషయంపై మాట్లాడండి. ఇలా దాడులు చేయించడంపై సమాజానికి ఏం సందేశమిస్తారు? దాడులు ఎటువైపు దారి తీస్తాయో మీకు తెలియదా?" అని ప్రశ్నించారు. అధికారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ఇలాంటి దాడులపై కఠినంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ పేద, బడుగు, బలహీన వర్గాల యువతను రెచ్చగొట్టిన బీఆర్ఎస్.. వారి ప్రాణాలు బలిగొందని విమర్శించారు. ఇప్పుడు అధికారం పోయేసరికి మళ్లీ అదే విధంగా దళిత, గిరిజన రైతులను రెచ్చగొడుతోందని ఆరోపించారు. కేసీఆర్ కేటీఆర్, హరీశ్‌రావు.. తలకిందులుగా తపస్సు చేసినా ప్రజా ప్రభుత్వాన్ని అస్థిరపర్చలేరని అన్నారు. ఫార్ములా-ఈ రేస్ కేసు నుంచి తప్పించుకోవడానికే కేటీఆర్ ఢిల్లీకి వెళ్లి బీజేపీ పెద్దలతో ఒప్పందం చేసుకున్నాడని భట్టి విమర్శించారు. ఆ ఒప్పందం కుదిరిన తర్వాతే మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేశారని పేర్కొన్నారు. గవర్నర్‌పై తమకు విశ్వాసం ఉందని, ఫార్ములా-ఈ కేసు విచారణలో ప్రభుత్వానికి సహకరిస్తారని ఆశిస్తున్నామన్నారు. గవర్నర్ తిరస్కరిస్తే చట్ట ప్రకారం ముందుకు వెళతామన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ లగచర్ల రైతుల అరెస్టును బీజేపీ నేతలు కిషన్‌రెడ్డి, డీకే అరుణ, ఈటల రాజేందర్ ఖండించారని, మరి అధికారులపై జరిగిన దాడి విషయంలో ఆ పార్టీ వైఖరేంటని ప్రశ్నించారు. దాడిని కేటీఆర్ ఖండించకపోగా... దాడిలో పాల్గొన్న సురేష్ తమ పార్టీ నాయకుడేనని, ఏం చేస్తారో చేసుకోండని మాట్లాడడం సిగ్గుచేటని అనానరు. ఇలాంటి నేతలు ప్రజలకు ఏం చెప్పదల్చుకున్నారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో లాఠీ దెబ్బలు తిన్నామే తప్ప తిరగబడలేదన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న భట్టి, పొన్నం

కుట్ర పూరితంగానే లగచర్ల దాడులు

» కుట్రదారులను విడిచిపెట్టేది లేదు

» మంత్రులు దుద్దిళ్ల, దామోదర

» దాడిలో గాయపడ్డ 'కడా' ప్రత్యేకాధికారికి పరామర్శ

చంపాపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఫార్మా పరిశ్రమ ఏర్పాటుపై లగచర్లలో ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడానికి వెళ్లిన కలెక్టర్, ఇతర అధికారులపై కుట్రపూరితంగా దాడులు చేశారని మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ అన్నారు. ఈ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. దాడిలో గాయపడిన కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) ప్రత్యేకాధికారి కె.వెంకట్‌రెడ్డిని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. హైదరాబాద్ ఎల్బీనగర్ నియోజకవర్గం హస్తినాపురం డివిజన్‌లోని ఆర్‌కేఆర్ ఎన్‌క్లేవ్ కాలనీలోని వెంకట్‌రెడ్డి ఇంటికి వెళ్లిన మంత్రులు.. ఆయన కుటుంబసభ్యులతోనూ మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ అధికారులు రాజకీయాలకు అతీతంగా పనిచేస్తారని, ప్రభుత్వ పరంగా వారు ప్రజల విజ్ఞప్తులను తెలుసుకునేందుకు వెళ్తే దాడులు చేస్తారా అని మండిపడ్డారు. అవసరమైతే ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలు తెలపాలన్నారు. కలెక్టర్ సహా అధికారులందరినీ గ్రామంలోకి తీసుకెళ్లి కుట్ర కోణంతోనే స్పష్టంగా దాడులకు పాల్పడినట్లు ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలకు కూడా అర్థమైందన్నారు. దాడులకు పురమాహించిన వారిని వదిలి పెట్టేది లేదన్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి కుట్రదారులపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అమాయకులు, సామాన్యులపై కేసులు ఉండవని.. సీఎం ఇదివరకే ఈ విషయాన్ని స్పష్టం చేశారన్నారు. మంత్రి దామోదర మాట్లాడుతూ.. కాంగ్రెస్ గత పదేళ్ల పాటు ప్రతిపక్షంలో ఉందని, ఏనాడు అధికారులపై దాడులు, హింసకు పాల్పడకుండా నిరసనలు తెలిపామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రోత్సాహంతోనే ఇది జరిగిందన్నారు. ఏదేమైనా భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. మంత్రుల వెంట చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీ, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మధుసూధన్‌రెడ్డి, ఇతర నేతలున్నారు.



కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిని పరామర్శిస్తున్న మంత్రులు దుద్దిళ్ల, దామోదర

దాడిని ప్రోత్సహించిన వారిని వదిలిపెట్టం

» ఘటనపై కేసీఆర్ క్షమాపణ చెప్పాలి: మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): "వికారాబాద్ జిల్లా కలెక్టర్‌పై దాడి చేసినవారు ఎంతటి వారైనా అరెస్టు కాక తప్పదు. దాడిని ప్రోత్సహించిన బీఆర్ఎస్ నాయకులను వదిలిపెట్టే ప్రసక్తే లేదు. కఠిన చర్యలు తీసుకుంటాం" అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొడంగల్ నియోజకవర్గంలో ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన అధికారులపై బీఆర్ఎస్‌కు చెందిన ఓ రౌడీషీటర్ ఆధ్వర్యంలో దాడులు జరిగాయని, అధికారం కోల్పోవడంతో ఒత్తిడిలో వారు దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దాడికి పాల్పడిన నేతలు ఫోన్‌లో కేటీఆర్‌తో మాట్లాడినట్లు సమాచారం ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపాలి తప్ప దాడులను ప్రోత్సహించవద్దన్నారు. దాడి ఘటనపై కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేటీఆర్‌పై విచారణకు గవర్నర్ నుంచి అనుమతి రావాల్సింది ఉందని, ఆయన చేసిన అక్రమాలు బయట పడుతున్నాయనే ఢిల్లీకి వెళ్లి లాబీయింగ్ చేస్తున్నారని ఆరోపించారు.

వైద్యశాఖలో ఓ ఉన్నతాధికారికి చార్జిమెమో

త్వరలో పదోన్నతి.. అయినా తప్పని తాఖీదు!

హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖలోని ఓ కీలక విభాగాధిపతికి సర్కారు షాక్ ఇచ్చింది. కొద్దిరోజుల్లో పదోన్నతి ఉండగా... సదరు ఇన్‌చార్జి హెచ్‌వోడీకి తాజాగా చార్జిమెమో జారీ చేసింది. ఆయనపై రెండు మూడు అంశాల్లో తీవ్ర ఆరోపణలు రావడంతో చార్జి మెమో జారీ చేసినట్లు సమాచారం. ఈ కారణంగా సదరు అధికారి పదోన్నతి జాబితా నుంచి తప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖలో కీలకమైన వైద్యవిద్య సంచాలకులు, ప్రజారోగ్య సంచాలకులు, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ పోస్టులను పదేళ్ల పాటు ఇన్‌చార్జిలతోనే నెట్టుకొచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వైద్య ఆరోగ్యశాఖలో డీఎంఈ, డీహెచ్‌లను మార్చేసింది. అదే సమయంలో హెచ్‌వోడీ పోస్టులన్నీ ఏపీకి వెళ్లినందున కీలకమైన విభాగాధిపతి పోస్టులను మంజూరు చేసింది. ఆ పోస్టుల్లో రెగ్యులర్ హెచ్‌వోడీలను భర్తీ చేసేందుకు తాజాగా సిద్ధమైంది.

గత సర్కారు హయాంలోనే...

కాగా ప్రస్తుతం ఇన్‌చార్జి హెచ్‌వోడీగా ఉన్న సదరు అధికారి గత బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో వైద్యశాఖలోని ఓ విభాగం ఇన్‌చార్జిగా పనిచేశారు. ఆ సమయంలో కొన్ని ఆరోపణలు రావడంతో నాటి ఉన్నతాధికారులు విచారణ జరిపారు. సదరు అధికారి అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడినట్లు, డబ్బులు చేతులు మారినట్లు ఆ విచారణలో తేలింది. దాంతో ఆ పోస్టు నుంచి తప్పించేశారు. అనంతరం ప్రభుత్వం మారడంతో సీనియారిటీలో ముందు వరుసలో ఉండటంతో సదరు అధికారికి ఇన్‌చార్జి హెచ్‌వోడీగా అవకాశం కల్పించారు. అయితే ఈ ఏడాది చేపట్టిన ఉద్యోగుల సాధారణ బదిలీల్లో కూడా సదరు అధికారిపై తీవ్రమైన ఆరోపణలు వచ్చాయి. దాంతో సర్కారు విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. మరోవైపు వైద్య ఆరోగ్యశాఖలో డిప్యూటేషన్లను ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో రద్దు చేసింది. ఎవరికైనా డిప్యూటేషన్, వర్క్ ఆర్డర్ కావాలంటే కచ్చితంగా వైద్య ఆరోగ్యశాఖ అనుమతి తీసుకోవాలి. అనుమతి వచ్చిన తర్వాతే వర్క్ ఆర్డర్ ఇవ్వాలి. అలాగే ఉద్యోగుల విజ్ఞప్తి లేఖలు ఉంటే ప్రభుత్వానికి పంపాలి. ఆ ఉద్యోగి కోరిన చోట పోస్టు ఖాళీగా ఉంటే డిప్యూటేషన్‌కు హెల్త్ సెక్రటరీ అనుమతి ఇస్తారు. అప్పుడు మాత్రమే సదరు ఉద్యోగికి డిప్యూటేషన్ ఇవ్వాలి. కానీ ఇటీవలి కాలంలో ప్రభుత్వ అనుమతి లేకుండానే సదరు హెచ్‌వోడీ పలువురు ఉద్యోగులకు డిప్యూటేషన్ ఇచ్చారు. అంతేగాక ఉద్యోగులు కోరుకున్నచోట పోస్టింగ్ వచ్చేలా సరెండర్‌లను ప్రోత్సహించారని ప్రభుత్వానికి సమాచారం అందింది. వైద్యశాఖలో ప్రస్తుతం డిప్యూటేషన్లకు అవకాశం లేకపోవడంతో కొందరు ఉద్యోగులు తెలివిగా క్షేత్రస్థాయి అధికారుల ద్వారా హెచ్‌వోడీ కార్యాలయానికి సరెండర్ చేయించుకుంటున్నారు. అలా చేయించుకున్న ఉద్యోగులకు ఎక్కడైనా పోస్టింగ్ ఇచ్చే అధికారం హెచ్‌వోడీలకు ఉంటుంది. ఆ వెసులుబాటును ఉపయోగించి సదరు హెచ్‌వోడీ ఇటీవల కాలంలో పలువురికి వారు కోరుకున్న చోట పోస్టింగ్ ఇచ్చినట్లు ప్రభుత్వానికి సమాచారం అందింది. దీని వెనుక కూడా పెద్దయెత్తున డబ్బులు చేతులు మారాయన్న ఆరోపణలున్నాయి. ఇటీవలే ఇటువంటి సరెండర్‌లపై సదరు హెచ్‌వోడీకి వైద్యఆరోగ్యశాఖ మంత్రి, ఉన్నతాధికారులు గట్టిగా క్లాసు తీసుకున్నట్లు సమాచారం. అయినా ఆయన తీరు మారలేదని వైద్యవర్గాలు చెబుతున్నాయి. అంతేకాకుండా జిల్లాల్లో పనిచేస్తున్న, తీవ్రమైన ఆరోపణలున్న కొందరు ఉద్యోగులను తన కార్యాలయంలో అత్యవసరం పేరుతో డిప్యూటేషన్‌పై తీసుకురావడంపైనా సర్కారు ఆగ్రహంగా ఉంది. ఈ నేపథ్యంలోనే తాజాగా చార్జిమెమో జారీ చేసినట్లు తెలుస్తోంది.

బాలబాలికలకు

బాలల దినోత్సవ శుభాకాంక్షలు: రేవంత్

- పాఠశాల విద్యా వ్యవస్థలో వినూత్న మార్పులకు శ్రీకారం
- నెహ్రూకు జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన సీఎం

హైదరాబాద్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): భారతదేశ తొలి ప్రధాన మంత్రి, స్వాతంత్ర సమరయోధులు జవహర్‌లాల్ నెహ్రూ జయంతి(నవంబరు 14వ తేదీ) సందర్భంగా ఆయనకు సీఎం రేవంత్ రెడ్డి గురువారం నివాళులు అర్పించారు. నెహ్రూ పుట్టిన రోజును జాతీయ బాలల దినోత్సవం నిర్వహించుకుంటాం కాబట్టి రాష్ట్రంలోని బాలబాలికలు అందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. నేటి బాలబాలికలే భావి భారత పౌరులని విశ్వసించి ప్రజాప్రభుత్వం పాఠశాల విద్యారంగంలో వినూత్నమైన మార్పులకు శ్రీకారం చుట్టిందని రేవంత్ వెల్లడించారు. విద్యా సంస్కరణల్లో భాగంగా నిపుణులతో కూడిన విద్యాకమిషన్ ఏర్పాటు, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, కొత్త నియామకాలు వంటివన్నీ పిల్లలకు బంగారు భవిష్యత్తు అందించాలన్న సంకల్పంలో భాగంగానే చేపట్టామని తెలిపారు. నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో ఏకీకృత గురుకుల పాఠశాలలకు (ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్) శ్రీకారం చుట్టామన్నారు. పిల్లలను జాతి సంపదగా భావించి వారి భవితవ్యం కోసం, నెహ్రూ ఆకాంక్షల మేరకు వారిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సీఎం కోరారు.

మహనీయుడు, నిత్య స్మరణీయుడు కాళోజీ

- సీఎం రేవంత్ నివాళి




ఢిల్లీలో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్

న్యూఢిల్లీ, హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజాకవి కాళోజీ నారాయణ రావు మహనీయుడని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. బుధవారం కాళోజీ వర్ధంతిని పురస్కరించుకుని ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 'అన్యాయాన్ని ఎదిరిస్తే నా గొడవకు సంతృప్తి... అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తి ప్రాప్తి... అన్యాయాన్ని ఎదిరించిన వాడే నాకు ఆరాధ్యుడు' అని ప్రకటించిన కాళోజీ నిత్య స్మరణీయుడని తెలిపారు. ప్రజాకవి కాళోజీ అందించిన పోరాట స్ఫూర్తితోనే మలిదశ ఉద్యమం ద్వారా ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామని మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పేర్కొన్నారు. తోటిమనిషి బాగును కోరుకోవడమే కాళోజీకి మనమందించే ఘన నివాళి ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

ప్రేయసిని చంపి.. చేలో పూడ్చి

భద్రాద్రి జిల్లాలో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి.... ఆరేళ్ల పాటు సహజీవనం చేసి... ఘాతుకం

- సహజీవనం చేస్తూ మరో మహిళతోపెళ్లి
- ముగ్గురూ ఒకే ఇంట్లో కాపురం.. కలహాలు
- హతురాలు మరో జంట ఆత్మహత్య కేసులో నిందితురాలు



బానోతు భద్రం, తోట స్వాతి (ఫైల్ ఫొటో)

జూలూరుపాడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు, యువతి ప్రేమ.. సహజీవనంతో మొదలైన కథ.. కక్షలతో మలుపులు తిరిగింది. ఒక మహిళపై హత్యాయత్నానికి, మరో జంట ఆత్మహత్యకు, చివరికి ఆ యువతి హత్యకు దారితీసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం మాచినేనిపేట తండాలో జరిగిన ఆమె హత్య ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హతురాలు భూపాలపల్లికి చెందిన తోట స్వాతి (32) ఆరేళ్ల కిందట కొత్తగూడెంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఆయాగా పనిచేసేందుకు వచ్చింది. మణుగూరు మండలం తోగ్గూడెం గ్రామానికి చెందిన ఆమె భర్త అప్పటికే అనారోగ్యంతో మృతిచెందాడు. స్వాతికి అదే పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న బానోతు భద్రంతో పరిచయం ఏర్పడి.. ప్రేమగా మారింది. అతని స్వస్థలం జూలూరుపాడు మండలం మాచినేనిపేట తండాలో ఇద్దరూ సహజీవనం మొదలుపెట్టారు. కొంతకాలానికి ఇద్దరూ పాఠశాలలో పని చేయడం మానేశారు. భద్రం స్వాతితో సహజీవనం చేస్తూనే గ్రామానికే చెందిన నందిని అనే యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. నందినితో వివాహం జరిగిన తరువాత కూడా స్వాతితో సహజీవనం కొనసాగించాడు. ముగ్గురూ కలిసి మాచినేనివారి తండాలో ఒకే ఇంట్లో ఉండేవారు. స్వాతి కొత్తగూడెంలోని ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తుండగా నందిని ఇంటి వద్దే ఉంటోంది. ఈ క్రమంలో వారి కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. నందినిపై స్వాతి అక్కసు పెంచుకుంది. నందినిని అడ్డు తొలగించుకోవాలని పన్నాగం పన్నింది. తనతో పాటు వస్త్ర దుకాణంలో పనిచేసే జూలూరుపాడు మండలం సాయిరాంతండాకు చెందిన వివాహితుడైన హలావత్ రత్నకుమార్‌తో సంబంధం పెట్టుకుంది. తన తండ్రి సింగరేణిలో పని చేస్తున్నాడని, అందులో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రత్నకుమార్ నుంచి రూ.15 లక్షలు, బంగారం తీసుకొంది. తరువాత నందినిని హత్య చేయించేందుకు రత్నకుమార్‌తో కుట్ర పన్నింది. సెప్టెంబరు 29న నందిని ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో రత్నకుమార్ వెళ్లి దాడి చేయగా ఆమె గాయపడింది. తన భర్త భద్రం, స్వాతి కలిసి తనను చంపేందుకు దాడి చేయించారని నందిని జూలూరుపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి ఆమె తన తల్లి ఇంటి వద్దే ఉంటుండగా భద్రం, స్వాతి కలిసి ఉంటున్నారు. నందినిపై దాడి విషయం బయటికొస్తుందన్న భయంతో పాటు, ఉద్యోగం కోసమని స్వాతికి డబ్బులు చెల్లించి అప్పులపాలు కావడంతో రత్నకుమార్, అతడి భార్య పార్వతి సెప్టెంబరు 30న కొత్తగూడెంలో పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్వాతి నమ్మించి డబ్బులు తీసుకొని మోసం చేయడంతోనే తన కుమారుడు, కోడలు ఆత్మహత్య చేసుకున్నారని రత్నకుమార్ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నందినిపై దాడి కేసు, రత్నకుమార్ దంపతుల ఆత్మహత్య కేసుల్లో స్వాతి విచారణ ఎదుర్కొంటోంది. తాను రత్నకుమార్ నుంచి రూ.8 లక్షలు తీసుకున్నానని, అందులో రూ.2 లక్షలు తన ప్రియుడు భద్రంకు ఇచ్చానని స్వాతి పోలీసుల ముందు అంగీకరించింది. ఆ డబ్బులను తిరిగి ఇచ్చేస్తానంటూ గడువు కోరింది. గడువు సమీపించడంతో తాను ఇచ్చిన రెండు లక్షలు ఇవ్వాలని భద్రంను అడగడంతో వారిద్దరి మధ్య వివాదం తలెత్తింది. దీంతో స్వాతి 15 రోజుల క్రితం పురుగులమందు తాగింది. అయితే ప్రాణాపాయం నుంచి బయటపడింది. ఈ నేపథ్యంలో కట్టుకున్న భార్యకు, కుమారుడికి దూరమయ్యానని, ఆర్థికంగా కష్టాలు వచ్చిపడ్డాయని, దీనికంతటికీ స్వాతే కారణమని భద్రం భావించాడు. ఆమెను ఎలాగైనా వదిలించుకోవాలని పథకం పన్నాడు. ఈ నెల 9న తన ఇంట్లోనే కత్తితో స్వాతి తలపై నరికి హత్య చేశాడు. తన తల్లి సరోజ సహాయంతో మృతదేహాన్ని అదే రోజు రాత్రి గోనెసంచిలో పెట్టి తన పత్తి చేనులో పూడ్చిపెట్టాడు. కేసుల విచారణ నిమిత్తం స్వాతిని తీసుకురావాలని పోలీసులు భద్రానికి సమాచారం అందించారు. అతను పోలీసుల వద్దకు వెళ్లి మూడు రోజుల నుంచి స్వాతి కనిపించడం లేదని, ఇంట్లో నుంచి వెళ్లిపోయిందని చెప్పాడు. అనుమానం వచ్చి పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించాడు.

శవాన్ని వెలికితీసి.. పోస్టుమార్టం

కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహ్మాన్, జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్‌ఐ రాణాప్రతాప్ బుధవారం మాచినేనిపేటతండాను సందర్శించారు. స్వాతి మృతదేహాన్ని వెలికితీయించి, పంచనామా, పోస్టుమార్టం చేయించారు. ఆమె బంధువులకు సమాచారం అందించగా, ఆమె తల్లిదండ్రులు ఎప్పుడో చనిపోయారని, ఆమెతో తమకు ఎలాంటి సంబంధాలు లేవని తెలిపారని సీఐ వెల్లడించారు. రెండు రోజుల పాటు కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో స్వాతి మృతదేహాన్ని ఉంచుతామని, వస్తే బంధువులకు, లేదంటే మునిసిపాలిటీకి అప్పగిస్తామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి బీ జ్యోతి ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

20న ప్రసార భారతి ఓటీటీ ప్రారంభం

- 60 డీడీ చానళ్లు సహా అలనాటి సినిమాలు, కార్యక్రమాలను ప్రేక్షకుల ముందుకు తెస్తాం
- చిన్న పట్టణాల్లోని 237 ఎఫ్ఎం చానళ్ల వేలం
- గేమింగ్ రంగంలో త్వరలో భారత్‌దే ఆధిపత్యం
- కేంద్ర సమాచార శాఖ కార్యదర్శి సంజయ్ జాజు

హైదరాబాద్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ తరహాలో.. ప్రసారభారతి ఓటీటీని అందుబాటులోకి తీసుకురానున్నట్లు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు ప్రకటించారు. ఈ నెల 20 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఐఎఫ్‌ఎఫ్‌ఐ)లో ప్రసార భారతి ఓటీటీని ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. దూరదర్శన్ ఫ్రీ డిష్‌లో అందుబాటులో ఉన్న 60 చానళ్లు.. ఇకపై ఓటీటీ ప్లాట్ ఫామ్‌లో అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. ఈ ఓటీటీ ద్వారా అలనాటి సినిమాలు, కార్యక్రమాలను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో ఇండియా గేమ్ డెవలపర్ కాన్ఫరెన్స్ బుధవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే సదస్సులో దేశ విదేశాలకు చెందిన గేమింగ్ డెవలపర్లు, నిపుణులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా సంజయ్ జాజు మాట్లాడుతూ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీ ద్వారా వీడియో గేమింగ్ రంగంలో నైపుణ్యాభివృద్ధికి సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ రంగాల్లో పని చేస్తున్న వారిని ప్రోత్సహించడానికి ఈ ఇనిస్టిట్యూట్‌ను నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. సమీప భవిష్యత్తులో భారత్ ప్రపంచ గేమింగ్ రంగంలో ఆధిపత్యం చెలాయిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 2025 ఫిబ్రవరి 5 నుంచి 9 వరకు జరిగే వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్టైన్మెంట్ సమ్మిట్(వేవ్స్) గురించి ప్రస్తావించారు. ఈ సదస్సు మొత్తం మీడియా, వినోద రంగాలకు అతిపెద్ద అనుసంధాన కార్యక్రమం అవుతుందని అన్నారు. భారత యువత ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పడం, పెట్టుబడిదారులను భారత్‌కు తీసుకురావడమే ఈ సదస్సు ఉద్దేశమని ఆయన అన్నారు. లక్ష లోపు జనాభా ఉన్న పట్టణాల కోసం 237 స్థానిక ప్రైవేట్ ఎఫ్ఎం రేడియో చానళ్లను సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ త్వరలో వేలం వేయనుందని కార్యదర్శి తెలిపారు.

స్పోర్ట్స్ కోటాలోనూ బోగస్‌లు

(మొదటిపేజీ తరువాయి)

పునఃపరిశీలనలో ఈ తప్పులు దొర్లాయని, తద్వారా అర్హులు కానీ వారు కొందరు ఉద్యోగాలకు ఎంపికైనట్లు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఖమ్మం జిల్లాలో ఇలాంటి ఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఆ జిల్లాలో పండిట్స్ పోస్టులకు ఎంపికైన వారిలో కొందరిని అనర్హులుగా గుర్తించారు. వీరిని ఉద్యోగాల నుంచి తొలగించారు. ఇందుకు బాధ్యులుగా ప్రధానోపాధ్యాయులను సస్పెండ్ చేశారు. అయితే, తాజాగా స్పోర్ట్స్ కోటాలో టీచర్ పోస్టులకు ఎంపికైన వారిలో కూడా కొందరు బోగస్ అభ్యర్థులున్నట్లు పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చాయి. దాంతో ఈ కోటా కింద ఎంపికైన అభ్యర్థులతో పాటు, ఎంపిక కానీ స్పోర్ట్స్ కోటా అభ్యర్థుల సర్టిఫికెట్లను పునఃపరిశీలించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఈ నెల 20 నుంచి 22వ తేదీల మధ్య దోమల్‌గూడలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీలో ఈ ధ్రువపత్రాల పునఃపరిశీలన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందు కోసం మొత్తం 393 మంది అభ్యర్థులకు సమాచారం అందించారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో మొత్తం సుమారు 100 ఉపాధ్యాయ పోస్టుల వరకు స్పోర్ట్స్ కోటా కోసం రిజర్వ్ చేశారు. అయితే, ఈ కోటాలో సుమారు 32 మంది అభ్యర్థులు టీచర్ పోస్టుల కోసం ఎంపికైనట్లు సమాచారం. సరైన సంఖ్యలో అభ్యర్థులు లేకపోవడంతో...ఈ కోటాలోని మిగిలిన పోస్టులను నాన్-స్పోర్ట్స్ కోటాలో భర్తీ చేశారు. అయితే... ఈ భర్తీ ప్రక్రియ ముగిసిన తర్వాత ఎంపిక కానీ అభ్యర్థుల నుంచి అనేక ఫిర్యాదులు వచ్చాయి. తమ సర్టిఫికెట్లు నిజమైనవే అయినప్పటికీ, అధికారులు వాటిని పరిగణలోకి తీసుకోలేదని, దాంతో తమకు ఉద్యోగ అవకాశం రాలేదనే ఫిర్యాదులు వచ్చాయి. దాంతో పాటు ఈ కోటాలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లపై కూడా పెద్ద స్థాయిలో ఫిర్యాదులు నమోదయ్యాయి. దాంతో ఈ వ్యవహారాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులు నిర్ణయించారు. అందులో భాగంగా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో పాటు, ఎంపిక కానీ స్పోర్ట్స్ కోటా అభ్యర్థులకు సంబంధించిన సర్టిఫికెట్లను మరోసారి పరిశీలించాలని షెడ్యూల్‌ను జారీ చేశారు.

అనర్హులుగా తేలితే ఉద్యోగాల తొలగింపు

ఇప్పటికే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు సంబంధించి తాజాగా నిర్వహించే ఈ సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో అనర్హులుగా తేలితే... వారి ఉద్యోగాలను తొలగించే అవకాశం ఉంది. అలాగే... ఇప్పటి వరకు ఉద్యోగాలకు ఎంపిక కానీ వారు.... ఈ సారి నిర్వహించే సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో అర్హులుగా స్పష్టమైతే ... వారికి ఉద్యోగాలను ఇచ్చే విషయాన్ని పరిశీలించే అవకాశం ఉంది. అయితే.... ఈ విషయంలో సాంకేతిక సమస్య తలెత్తే అవకాశం ఉంది. ఇప్పటికే స్పోర్ట్స్ కోటాలోని పోస్టుల మొత్తాన్ని భర్తీ చేశారు. కొత్తగా అర్హులను గుర్తిస్తే... వారికి ఉద్యోగం ఇవ్వడానికి ఖాళీ పోస్టులు ఉండవు. దాంతో ఈ విషయంలో ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ఒక అధికారి అభిప్రాయ పడ్డారు. కాగా, హైదరాబాద్ జిల్లాలో టీచర్ పోస్టులకు ఎంపికైన వారిలో సుమారు 20 మందిని విత్‌హోల్డ్ చేశారు. ఈ అభ్యర్థులు సమర్పించిన బోనఫైడ్ సర్టిఫికెట్లపై ఫిర్యాదులు వచ్చాయి. ముఖ్యంగా వీరు సమర్పించిన 1 నుంచి 7వ తరగతి బోనఫైడ్ సర్టిఫికెట్లు బోగస్‌వి అని ప్రాథమికంగా గుర్తించారు. దాంతో ఈ అభ్యర్థుల ఉద్యోగాలను రద్దు చేసే అవకాశం కనిపిస్తున్నది. దీనిపై త్వరలోనే అధికారులు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

సెల్‌ఫోన్లలోని 'గుట్టు' రట్టు!

చాట్ హిస్టరీని రిట్రీవ్ చేసిన ఎఫ్‌ఎస్‌ఎల్

- నలుగురు పోలీసులతో గత ప్రభుత్వ నేతల సంభాషణ
- ఎన్నికలు, ఇతర సందర్భాల్లో చేసిన చాటింగ్ బహిర్గతం
- ఎఫ్‌ఎస్‌ఎల్ నివేదిక ఆధారంగా ట్యాపింగ్ కేసులో ముందుకు..
- నేడు విచారణకు బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే లింగయ్య

హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో అధికారులు సాంకేతిక ఆధారాలతో ముందుకెళ్తున్నారు. ఈ కేసులో అరెస్టయిన నిందితుల సెల్‌ఫోన్లలో చెరిపేసిన సమాచారాన్ని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్‌ఎస్‌ఎల్) నిపుణులు తిరిగి (రిట్రీవ్) రాబట్టారు. అందులో కీలక సంభాషణలు బయటపడడంతో వాటి ఆధారంగా కేసు దర్యాప్తులో రెండో అంకాన్ని ప్రారంభించారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీగా పనిచేసిన రాధాకిషన్‌రావు, అదనపు ఎస్పీలు తిరుపతన్న, భుజంగరావు, డీఎస్పీ ప్రణీత్‌రావు నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లను పరిశీలించిన ఎఫ్‌ఎస్‌ఎల్ బృందం.. నిందితులు డిలీట్ చేసిన సమాచారంలో చాలా వరకు తిరిగి రాబట్టినట్లు తెలుస్తోంది. ఓ వైపు కాల్ డేటా రికార్డు (సీడీఆర్), మరోవైపు ఎఫ్‌ఎస్‌ఎల్ నివేదికతో అధికారులు కేసు దర్యాప్తులో ముందుకెళ్తున్నారు. ట్యాపింగ్ కేసులో పట్టుబడ్డ నలుగురు అధికారులు గత ప్రభుత్వంలోని కొందరు ముఖ్య నాయకులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల ఆదేశాల మేరకు పనిచేసిన తీరుపై ఆధారాలు లభించినట్లు తెలిసింది. ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకొని, 'పనులు' పూర్తి చేసినట్లు గుర్తించారు. కొన్ని సందర్భాల్లో వ్యక్తిగతంగా వాట్సాప్, టెలిగ్రామ్, సిగ్నల్ మాధ్యమాల్లో సమాచారం ఇచ్చిపుచ్చుకున్నారు. రిట్రీవ్‌లో బయటపడ్డ చాట్ ఆధారంగా బీఆర్‌ఎస్ నాయకులతో ఫోన్ ట్యాపింగ్ నిందితులు జరిపిన సంభాషణల్ని అధికారులు గుర్తించారు. రెండో దశ విచారణలో భాగంగా బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు సమన్లు జారీ చేశారు. గత సోమవారం విచారణకు హాజరుకావాల్సి ఉన్నా.. అనారోగ్యం కారణంగా గైర్హాజరయ్యారు. గురువారం తప్పకుండా విచారణకు వస్తానని దర్యాప్తు అధికారులకు సమాచారం ఇచ్చారు. లింగయ్య జూబ్లీహిల్స్ ఏసీపీ ఎదుట విచారణకు హాజరు కావాల్సి ఉంది. ప్రధానంగా ఈ కేసులో అరెస్టయిన తిరుపతన్నతో లింగయ్య జరిపిన వ్యవహారాలపై దర్యాప్తు అధికారులు ఆరా తీయనున్నారు. ఆయన కోసం ఇప్పటికే ప్రత్యేక ప్రశ్నావళిని రూపొందించారు. లింగయ్య ఇచ్చే సమాచారం ఆధారంగా కొందరికి నోటీసులు జారీ చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. హుజూరాబాద్ ఉప ఎన్నికతో పాటు గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో, ఇతర సందర్భాల్లో ప్రతిపక్ష నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల్ని లక్ష్యంగా చేసుకొని ట్యాపింగ్‌లు జరిపినట్లు ఇప్పటికే తేలింది. వచ్చే వారం ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ, కరీంనగర్‌కు చెందిన గత ప్రభుత్వ ముఖ్య నాయకులకు నోటీసులిచ్చి ప్రశ్నించనున్నట్లు సమాచారం.

భద్రత కల్పించండి -డీజీపీకి నందకుమార్ విజ్ఞప్తి

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో బీజేపీ నాయకుల బేరసారాల కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న నందకుమార్ అలియాస్ నందు తనకు భద్రత కల్పించాలని డీజీపీకి విజ్ఞప్తి చేశారు. నందకుమార్, ఇతర నిందితుల్ని అరెస్ట్ చేసిన సమయంలో అప్పటి సీఎం కేసీఆర్ స్వయంగా ప్రగతి భవన్‌లో ఆడియో టేపులు వినిపించారు. ఆ టేపులు ఫోన్ ట్యాపింగ్‌తో సేకరించినవేనని ఇదివరకే నందకుమార్ ఆరోపించడంతోపాటు దానిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పుడు ట్యాపింగ్ కేసు దర్యాప్తులో దూకుడు పెరగడం, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో తనకు భద్రత కల్పించాలని నందకుమార్ డీజీపీని కలిసి విజ్ఞప్తి చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.